RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 11.04.2025 | సంపుటి : 11 | సంచిక : 262 | పేజీలు : 12 | వెల: రూ. 4/-

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## వక్ఫ్ చట్టాన్ని సస్పెండ్ చేయండి

నిబంధనలను పునఃపరిశీలించండి

కేంద్రానికి మాయావతి విజ్ఞప్తి

వార్త 2లో

## కంచగచ్చిబౌలి భూములపై కేంద్రకమిటీ పరిశీలన


- ప్రభుత్వ అధికారులతో పర్యావరణ, అటవీ శాఖల కేంద్ర సాధికారిక కమిటీ భేటి
- హెచ్‌సీయూ విద్యార్థి సంఘం నేతలతో, బీఆర్ఎస్, భాజపా నేతలతోనూ వరుస భేటీలు
- కమిటీకి పూర్తిస్థాయి నివేదిక అందజేసిన ప్రభుత్వం

**హైదరాబాద్(జనంసాక్షి):**నగరంలోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో పర్యావరణ, అటవీ శాఖల కేంద్ర సాధికారిక కమిటీతో తెలంగాణ ప్రభుత్వ అధికారుల భేటీ ముగిసింది. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిని పరిశీలించేందుకు కేంద్ర సాధికారిక కమిటీ హైదరాబాద్‌కు వచ్చింది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది. అనంతరం అధికారులతో భేటీ అయింది. దాదాపు 3 గంటలపాటు ప్రభుత్వ అధికారులతో కమిటీ భేటీ అయింది. సీఎస్ శాంతికుమారి, పరిశ్రమల శాఖ కార్యదర్శి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, డీజీపీ జితేందర్, న్యాయశాఖ కార్యదర్శి తిరుపతి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమావేశానికి హాజరయ్యారు. 400 ఎకరాల భూమికి సంబంధించిన మిగతా 2లో..


కంచగచ్చిబౌలి భూముల్లో పరిశీలన చేస్తున్న కేంద్రకమిటీ

## విద్య, నైపుణ్యం సర్కారు ప్రధాన లక్ష్యం

### యంగ్ ఇండియాకు నిధుల కొరత లేదు : సీఎం రేవంత్




ఒక్కొక్కరిదీ ఒక్కో బ్రాండ్.. యంగ్ ఇండియా నా బ్రాండ్

సైనిక స్కూల్ తరహాలో పోలీస్‌స్కూల్

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ శంకుస్థాపనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

**హైదరాబాద్(జనంసాక్షి):** ఒక్కొక్కరికి ఒక బ్రాండ్ ఇమేజ్ ఉంటుందని...తన బ్రాండ్ యంగ్ ఇండియా అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ఇది ప్రతీ పోలీస్ సిబ్బందికి అత్యంత ముఖ్యమైనదని, ఎన్నికల మేనిఫెస్టోలోనే పోలీస్ స్కూల్ అంశాన్ని పొందుపరిచామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా, మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఆనాడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సారథ్యంలో దేశంలో యూనివర్సిటీలకు మిగతా 2లో..




## సన్నబియ్యం సర్కారుకు ప్రతిష్టాత్మకం

అర్హులందరికీ రేషన్ కార్డులిస్తాం

రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ



**హైదరాబాద్ (జనంసాక్షి):**తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ పథకం దేశవ్యాప్తంగా మరెక్కడా లేని విధంగా విస్తృతంగా కొనసాగుతోందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ పథకాన్ని పూర్తి పర్యవేక్షణతో నిర్వహించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. "ఇది సామాన్య ప్రజల జీవన ప్రమాణాన్ని మెరుగుపరిచే గొప్ప కార్యక్రమం. మూడు కోట్ల మందికి ప్రతి నెలా నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం మన తెలంగాణే. దేశంలో ఎక్కడా ఇటువంటి పథకం అమలులో లేదు," అని మంత్రి తెలిపారు. గతంలో సరఫరా చేస్తున్న దొడ్డు బియ్యం పేదలకు చేరకపోవడం వల్లనే ప్రభుత్వం సన్న బియ్యాన్ని ఎంపిక చేసిందని తెలిపారు. "అది మధ్యలోనే దారి మళ్లి, అసలు లబ్ధిదారులకు చేరకుండా తేడా వచ్చింది. అందుకే ఈసారి సన్న బియ్యాన్ని తీసుకువచ్చాం" అని వివరించారు. ఈ పథకం విజయవంతం కావాలంటే, ప్రతి ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో పథకం మిగతా 2లో..


ఢిల్లీ ఎయిర్‌పోర్టులో పోలీసులు అదుపులో ముంబయి ఉగ్రదాడి కేసు నిందితుడు తహవ్వుర్ రాణా

## ఎట్టకేలకు భారత్‌కు తహవ్వుర్ రాణా

ఢిల్లీ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేసిన ఎన్‌ఐఏ

బుల్లెట్‌ప్రూఫ్ వాహనంలో తిహాడ్ జైలుకు తరలింపు

హస్తినలోని పలు ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ముంబయి ఉగ్రదాడి కేసు నిందితుడు తహవ్వుర్ హుస్సేన్ రాణాను భారత్‌కు తరలించారు. అమెరికా నుంచి అతడిని తీసుకువచ్చిన విమానం గురువారం సాయంత్రం దిల్లీ విమానాశ్రయంలో దిగింది. రాణాను అదుపులోకి తీసుకున్న ఎన్‌ఐఏ అధికారులు.. మిగతా 2లో..

### భారత్‌కు ఇది అతిపెద్ద దౌత్య విజయం

అమిత్ షా

వార్త 2లో

### యూపీఏ సర్కార్ వల్లే..

అప్పగింత ప్రక్రియ మొదలు పెట్టింది మేమే.. మోదీ క్రెడిట్ కొట్టేయాలని చూస్తున్నాడు: కాంగ్రెస్

## పొంచిఉన్న 'అకాల'ముప్పు

రానున్న మూడు రోజుల పాటు ఉరుములు,మెరుపులతో భారీ వడగళ్ల వర్షం

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం • ఒక్కసారి చల్లబడిన వాతావరణం..

భారీ వానల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి: సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్(జనంసాక్షి):** నగరంలో పలు చోట్ల వర్షం కురుస్తోంది. ఉదయం నుంచే వాతావరణం చల్లబడగా.. వర్షం కురిసంది మియాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.మేడ్చల్, గగిల్లాపూర్ తదితర ప్రాంతాల్లో చిరు జల్లులు పడ్డాయి ఎస్ఆర్ నగర్, పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో వర్షాలు పడుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్‌లో ఇవాళ తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు కొనసాగే అవకాశం ఉందని వెల్లడించింది. నగరంలో రానున్న 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని పేర్కొంది.రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఇవాళ సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, మిగతా 2లో..

### ఈసారి ఆశాజనకంగానే వర్షాలు

ఆగస్టు, సెప్టెంబరులో భారీ వానలు

ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా

ఐఎండీ బులెటిన్ వచ్చే వారం విడుదల

9లో



## మాజీ ఎమ్మెల్యే షకీల్ అరెస్టు

**హైదరాబాద్(జనంసాక్షి):**భారాస నేత, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌ను శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రజాభవన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో మిగతా 2లో..




## ఆ భూములు హెచ్‌సీయూవే..

సీసీఎల్ఏకు 2012లోనే కలెక్టర్ లేఖ

చెట్లను నరికివేస్తే చర్యలేవీ

జింకలు చనిపోయినా పట్టించుకోరా?

కంచెగచ్చిబౌలి భూములపై నివేదిక ఇచ్చాం

మీడియా సమావేశంలో హరీశ్ రావు

**హైదరాబాద్(జనంసాక్షి):** చెట్ల నరికివేత విషయంలో పేద రైతుకు ఒక న్యాయం, రేవంత్ రెడ్డికి ఒక న్యాయం ఉంటదా.. అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. తాజ్‌కృష్ణ హోటల్‌లో సెంట్రల్ ఎన్విరాన్‌మెంట్ అడ్వైజర్ కమిటీకి కంచ గచ్చిబౌలి భూములపై ఫిర్యాదును ఇచ్చిన అనంతరం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కంచ గచ్చిబౌలిలో రాష్ట్ర ప్రభుత్వం నియమ నిబంధనలు ఉల్లంఘించి పండుగ రోజుల్లో, సెలవు దినాల్లో అడవుల విధ్వంసానికి వన్యప్రాణుల విధ్వంసానికి పాల్పడిన తీరును సెంట్రల్ ఎన్విరాన్‌మెంట్ అడ్వైజర్ కమిటీకి వివరించామని అన్నారు. ఈ రాష్ట్రంలో అడవుల విధ్వంసం, వన్య ప్రాణుల పట్ల ఎంత దారుణంగా వ్యవహరిస్తుందో పూర్తిగా మిగతా 2లో..

## అస్తవ్యస్తంగా సర్కారు

కాంగ్రెస్ అంటేనే కబ్జాలు, కక్షసాధింపులు: కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):** ఎస్ఆర్డీపీ పథకం కింద హైదరాబాద్‌లో చేపట్టిన పనులు 16 నెలల కాంగ్రెస్ పాలనలో నత్తనడకన సాగుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. పూర్తయినవాటికి సున్నాలేసి రిబ్బన్ కటింగ్ చేశారు కానీ నిర్మాణంలో ఉన్నవాటి పురోగతిని సమీక్షించకుండా గాలికి వదిలేశాని మండిపడ్డారు. కాంగ్రెస్ అంటే కమిషన్లు దండుకోవడం, కబ్జాలు చేసుకోవడం, కక్ష తీర్చుకోవడమేనా అని ప్రశ్నించారు. హైడ్రా, మూసీ పేరుతో పేదల ఇండ్ల కూల్చివేతల మీద ఉన్న శ్రద్ధ మిగతా 2లో..



## సుంకాలపై బీజింగ్‌తో ఒప్పందంపై ఆలోచిస్తున్నాం

జిన్‌పింగ్ చాలా స్మార్ట్.. టారీఫ్‌ల నేపథ్యంలో ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు

**వాషింగ్టన్(జనంసాక్షి):**చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే ఆ దేశ దిగుమతులపై 125 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో జిన్‌పింగ్‌పై ప్రశంసలు కురిపించడం గమనార్హం. ఈ సందర్భంగా సుంకాలపై బీజింగ్ అమెరికాతో ఓ ఒప్పందం కుదుర్చుకోవాలని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో మిగతా 2లో..



## యూదులకు వ్యతిరేకంగా పోస్టులు పెడితే వీసా రానట్టే..

- గ్రీన్‌కార్డులు కూడా మంజూరుచేయబోం
- ఈ నిబంధన తక్షణమే అమల్లోకి వస్తుంది
- అమెరికా ప్రభుత్వం మరో కీలక నిర్ణయం

**వాషింగ్టన్(జనంసాక్షి):**వలసదారుల విషయంలో కఠిన నిబంధనలు అమలుచేస్తోన్న అమెరికా సర్కారు.. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. సోషల్ మీడియాలో యూదు వ్యతిరేక పోస్టులు పెట్టినట్లు తేలితే వారికి వీసాలు గ్రీన్‌కార్డులు మంజూరుచేయబోమని గట్టి షాకిచ్చింది. ఈనిబంధన తక్షణమే అమల్లోకి వస్తుందని వెల్లడించింది. స్టూడెంట్ వీసాలు మొదలుకొని గ్రీన్‌కార్డ్స్ దరఖాస్తుదారుల వరకు అందరి సామాజిక మాధ్యమాలపై నిఘా ఉంచుతున్నామని యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ స్పష్టంచేసింది. ఉగ్రవాద సంస్థలుగా అమెరికా వర్గీకరించిన హమాస్, పాలస్తీనియన్ ఇస్లామిక్ జిహాద్, లెబనాన్ హెజ్‌బొల్లా, యెమెన్ హూతీల వంటి గ్రూప్‌లకు మద్దతు ఇస్తే.. వాటిని యూదు వ్యతిరేక చర్యలుగా పరిగణిస్తామని అమెరికా తెలిపింది. అలాంటి ఉగ్ర కార్యకలాపాలను ప్రచారం చేసినా.. వాటి గురించి సామాజిక మాధ్యమాల్లో అనుకూలంగా పోస్టులు పెట్టినా తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది." ఉగ్రవాద సానుభూతిపరులకు అమెరికాలో స్థానం లేదు. అలాంటివారిని మా దేశంలోకి రానివ్వాల్సిన, ఇక్కడ ఉంచుకోవాల్సిన అవసరం మాకు లేదు" అని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ కార్యదర్శి ట్రికియా మెక్‌లాఫ్లిన్ వెల్లడించారు. అలాంటి పోస్టులు పెట్టేవారికి వీసా జారీ చేయబోమని, శాశ్వత నివాసానికి దారులు మూసుకుపోయినట్లేనని తెలిపారు. ఇప్పటికే వీసా ఉన్నవారు అలాంటి పోస్టులు పెడితే.. వారి నివాస హోదా రద్దవుతుందని తేల్చి చెప్పారు. ఈ ఏడాది జనవరిలో అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ అధికారం చేపట్టిన నాటినుంచి మిగతా 2లో..

## ట్రంప్ టారీఫ్‌లపై తెలివిగా వ్యవహరిస్తున్నాం

ఈ అంశాన్ని భారత్ జాగ్రత్తగా హ్యాండిల్ చేస్తోంది :పీయూష్ గోయల్

**ముంబయి(జనంసాక్షి):**అమెరికా సుంకాల విషయంలో భారత్ చాలా తెలివిగా వ్యవహరిస్తోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు.అమెరికాతో వాణిజ్యాన్ని రెండున్నర రెట్లు పెంచుకోవడంపై తాము దృష్టి సారించామని పేర్కొన్నారు. వివిధ మిగతా 2లో..



## కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ విషప్రచారం

సమాచార లోపం వల్లే బీసీ దీక్షకు రాహుల్ గాంధీ రాలేదు

దమ్ముంటే భారాస ఆవిర్భావ దినోత్సవం రోజున బీసీ వ్యక్తిని ఆ పార్టీ అధ్యక్షుడిగా నియమించాలి: ఎంపీ చామల సవాల్



**హైదరాబాద్(జనంసాక్షి):** కాంగ్రెస్ పాలనపై హరీశ్‌రావు విష ప్రచారం చేస్తున్నారని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం నిర్వహించిన ఏఐసీసీ సమావేశాల్లో రేవంత్ పాలనను రాహుల్ గాంధీ ప్రశంసించారని చెప్పారు."సమాచార లోపం వల్లే దిల్లీలో కాంగ్రెస్ బీసీ దీక్షకు రాహుల్ గాంధీ రాలేదు. హరీశ్‌రావు ఏదో ఒక వంకతో కాంగ్రెస్ నేతలపై విషప్రచారం చేస్తున్నారు. మా పార్టీలో పీసీసీ ప్రెసిడెంట్‌గా బీసీ వ్యక్తి ఉన్నారు. భారాసలో అలాంటి పరిస్థితి ఉందా?. రానున్న భారాస 25వ ఆవిర్భావ దినోత్సవం రోజు బీసీ వ్యక్తిని ఆ పార్టీ అధ్యక్షుడిగా నియమించాలి" అని సవాల్ విసిరారు.

## కంచగచ్చిబౌలి భూములపై కేంద్రకమిటీ క్షేత్రస్థాయి పరిశీలన

రికార్డులు, ప్రభుత్వ విధివిధానాలు, ఈ క్రమంలో చోటుచేసుకున్న పరిణామాలపై పూర్తి వివరాలతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కమిటీకి నివేదిక సమర్పించారు.కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ఇవాళ కమిటీ వరుస సమావేశాలు నిర్వహించింది. ఉదయం భూములను సందర్శించిన కమిటీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితులపై వివరాలను తెలుసుకుంది. అనంతరం ఎంసీహెచ్ఆర్డీలో విద్యార్థి సంఘాల నేతలతో భేటీ అయి.. వివరాలు సేకరించింది. తాజ్ కృష్ణలో భారాస నేతలతో భేటీ అయింది. మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు నేతృత్వంలోని బృందం ఈ వ్యవహారంపై కమిటీకి నివేదిక ఇచ్చింది. హెచ్‌సీయూ పాలకవర్గం, భాజపా ఎంపీలతోనూ భేటీ అయిన కమిటీ.. భూముల అంశంపై సమగ్ర వివరాలు తీసుకుంది.టీజీఐఐసీ ఈ భూములను చదును చేపట్టిన నేపథ్యంలో.. సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నివేదిక అందజేయాలని కమిటీకి సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే బుధవారం సెంట్రల్ ఎంపవర్ కమిటీ ఛైర్మన్ సిద్ధాంత దాస్, మరో ఇద్దరు సభ్యులు హైదరాబాద్‌కు వచ్చారు. వీరు కంచ గచ్చిబౌలి భూముల్లో పరిశీలన జరిపి.. వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేసి సుప్రీంకోర్టుకు నివేదిక అందించనున్నారు. అంతకుముందు సెంట్రల్ ఎంపవర్ కమిటీ ఛైర్మన్ సిద్ధాంత దాస్, మరో ఇద్దరు సభ్యులు హైదరాబాద్‌కు చేరుకున్నారు. వీరు 10, 11 తేదీల్లో కంచ గచ్చిబౌలి భూముల్లో పరిశీలన జరిపి.. వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేయనున్నారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించే అవకాశాలున్నాయి. కాగా, భూములు ప్రభుత్వానివేనంటూ టీజీఐఐసీ అధికారులు పలుచోట్ల బోర్డులు పెట్టారు. కమిటీ రాక నేపథ్యంలో హెచ్‌సీయూలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈస్ట్ క్యాంపస్‌కు వెళ్లే రహదారిని దిగ్బంధనం చేశారు.

## ఆ భూములు హెచ్‌సీయూవే..

ఆధారాలతో సహా కమిటీకి అందజేశాం. కమిటీ కొన్ని ప్రశ్నలు వేస్తే వాటికి కూడా వివరంగా సమాధానం ఇచ్చామని హరీశ్‌రావు తెలిపారు. ఒక పేద రైతు తన పొలంలో ఉన్న చింత చెట్టునో, వేప చెట్టును నరికేస్తే ఎమ్మార్వో, ఎస్ఐ వచ్చి కేసులు పెడుతుంటారు. లక్షల రూపాయాల పెనాల్టీ విధిస్తుంటారు. కంచ గచ్చిబౌలిలో వందలాది ఎకరాల్లో వేలాది చెట్లు- నరుకుతుంటే రెవెన్యూ, ఫారెస్టు డిపార్ట్‌మెంట్ ఏం చేస్తుందని ప్రశ్నించారు. పేద రైతుకు ఒక న్యాయం.. రేవంత్ రెడ్డికి ఒక న్యాయం ఉంటదా..అని హరీశ్‌రావు పేర్కొన్నారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌తో పాటు- నగరంలో ఎక్కడైనా ఇల్లు కట్టాలంటే.. వాల్టా చట్ట ప్రకారం.. గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ. 50, పట్టణ ప్రాంతాల్లో అయితే రూ. 100 చలాన్ కట్టి.. ఇల్లు కట్టాలని చెట్లు నరికేస్తున్నానని దరఖాస్తు చేయాలి. ఆ దరఖాస్తు పరిశీలించిన తర్వాత కమిటీ ఒక్కొక్క చెట్టుకు రూ. 450 డిపాజిట్ చేయమని చెబుతుంది. ఒక చెట్టు కొడితే రెండు చెట్లు- పెంచాలని సూచిస్తుంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం దరఖాస్తు పెట్టలేదు.. అటవీశాఖ అనుమతి తీసుకోలేదు. అటవీ భూముల్లోనే కాదు.. సొంత పట్టా భూమి, ఇంటి నిర్మాణంలోనూ చెట్లు కొడితే అనుమతి తీసుకోవాల్సిందేనని చట్టం చెబుతుంది. లక్షల రూపాయాలు పెనాల్టీ వేస్తుంటారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం వేలాది చెట్లను నరికేస్తుంది. పోలీసుల రక్షణలో 50 బుల్డోజర్లు పెట్టి చెట్లను ఊచకోత కోశారు అని హరీశ్‌రావు తెలిపారు.ఒక్క జింకను చంపిన సల్మాన్‌ఖాన్‌ను జైల్లో వేశారు.. మరి మూడు జింకలను చంపిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై చర్యలేవి అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కంచ గచ్చిబౌలిలో మూడు జింకలు చనిపోయాయని ఆధారాలతో సహా బయటకు వచ్చాయి. గూడును చెదరగొట్టడంతో దిక్కులేక కుక్కల దాడిలో జింకలు చనిపోయాయి. సల్మాన్‌ను ఒక జింకను చంపితే జైల్లో వేశారు. మరి మూడు జింకల మరణానికి కారణమైన రేవంత్ రెడ్డిపై న్యాయపరమైన చర్య తీసుకోవాలి కదా.. అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## సుంకాలపై బీజింగ్‌తో ఒప్పందంపై ఆలోచిస్తున్నాం

విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు 'చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు ఎప్పుడు ఏం చేయాలో బాగా తెలుసు. దేశం అంటే ఆయనకు ఎంతో ప్రేమ. ఆ విషయం నాకు బాగా తెలుసు. జిన్‌పింగ్ గురించి కూడా తెలుసు. ఈ సుంకాలపై ఒక ఒప్పందం కుదుర్చుకుంటారని నేను అనుకుంటున్నా. త్వరలోనే దీనిపై చర్చించేందుకు అక్కడి (చైనా) నుంచి మాకు ఫోన్ కాల్ వస్తోందని భావిస్తున్నా. దానికి మేం సిద్ధంగా ఉన్నాం' అని ట్రంప్ పేర్కొన్నారు. పలు దేశాలపై విధించిన సుంకాలపై ట్రంప్ వెనక్కి తగ్గిన విషయం తెలిసిందే. 90 రోజుల పాటు ఆయా టారిఫ్‌లను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఈక్రమంలో వాటిపై 10 శాతం సుంకాలు అమల్లో ఉంటాయన్నారు. ఈనేపథ్యంలోనే చైనాపై 125 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే డ్రాగన్ దిగుమతులపై ఉన్న 20 శాతం సుంకాలకు అదనంగా 34 శాతం విధిస్తున్నట్లు ఇటీవల ట్రంప్ ప్రకటించారు. దీనిపై డ్రాగన్ దీటుగా స్పందించింది. ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 34 శాతం అదనపు సుంకం విధించాలని నిర్ణయించింది (%జప్త్రఱఱఖ ˉఖతీఱటటం%). డ్రాగన్ నిర్ణయంపై ట్రంప్ భగ్గుమన్నారు. ఆ దేశానికి డెడ్‌లైన్ పెట్టి నిర్ణయాన్ని వెనక్కి తగ్గాలని, లేదంటే 104 శాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు. దీంతో బీజింగ్ అమెరికా ఉత్పత్తులపై 84 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే చైనాపై మరో 50 శాతం కలిపి మొత్తంగా 125 శాతం టారిఫ్‌ను విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

## ట్రంప్ టారీఫ్‌లపై తెలివిగా వ్యవహరిస్తున్నాం

దేశాలపై విధించిన సుంకాలను ట్రంప్ 90 రోజుల పాటు నిలిపివేసిన వేళ ఆయన ముంబయిలో విలేకరులతో మాట్లాడారు. ఇరు దేశాలపై మధ్య ద్వైపాక్షి సంబంధాలను, సులభతర వాణిజ్యం కోసం ప్రధాని నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమక్షంలో ఇరు దేశాలు ఫిబ్రవరిలోనే ఓ ఒప్పందం చేసుకున్నాయని గోయల్ అన్నారు. దీనివల్ల ఇరు దేశాల వాణిజ్యం 500 బిలియన్ డాలర్లకు చేరుతుందన్నారు. గతంతో పోలిస్తే ఈ మొత్తం రెండున్నర రెట్లు అధికం అన్నారు. దీనివల్ల మరింత మంది ఉద్యోగ అవకాశాలు వస్తాయని, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చల్లో పురోగతి ఉందని, ఇందులో భారత్‌దే పైచేయి అని పీయూష్ గోయల్ పేర్కొన్నారు. అంతకుముందు వాణిజ్య ఒప్పందాలపై పరిశ్రమ వర్గాల ప్రతినిధులతో భేటీ అయిన ఆయన.. వాణిజ్యం గురించి మాట్లాడారు. ప్రభుత్వానికి దేశ ప్రయోజనాలే ముఖ్యమని, వికసిత భారత్ 2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో ఈ ద్వైపాక్షిక ఒప్పందం దోహదపడుతుందని పీయూష్ గోయల్ అన్నారు.

# విద్య,నైపుణ్యం సర్కారు ప్రధాన లక్ష్యం



పునాదులు పడ్డాయని, నెహ్రూ దార్శనికతతోనే మన దేశం ప్రపంచ దేశాలతో పోటీ పడే స్థాయికి చేరిందన్నారు. దేశ చరిత్రలో ఎంతో మంది ప్రధానులు, ముఖ్యమంత్రులు అయ్యారని, కానీ అందులో కొద్ది మంది మాత్రమే చరిత్రలో గుర్తుండి పోయారని అన్నారు. ఆ కొద్దిమంది తీసుకున్న నిర్ణయాలు చరిత్రను మలుపు తిప్పాయని, ముఖ్యమంత్రుల్లో ఒక్కొక్కరికి ఒక్కో బ్రాండ్ ఉందని చెప్పుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రూ.2 కిలో బియ్యంతో ఎన్టీఆర్ ప్రతీ పేదవాడి మనసులో స్థానం సంపాదించుకున్నారని, హైదరాబాద్‌లో ఐటీని అభివృద్ధి చేసి చంద్రబాబు నాయుడు ఒక బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారని ముఖ్యమంత్రి కొనియాడారు. రైతు బాంధవుడిగా ప్రజలు వైఎస్‌ను గుర్తుంచు కుంటారని, అలాగే ఇవాళ తాను క్రియేట్ చేసిన తన బ్రాండ్ 'యంగ్ ఇండియా' మహాత్ముడి స్ఫూర్తితో యంగ్ ఇండియా బ్రాండ్‌ను తెలంగాణలో క్రియేట్ చేసుకున్నామని అన్నారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని, అందుకే ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ అనేది మా బ్రాండ్ అని, నిరుద్యోగుల్లో సాంకేతిక నైపుణ్యంలో శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ-ని ఏర్పాటు- చేసుకున్నామన్నారు. ఆనంద్ మహేంద్రను యూనివర్సిటీకి చైర్ పర్సన్‌గా నియమించుకున్నామని, ఇవాళ యూనివర్సిటీలో చేరిన ప్రతీ విద్యార్థికి ఉద్యోగ భద్రత ఉందని, దేశంలోనే ది బెస్ట్ యూనివర్సిటీగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వచ్చే ఒలంపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, అకాడమీని ఏర్పాటు- చేసుకోబోతున్నామని చెప్పారు. ప్రతీ నియోజక వర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు. ప్రాథమిక స్థాయిలోనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకోకపోవడంతో విద్యార్థుల సంఖ్య తగ్గుతుతోందని అన్నారు. ఒకటో తరగతి నుంచి ఉన్న ప్రభుత్వ స్కూల్స్ విధానంలో మార్పులు తీసుకొచ్చి... ప్రీ-స్కూల్ విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. సైనిక్ స్కూల్‌కు ధీటుగా పోలీస్ స్కూల్‌ను తీర్చి దిద్దాలని.. ఇందుకు కావాల్సిన నిధులు ప్రభుత్వం ఇవ్వడానికి సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. పోలీస్ స్కూల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడం మనందరి బాధ్యతని.. సామాజిక బాధ్యతగా ప్రైవేటు- కంపెనీలు పోలీస్ స్కూల్‌కు ఆర్థిక సాయం అందించాలని కోరారు. పోలీస్ స్కూల్ కోసం రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ క్రియేట్ చేసుకోవాలని.. ఇందుకు అవసరమైన అనుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కొందరు తీసుకున్న నిర్ణయాలే చరిత్రలో నిలిచి పోతాయి.. ఎవరికి నచ్చినా నచ్చకపోయినా.. పీవీ సంస్కరణలు గుర్తించాల్సిందే.. అధికారులకు విజ్ఞప్తి.. మేము విధివిధానాలు సృష్టిస్తాం.. దాన్ని అమలు చేయాల్సింది మీరు.. నా బ్రాండ్ యంగ్ ఇండియా..అన్నారు. యంగ్ ఇండియా యూనివర్సిటీ ఏర్పాటు చేసుకుంటున్నాం.. ఒక్కొక్కరికి ఒక్కో బ్రాండ్ ఉంటుంది.. నా బ్రాండ్ యంగ్ ఇండియా అని తెలిపారు. సౌత్ కొరియా ఒక చిన్న స్పోర్ట్స్ యూనివర్సిటీ దేశ ఖ్యాతిని పెంచింది.. ఇంత పెద్ద దేశంలో ఒలంపిక్స్ లో చిన్న మెడల్ కూడా రాలేదు.. ఇంజనీరింగ్ పట్టా తీసుకుని పోతే.. తల్లిదండ్రులకు సంతోషం.. ఉద్యోగాల కోసం కంపెనీలకు పోతే.. అప్లికేషన్ కూడా నింపలేని పరిస్థితి.. యంగ్ ఇండియా స్కూల్ యూనివర్సిటీని బెస్ట్ యూనివర్సిటీగా రూపొందిస్తాం.. రాజకీయ ఆలోచనలు చేయలేదు స్కిల్ యూనివర్సిటీలో.. సక్సెస్ ఉన్న కంపెనీలు ఇందులో భాగస్వామ్యం అయ్యాయి.. యంగ్ ఇండియా స్కూల్ యూనివర్సిటీలో చేరిన వాళ్ళకి 100 శాతంఉద్యోగాలు వచ్చాయి.. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ-లో కూడా పెద్ద కంపెనీలు పోటీ- పడుతున్నాయి.. పోలీసులకు యంగ్ ఇండియా స్కూల్ అత్యంత ముఖ్యమైందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 16నెలలైనా బ్రాండ్ ఎందుకు సృష్టించుకోలేదని నన్ను కొందరు అడుగుతున్నారు. యంగ్ ఇండియాలో చదువు, ఉపాధే నా బ్రాండ్. కొందరు ఉద్యమ నేతలం, తెలంగాణ ప్రదాతలమని అనుకుంటున్నారు. దేశానికే దార్శనికుడు పీవీ నరసింహారావు. యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని స్థాపించాం. దేశ భవిష్యత్తు తరగతి గదిలో ఉంది. కేజీ టు- పీజీ వరకు నిధుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రావు. యంగ్ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్‌ను సమకూర్చుకోవాలి. నిధుల విషయంలో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని రేవంత్‌రెడ్డి తెలిపారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్ లో కనీస వసతులు లేవు.. ప్రతి నియోజక వర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నాం.. 25 ఎకరాల్లో స్కూల్.. ప్రతీ స్కూల్ కి 200 కోట్లు-.. విద్యా విధానంలో చిన్న గ్యాప్ ఉంది.. ప్రైవేటు- స్కూల్ లో విద్యార్థులు ఎక్కువ.. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యావంతులు.. కానీ ఇక్కడ చదివే పిల్లలు 18 లక్షల మందే చదువుతున్నారు.. నర్సరీ.. కూడా ప్రభుత్వ స్కూలులో ఏర్పాటు చేయాలని.. ప్లే స్కూల్ పెట్టాలని మా ఆలోచన.. త్వరలోనే అమలులోకి తెస్తాం.. సైనిక్ స్కూల్ తో మనం పోటీ- పడాలని అన్నారు.నేను ఉన్నంత కాలం మీకు నిధులు.. అనుమతులకు లోటు ఉండదని అన్నారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, కమిషనర్ సివి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### అస్తవ్యస్తంగా సర్కారు

నిర్మాణాల మీద లేదా అని నిలదీశారు. అభివృద్ధి అంటే భూములను చెరబట్టడం, బుల్డోజర్లను ఉసిగొల్పడం కాదని ఎక్స్ వేదికగా దుయ్యబట్టారు. నాడు వాయువేగంతో ఎస్ఆర్డీపీ పథకం కింద ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ బ్రిడ్జీలు నిర్మించాం. కానీ 6 నెలల కాంగ్రెస్ పాలనలో నత్తనడకన సాగుతున్న పనులు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఫలక్ నుమా ఆర్వోబీని పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ప్రతిపక్షాల మీద అక్రమ కేసులు పెట్టి చంచల్ గూడా జైలుకు పంపే శ్రద్ధ దాని ముందున్న ఫ్లై ఓవర్ పూర్తి చేయడంపై లేదని మండిపడ్డారు.

## వక్ఫ్ చట్టాన్ని సస్పెండ్ చేయండి

పాట్నా(జనంసాక్షి):వక్ఫ్ చట్టంలోని నిబంధనలను పునఃపరిశీలించి, ప్రస్తుతానికి దానిని నిలిపివేయాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి గురువారం కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డ్‌లో చేర్చడానికి వీలుకల్పిస్తూ నిబంధనలు మార్చడం ఏమాత్రం మంచిది కాదని ఆమె అన్నారు.వక్ఫ్ సవరణ చట్టంపై ఏప్రిల్ 3న లోక్‌సభలో ఓటింగ్ జరిగింది. ఈ బిల్లుకు అనుకూలంగా 288 మంది సభ్యులు, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు. దీనితో లోక్ సభలో చాలా సులువుగా ఈ బిల్ పాస్ అయిపోయింది. ఏప్రిల్ 4న ఈ బిల్లుపై రాజ్యసభలో 13 గంటలకు పైగా చర్చ జరిగింది. తరువాత జరిగిన ఓటింగ్‌లో ఈ బిల్లుకు 128 మంది సభ్యులు అనుకూలంగా, 95 మంది సభ్యులు వ్యతిరేకంగా ఓటు వేశారు. దీనితో రాజ్య సభలోనూ ఈ బిల్లు ఆమోదం పొందింది. ఈ విధంగా పార్లమెంట్ ఆమోదంతో వచ్చిన బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏప్రిల్ 5న ఆమోద ముద్ర వేశారు. దీనితో ఇది చట్టంగా మారింది. ఈ చట్టం ఏప్రిల్ 8 నుంచే అమల్లోకి వచ్చింది.కేంద్రం తీసుకొచ్చిన ఈ కొత్త వక్ఫ్ చట్టం రాజ్యాంగ విరుద్ధమని ముస్లిం సంఘాలు ఆరోపణలు చేస్తున్నాయి. దీనిపై విపక్ష పార్టీల ఎంపీలు, ముస్లిం సంఘాల ప్రతినిధులు ఇప్పటికే సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం ఏప్రిల్ 16న విచారణ జరపనుంది. దీనిపై కేంద్రం కేవియట్‌ను దాఖలు చేసింది. తమ అభిప్రాయం తెలుసుకోకుండా ఎలాంటి ఆదేశాలూ జారీ చేయొద్దంటూ ఈ పిటిషన్‌లో పేర్కొంది.

## మాజీ ఎమ్మెల్యే షకీల్ అరెస్టు

ఆయనపై గతంలో లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. గత కొన్ని నెలలుగా షకీల్ దుబాయ్‌లో ఉంటున్నారు. తల్లి అంత్యక్రియల కోసం గురువారం హైదరాబాద్ చేరుకోగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఆయనకు అనుమతించారు. ఆ తర్వాత షకీల్‌ను విచారించే అవకాశముంది. షకీల్ కుమారుడు సాహిల్ గతంలో కారును వేగంగా నడుపుతూ ప్రజాభవన్ ఎదుట ట్రాఫిక్ బారికేడ్లను ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఈ కేసు నుంచి కుమారుడిని తప్పించేందుకు మాజీ ఎమ్మెల్యే ప్రయత్నించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయనపైనా పోలీసులు కేసు నమోదు చేసి లుకౌట్ నోటీసులు జారీ చేశారు.


## యూదులకు వ్యతిరేకంగా పోస్టులు పెడితే వీసా రానట్టే..

వలసదారులపై ట్రంప్ కఠిన వైఖరి ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా పాలస్తీనా అనుకూల ఆందోళనలు చేస్తున్నారన్న కారణంతో విదేశీ విద్యార్థుల వీసాలు రద్దు చేసి వారిని దేశం నుంచి పంపిస్తున్నారు. గత నెల 300 మందికి పైగా విదేశీయుల వీసాలను రద్దు చేసినట్లు విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇటీవల వెల్లడించారు. ఇక, చిన్నచిన్న తప్పులకు సైతం వీసాలను రద్దు చేస్తామని ఇప్పటికే హెచ్చరించిన సంగతి తెలిసిందే. వేగంగా వాహనం నడిపినా వీసా క్యాన్సిల్ చేస్తున్నట్లు ఇటీవల కథనాలు వచ్చాయి.

## 'ఏఐ'తో పెనుముప్పు

### దీని వల్ల సాంకేతిక యుద్ధం మొదలైంది: రాజ్‌నాథ్ సింగ్

**చెన్నై(జనంసాక్షి):** రాజకీయ, సైనిక లక్ష్యాలను సాధించుకునేందుకు కొందరు సైబర్ దాడులను సాధనాలుగా వినియోగిస్తున్నారని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం కూడా ఇందులో ఓ భాగమని వ్యాఖ్యానించారు. తమిళనాడులోని డిఫెన్స్ సర్వీస్ స్టాఫ్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రస్తుతం కొనసాగుతున్న సంఘర్షణలు, పరిస్థితులు సంప్రదాయ యుద్ధాలకు భిన్నంగా మారుతున్నాయని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ''నానాటికీ అభివృద్ధి చెందుతున్న సాంకేతికత మానవ ప్రమేయం లేని వ్యవస్థను సృష్టిస్తోంది. చాలా విషయాలను ఏఐ అంచనా వేయడం చూస్తున్నాం. ఇప్పుడు సంప్రదాయ యుద్ధాలు (భూమి, జల, వాయు మార్గాల్లో చేసే యుద్ధం) చేసుకునే కాలం పోయింది. ఏఐ రాకతో సాంకేతిక యుద్ధం జరుగుతోంది'' అని ప్రసంగించారు. ''ప్రస్తుతం మనమంతా 'గ్రే జోన్', హైబ్రిడ్ యుద్ధ శకంలో ఉన్నాము. రాజకీయ, సైనిక లక్ష్యాలను సాధించుకోవడానికి కొందరు సైబర్ దాడుల ను వినియోగిస్తున్నారు. ఆర్థిక యుద్ధం అనేది ఒక్క తూటా కూడా పేల్చకుండా రాజకీయ, సైనిక లక్ష్యాలను అమలుచేయగలవు. అందుకే వీటిని సాధనాలుగా మలుచుకుంటున్నారు. సైబర్, అంతరిక్షం, సమాచార యుద్ధాలు కూడా సంప్రదాయ యుద్ధంలా ఎంతో శక్తిమంతమైనవి. వీటితో పోరాడేందుకు బహుళ- డొమైన్ వాతావరణంలో సాయుధ దళాలు కలసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉంది'' అని నొక్కి చెప్పారు. ''మన పొరుగునున్న ప్రాంతాల నుంచి మనపై పరోక్ష యుద్ధం జరుగుతోంది. అక్కడి నుంచి ఉగ్రవాద ముప్పు తో ఇది మరింత తీవ్రమవుతోంది. సైబర్ దాడులకు బలి కాకుండా ఉండాలంటే మనమంతా కలిసి పోరాడాలి'' అని అన్నారు.



# సన్నబియ్యం సర్కారుకు ప్రతిష్టాత్మకం



అమలును దగ్గర నుండి పర్యవేక్షించాల్సిందే అని మంత్రి స్పష్టం చేశారు. "సన్న బియ్యం పేదలకు న్యాయంగా అందేలా చూసే బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిదే" అని అన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విశేష సూచన చేశారు: "ప్రతి ప్రజాప్రతినిధి, ఒక్కసారి అయినా సన్న బియ్యం తీసుకునే లబ్దిదారుల ఇంటిలో భోజనం చేయాలి. అప్పుడే వారు తినే అన్నం నాణ్యత ఎలా ఉందో తెలిసి వస్తుంది. ప్రభుత్వం ఈ పథకాన్ని కేవలం రేషన్ సరఫరాగా కాకుండా, ఆహార భద్రతకు సంకేతంగా తీసుకుంటోంది. అన్ని శాఖల సమన్వయంతో సన్న బియ్యం సరఫరాలో అక్రమాలు, లోపాలు లేకుండా చూడటం, అధికారుల కర్తవ్యం అని మంత్రి తెలిపారు.

**30 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం**

'సన్నబియ్యం విషయంలో ప్రతిపక్షాల ఆరోపణలను అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సమర్థవంతంగా తిప్పికొట్టాలి. గతంలో సంవత్సరానికి 24 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేశాం. ఇప్పుడు 30 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం సరఫరా చేస్తున్నాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినపుడు 90 లక్షల రేషన్ కార్డులు ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి కేవలం 49 వేల కార్డులే ఎక్కువ ఇచ్చారు. ఇప్పుడు 30 లక్షల మందికి రేషన్ కార్డులు ఇస్తున్నాం. ప్రజాపాలనలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు కలెక్టర్లు పరిశీలిస్తున్నారు. ప్రతీ అర్హునికి రేషన్ కార్డును అందిస్తాం' అని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

## ఎట్టకేలకు భారత్‌కు తహవ్వుర్ రాణా

పటియాలా హౌస్ కోర్టులో ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యారు. ముందుజాగ్రత్తగా కోర్టు ప్రాంగణాన్ని పూర్తిగా ఖాళీ చేయించిన పోలీసులు.. మీడియా ప్రతినిధులనూ బయటకు పంపించారు. అనంతరం రాణాను తిహాడ్ జైలుకు తరలించనున్నట్లు సమాచారం. దీంతో ఆయా ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం చేశారు. తహవ్వుర్ రాణాను అదుపులోకి తీసుకున్నట్లు జాతీయ దర్యాప్తు సంస్థ ధ్రువీకరించింది. అతడిని చట్టం ముందు నిలబెట్టేందుకుగాను ఏళ్ల తరబడి నిరంతర సమష్టి ప్రయత్నాలు చేసినట్లు ఓ ప్రకటనలో తెలిపింది."ఎన్ఐఏ, ఎన్ఎస్‌జీ, భారత విదేశాంగ శాఖ, హోంశాఖ, యూఎస్‌డీఓజే, యూఎస్ స్కై మార్షల్, అమెరికాలోని సంబంధిత అధికారుల సమన్వయంతో ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యింది" అని పేర్కొంది. ఇదిలాఉంటే, తహవ్వుర్‌ను ఈ మధ్యాహ్నమే దిల్లీకి తరలించారన్న వార్తలు వచ్చినప్పటికీ.. ఎన్ఐఏ ఈ విషయాన్ని సాయంత్రం ధ్రువీకరించడం గమనార్హం.ఈ కేసులో ఎన్ఐఏ తరఫున సీనియర్ అడ్వకేట్ దయన్ కృష్ణన్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరేందర్ మాన్ హాజరయ్యారు. ఇప్పటికే వీరిద్దరూ కోర్టు ప్రాంగణానికి చేరుకున్నారు. అయితే, ఈ కేసు గురించి స్పందించేందుకు వారు నిరాకరించారు. మరోవైపు, నిందితుడు తహవ్వుర్ రాణా తరఫున దిల్లీ లీగల్ సర్వీసెస్ అథారిటీ నుంచి పీయూష్ సచ్‌దేవ హాజరైనట్లు సమాచారం

## యూపీఏ సర్కార్ వల్లే..

న్యూఢిల్లీ :26/11 ముంబయి దాడుల్లో కీలక సూత్రధారి తహవ్వుర్ రాణా భారత్ చేరుకున్న సంగతి తెలిసిందే. అమెరికా ప్రభుత్వంతో భారత ప్రభుత్వం జరిపిన దౌత్య చర్చల ఫలితంగా ఈ పరిణామం చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ స్పందించింది. కేంద్రంలోని మోదీ సర్కార్‌పై విమర్శలు చేసింది. తహవ్వుర్ రాణా అప్పగింత ప్రక్రియను ప్రధాని మోదీ ప్రభుత్వం ప్రారంభించలేదని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. యూపీఏ హయాంలో ప్రారంభించిన వ్యూహాత్మక దౌత్య ప్రయోజనాలను ప్రస్తుతం పొందుతోందని విమర్శించింది. "నిందితుడి అప్పగింత విషయంలో ఎన్డీయే ప్రభుత్వం ఏమీ చేయలేదు. వారికి ఇది గొప్ప విషయం కాదు. ఈ పరిణామానికి మోదీ సర్కార్ క్రెడిట్ తీసుకోవాలని ప్రయత్నిస్తోంది. కానీ, గతంతో యూపీఏ ప్రభుత్వం అమెరికాతో నిందితుడి అప్పగింతపై చర్చలు జరిపింది. దాదాపు దశాబ్దానికి పైగా శ్రమించింది. ఎంతగానో అతడిపై నిఘా పెట్టింది" అని కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం తెలిపారు. "26/11 ముంబయి దాడుల్లో ప్రమేయం ఉన్న డేవిడ్ కోల్మన్ హెడ్లీ (అమెరికా), తహవ్వుర్ రాణా (పాకిస్థాన్‌లో జన్మించిన కెనడా జాతీయుడు) మరికొందరిపై మా హయాంలో దిల్లీలో ఎన్ఐఏ కేసు నమోదు చేసింది. దీంతో నవంబర్ 11, 2009 నుంచి దీనిపై దర్యాప్తు ప్రారంభమైంది. అదే సమయంలో కెనడాతో భారత ఏజెన్సీల సమన్వయం కుదిరింది. ఇదంతా యూపీఏ ప్రభుత్వ విదేశాంగ విధానం వల్లే సాధ్యమైంది. 2011లో అమెరికా కోర్టు అతడిని నిర్దోషిగా విడుదల చేసింది. అయితే.. ఇతర ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడినందున 14 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అయితే.. అతడిని నిర్దోషిగా విడుదల చేయడంపై కాంగ్రెస్ బహిరంగంగా నిరసన వ్యక్తం చేసింది. ఈ విషయంలో దౌత్యపరమైన ఒత్తిడి పెంచాం" అని గుర్తు చేశారు.

## భారత్‌కు అతిపెద్ద దౌత్య విజయం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ముంబయి పేలుళ్ల కేసులో నిందితుడు తహవ్వుర్ రాణాను గురువారం భారత్‌కు తీసుకురానున్న సంగతి తెలిసిందే. దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పందించారు. అతడి అప్పగింత భారత్‌కు అతిపెద్ద దౌత్య విజయంగా పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. 'భారతదేశానికి, ఇక్కడి ప్రజలకు హాని కలిగించే వ్యక్తులను ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం విడిచిపెట్టదు. బాంబు పేలుళ్లు ఎవరి హయాంలో జరిగాయో వారు అతడిని వెనక్కి తీసుకురాలేకపోయారు. కానీ, మేము వారిని తిరిగి తీసుకొస్తున్నాం. తహవ్వుర్ రాక భారత్‌కు అతిపెద్ద దౌత్య విజయం. ఇది మోదీ ప్రభుత్వ దౌత్య నైపుణ్యాన్ని, న్యాయంపై నిబద్ధతను తెలియజేస్తుంది' అని షా పేర్కొన్నారు. ఈసందర్భంగా దేశానికి వ్యతిరేకంగా దాడులు చేసే వారిని మోదీ ప్రభుత్వం వెంటాడుతూనే ఉంటుందన్నారు.

## పొంచిఉన్న 'అకాల'ముప్పు

భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే సూచనలున్నాయని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఇప్పటికే ఎల్లో హెచ్చరికలు జారీచేసినట్లు తెలిపింది. రేపు (ఏప్రిల్ 11న) కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. వికారాబాద్ జిల్లా తాండూరులో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తోంది. విద్యుత్ సరఫరా మూడు గంటలుగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

**అప్రమత్తంగా ఉండాలి: సీఎం రేవంత్**

రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. వాతావరణ శాఖ సూచనలను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. అప్రమత్తంగా ఉంటూ.. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

## మేము చైనీయులం.. కవ్వింపు చర్యలకు భయపడం

### చైనా విదేశాంగ శాఖ

**బీజింగ్(జనంసాక్షి):**చైనా దిగుమతులపై అమెరికా భారీగా సుంకాలను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ టారిఫ్‌లపై ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ తీవ్రంగా స్పందించారు. తాము చైనీయులమని.. కవ్వింపు చర్యలకు భయపడమని పేర్కొంటూ ఒక పాత వీడియోను ఆమె పంచుకున్నారు.డ్రాగన్ దిగుమతులపై 125 శాతం సుంకం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై నింగ్ ఎక్స్ వేదికగా ఒక పోస్టు చేశారు. 'మేము చైనీయులం. కవ్వింపు చర్యలకు భయపడం. టారిఫ్‌ల విషయంలో వెనక్కి తగ్గం' అని పేర్కొన్నారు. దీనికి ఆమె 1953 నాటి వీడియోను పంచుకున్నారు. నాడు కొరియా యుద్ధం నేపథ్యంలో డ్రాగన్ నాయకుడు మావో జెడాంగ్ ప్రసంగించిన వీడియో అది. అందులో 'ఈ యుద్ధం ఎంతకాలం కొనసాగుతుందో మేము నిర్ణయించలేం.. అది వాళ్ల (అమెరికా) ఇష్టం. ఇది ఎంతకాలం సాగినా మేము వెనక్కి తగ్గం. పూర్తిగా విజయం సాధించేవరకు పోరాడతాం' అని జెడాంగ్ పేర్కొన్నారు.

## సామాజిక న్యాయ సాధనకోసం

# సభలు, ప్రదర్శనలు


- మనువాదం, కార్పొరేట్ సంస్థల దోపిడీని నిరసించాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



**హైదరాబాద్, ఏప్రిల్ 10 (జనంసాక్షి)** : సామాజిక న్యాయ సాధనకోసం సభలు, ప్రదర్శనలు నిర్వహించేందుకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. మనువాదం, కార్పొరేట్ సంస్థల దోపిడీని నిరసించాలని కోరారు. హైదరాబాద్‌లో గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దళిత, గిరిజన, బలహీనవర్గాలు, మైనార్టీలతో పాటు, మహిళల మీద దాడులు పెరిగాయని పేర్కొన్నారు. కుల వివక్ష, అత్యాచారాలు, హత్యలు, సాంఘిక బహిష్కరణలు పెచ్చరిల్లుతున్నాయని, ఈ నేపథ్యంలో మనువాదం, కార్పొరేట్ సంస్థల దోపిడీకి వ్యతిరేకంగా సామాజికన్యాయ సాధన కోసం జీవితాంతం కృషి చేసిన సామాజిక ఉద్యమనేతలు జ్యోతిరావు ఫూలే, అంబేద్కర్ జయంతుల సందర్భంగా ఏప్రిల్ 11 నుండి 14 వరకు రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, బస్తీల్లో సభలు, ప్రదర్శనలకు పిలుపునిచ్చారు. శ్రామిక వర్గాలు, అణగారిన తరగతులన్నీ సంఘటితంగా పోరాటాల్లోకి ముందుకు రావాలని కోరారు. రాష్ట్రంలో కులాంతర వివాహాలు చేసుకున్నందుకు 100మందికిపైగా హత్యలకు గురయ్యారని, పండుగలు, విందు భోజనాల్లో దళితులు అంటరానితనానికి గురవుతున్నారని, కులవివక్షను ప్రతిఘటించినందుకు ఏడాదిలో 1000 మందికి పైగా చంపబడ్డారని, సంవత్సరానికి 50వేలకు పైగా దాడులకు గురయ్యారని, గిరిజనులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయని పేర్కొన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పెట్టి కేంద్రానికి పంపిస్తే దాన్ని అమలు చేయడానికి బీజేపీ పూనుకోవడం లేదని, సామాజిక న్యాయాన్ని బీజేపీ పూర్తిగా వ్యతిరేకిస్తున్నదని, బీసీల కులగణనకు బీజేపీ వ్యతిరేకంగా ఉందని, మహిళలపై అత్యాచారాలు అరికట్టకుండా, మహిళలనే బాధ్యులుగా చేసే ధోరణితో బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారని తెలిపారు. మైనార్టీలపై దాడులు కొనసాగుతున్నాయని, వక్ఫ్‌బోర్డు చట్టానికి సవరణ పేరుతో వారి హక్కులు హరించి వేస్తున్నారని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేయడంతోపాటు, ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయడం లేదని, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీచేయడం లేదని, కేంద్రంతో పాటు, రాష్ట్రాలు కూడా బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తగిన నిధులు కేటాయించి, ఖర్చుచేయడంలో వైఫల్యం కొనసాగుతోందని తెలిపారు. రాజ్యాంగం అంటరానితనం, కులవివక్షతను నిషేధించిందని, రాష్ట్రంలో జస్టిస్ కె పున్నయ్య కమిషన్ అధారంగా ప్రభుత్వమే నెలలో ఒక రోజు పౌరహక్కుల దినం పాటించి, కులవివక్షను నిషేధించాలనే నిబంధన ఉన్నా, అమలు జరిపే పరిస్థితి లేదని, ఈ నేపథ్యంలో సామాజిక న్యాయం కోసం జరిగే సభలు, ప్రదర్శనల్లో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ప్రజలను కోరారు.

# ఎన్నారై అడ్వయిజరీ కమిటీ నియామకం

- చైర్మన్‌గా వినోద్ కుమార్, వైస్ చైర్మన్‌గా మంద భీంరెడ్డి
- సంవత్సరంలోగా ఇచ్చిన హామీని నెరవేర్చిన సీఎం రేవంత్ రెడ్డి
- గల్ఫ్ కార్మికుల సంక్షేమం, సమగ్ర ఎన్నారై పాలసీ పై అధ్యయనం
- కమిటీలో ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒక మాజీ మంత్రి, ఒక మాజీ ఎమ్మెల్యే


వినోద్‌కుమార్


భీం రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 10 (జనంసాక్షి)** : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు గల్ఫ్ కార్మికుల సంక్షేమం, సమగ్ర ఎన్నారై పాలసీ పై అధ్యయనం చేయడానికి అడ్వయిజరీ కమిటీని నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గురువారం జి.ఓ. 57 విడుదల చేశారు. రెండేళ్ల కాలపరిమితి గల ఈ కమిటీ చైర్మన్ గా ఇండియన్ ఫారిన్ సర్వీస్ రిటైర్డ్ అధికారి, అంబాసిడర్ డా. బి.ఎం. వినోద్ కుమార్, వైస్ చైర్మన్ గా గల్ఫ్ వలసల నిపుణులు మంద భీంరెడ్డి లను నియమించారు. జిఎడి ప్రోటోకాల్, ఎన్నారై విభాగానికి చెందిన జాయింట్ సెక్రెటరీ స్థాయి ఐఏఎస్ అధికారి కమిటీకి మెంబర్ సెక్రెటరీగా వ్యవహరిస్తారు. కమిటీలో గౌరవ సభ్యులుగా మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్, బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ లను నియమించారు. గల్ఫ్ వలసలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కలిగిన ప్రవాసీ కార్మిక నాయకులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, డా. లిజీ జోసెఫ్, చెన్నమనేని శ్రీనివాస రావు, కొట్టాల సత్యంనారా గౌడ్, గుగ్గిల్ల రవిగౌడ్, నంగి దేవేందర్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల లను కమిటీ సభ్యులుగా నియమించారు.

గత సంవత్సరం ఏప్రిల్ 16న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హైదరాబాద్ తాజ్ దక్కన్ లో గల్ఫ్ సంఘాల ప్రతినిధులతో సమావేశమైన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గల్ఫ్ తదితర గమ్యస్థాన దేశాలలోని అల్పాదాయ తెలంగాణ వలస కార్మికులకు ఆయా దేశాలలో లభిస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. దేశంలోని కేరళ, పంజాబ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో గల్ఫ్ కార్మికులకు అందుబాటులో ఉన్న సంక్షేమ పథకాలను ఈ కమిటీ అధ్యయనం చేస్తుంది. ప్రవాసీ కార్మికుల సమస్యలను అర్థం చేసుకోవడానికి, పరిష్కారాలను కనుగొనడానికి ఈ కమిటీ గల్ఫ్ దేశాలను కూడా సందర్శిస్తుంది.

ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా... సమగ్ర ప్రవాస భారతీయుల విధానం (ఎన్నారై పాలసీ) రూపకల్పన తో పాటు, తెలంగాణ గల్ఫ్ అండ్ అదర్ ఓవర్సీస్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు (గల్ఫ్ తదితర దేశాల్లోని తెలంగాణ ప్రవాసీ కార్మికుల సంక్షేమ బోర్డు) ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంది.

## గాయపడిన ఆరోగ్యమిత్రకు

# లక్ష రూపాయల సహాయం



**హైదరాబాద్, ఏప్రిల్ 10 (జనంసాక్షి)** : మార్చి 29న తమ విధులకు ఆన్లైన్ అటెండెన్స్ కోసం త్వరంగా చేరుకోవాలని వెళుతూ రాయగిరి భువనగిరికి మధ్యలో గుర్తుతెలియని వాహనం తగిలి యాక్సిడెంటుకు గురైన యాదగిరిగుట్ట ఆరోగ్యమిత్ర కె. అనూజ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆరోగ్య మిత్రులందరూ కలిసి రూ.లక్ష అందజేశారు. కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్న అనూజ కుటుంబ సభ్యులకు గౌరవ అధ్యక్షులు భూపాల్ చేతుల మీదుగా అందించారు. తరువాత కమిషనర్ కర్ణన్, ఇన్ఛార్జి ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈఓను కోఠిలో కలిసి ఆమె పరిస్థితిని వివరించారు. అందుకు సీఈఓ అనూజకి తగిన సహాయ సహకారాలను అందించాల్సిందిగా ట్రస్ట్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అందుకు సీఈఓకు రాష్ట్రంలోని ఆరోగ్య మిత్రలందరి పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఏ ఆరోగ్యమిత్రలకు రూ. 10 లక్షల ఎక్స్ గ్రేషియో తక్షణం పొందే విధంగా చూడాలని సీఈఓను కోరారు. అందుకు వారు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు భూపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు మహేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుమన్, నల్గొండ జిల్లా అధ్యక్షులు నాగరాజు, భువనగిరి జిల్లా అధ్యక్షులు మహేష్, ప్రధాన కార్యదర్శి కాటమయ్య, హైదరాబాద్ మిత్రులు జైపాల్ రెడ్డిలు పాల్గొన్నారు. వీటితోపాటు ఆరోగ్యశ్రీ ఉద్యోగుల వేతనాల పెంపుదల ఫైల్ సచివాలయంలోని ఆర్థిక శాఖలో క్లియర్ చేయించాలని కోరారు.

# పెన్షన్ ఫండ్‌కు ఊరట

(ప్రత్యేక ప్రతినిధి/జనంసాక్షి)




కోల్ ఇండియా పెన్షన్ ఫండ్‌కు టన్నుకు రూ.10 పెంచడం వలన 2040 వరకు బొగ్గుగని కార్మికుల పెన్షన్‌కు ఎలాంటి అంతరాయం ఉండదని అభిప్రాయం. ఈ నిర్ణయం ఏప్రిల్ 16, 2025 నుండి అమలులోకి వస్తుంది. పెన్షన్ ఫండ్‌కు టన్నుకు మరో రూ.10 విరాళంగా ఇవ్వాలని కోల్ ఇండియా నిర్ణయించడం విశ్రాంత బొగ్గు కార్మికులకు ఉపశమనం కలిగించింది. దీంతో పింఛన్ పరిస్థితి నిలకడగా ఉంటుందన్న ఆశలు చిగురించాయి. ఇప్పటి వరకు వచ్చే ఆదాయం కంటే పింఛనుకే ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తోంది. అంటే ప్రస్తుతం పెన్షన్ హెడ్‌లో వస్తున్న దానికంటే ఎక్కువ డబ్బు వార్షిక వ్యయంపై ఖర్చు అవుతోంది. కార్మిక సంఘాల అభిప్రాయం ప్రకారం ఇప్పుడు 2040 సంవత్సరం వరకు పెన్షన్‌లో కొంత పెరుగుదల ఉంటుంది.

ప్రస్తుతం, ఉద్యోగుల కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఖాతాలో 12 శాతం పెన్షన్ ఫండ్ కొరకు కార్మికుల వేతనాల ఏడు శాతం కోత ఉంది. కోల్ ఇండియా సెప్టెంబర్ 2020 నుండి టన్నుకు రూ.10 ఇస్తోంది, ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.20కి పెంచింది. కంట్రిబ్యూషన్ మొత్తాన్ని టన్నుకు రూ.35 నుంచి రూ.40కి పెంచే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం పెన్షన్ ఫండ్‌లో రూ.18000 కోట్లు జమ అయ్యాయి.అయినప్పటికీ, పింఛను నిధిని బలంగా,స్థిరంగా ఉండే అవసరముంది .సీఎంపిఎఫ్ లో పెన్షన్ ఫండ్‌ను బలోపేతం చేయడానికి ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ సమావేశం జనవరి 8, 2025న ఢిల్లీలో జరిగింది.ఈ సమావేశంలో ప్రధానంగా కోల్ ఇండియా డైరెక్టర్ పర్సనల్ వినయ్ రంజన్, సీఎంపీఎఫ్ఓ కమిషనర్ బీకే మిశ్రా పాల్గొన్నారు.

సీఎంపిఎఫ్ బోర్డ్ ఆఫ్ ట్రస్ట్ సమావేశం ఫిబ్రవరి 2024లో జరిగింది. ఫిబ్రవరి 2024లో జరిగిన బోర్డ్ ఆఫ్ సమావేశంలో, బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి రూపిందర్ బ్రార్ అధ్యక్షతన పెన్షన్ స్థిరత్వం కోసం ఒక కమిటీని ఏర్పాటు చేశారు.జులై 1, 2024న జరిగిన కమిటీ సమావేశంలో, పింఛను లెక్కింపు, పింఛను తగ్గించడం మొదలైనవాటిని యాక్చురీ సూచించింది. దీనికి ఏఐటీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్ ప్రతినిధులు మాట్లాడుతూ పింఛన్ చెల్లించాల్సిన బాధ్యత యాజమాన్యానిదేనన్నారు. దీనికి అంగీకారం కుదిరింది మరియు కమిటీ సిఫార్సును బోర్డ్ ఆఫ్ లో చర్చించారు. బోర్డ్ ఆఫ్ ట్రస్ట్ నుండి అనుమతి పొందిన తరువాత, కోల్ ఇండియా పెన్షన్ ఫండ్‌కు టన్నుకు రూ.10 విరాళంగా ఇవ్వాలని నిర్ణయించింది.

పింఛను నిధిని ఎలా బలోపేతం చేయాలనే అంశంపై చర్చ జరిగింది. పెన్షన్ ఫండ్ కోసం కోల్ ఇండియా మేనేజ్‌మెంట్ ప్రస్తుతం టన్ను బొగ్గుకు రూ.10 చొప్పున సి ఎంపిఎఫ్ కి అందజేస్తోంది. స్వచ్ఛంద సహకారం టన్ను బొగ్గుకు రూ.25కు పెంచితే 2037-38 సంవత్సరం నాటికి పెన్షన్ ఫండ్ బలోపేతం అవుతుందని చర్చించారు. పింఛను నిధికి మరింత బలోపేతం చేసేందుకు కంట్రిబ్యూషన్ మొత్తాన్ని టన్నుకు రూ.35 నుంచి రూ.40కి పెంచాలని కూడా భావించారు. కోల్ ఇండియా నుంచి ఏటా దాదాపు 12-14 వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం పింఛనుదారుల సంఖ్య 6.2 లక్షలు, చందాదారుల సంఖ్య 3.25 లక్షలు. ప్రతి ఏటా దాదాపు రూ.300 కోట్లు పింఛను నిధి నుంచి విత్‌డ్రా చేస్తున్నారు.

# బీఆర్ఎస్ హయాంలో ఎంతో అభివృద్ధి

- దానిని కొనసాగించే ప్రయత్నం చేయాలి

**నిజామాబాద్, ఏప్రిల్10 (జనంసాక్షి)** : దేశంలో ఏ రాష్ట్రం సాధించని విజయాలను తెలంగాణలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం సాధించిందని ఎమ్మెల్యే వేముల ప్రశాంత రెడ్డి పేర్కొన్నారు. అస్తిత్వం కోసం 60ఏళ్లు పోరాడిన తెలంగాణ నేల.. కెసిఆర్ పాలనలో అభివృద్ధిలో శిఖరాగ్రానికి చేరిందన్నారు. తొమ్మిదిన్నరేదేళ్ల స్వల్ప కాలంలోనే ఆర్థిక వృద్ధి, తలసరి ఆదాయం పెరుగుదల, విద్యుత్ సరఫరా, తాగు, సాగునీటి సదుపాయం కల్పన, ప్రజాసంక్షేమం, పారిశ్రామిక, ఐటీ రంగాల ప్రగతిలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. కఠినమైన, పటిష్టమైన ఆర్థిక క్రమశిక్షణతో ఆదాయ వనరులను పెంచుకుంటూ 2014 నుంచి 2023 వరకు దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో జలవిప్లవం, హరిత విప్లవం, క్షీర విప్లవం, నీలి విప్లవం, గులాబీ విప్లవాలతో దేశానికి ఆదర్శంగా నిలిచామని చెప్పారు. పల్లె ప్రగతికి నేరుగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంటే అభివృద్ధి పనులు జరిగాయని పేర్కొన్నారు. ఈ అభివృద్ధిని ముందుకు తీసుకుని వెళ్లడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. అప్పుడే తెలంగాణ మరింతగా ముందుకు వెళ్లగలదన్నారు. తెలంగాణ వజ్రోత్సవ సభలో ఇదే ప్రధానంగా ప్రచారం చేస్తామని అన్నారు. ప్రజల్లో మార్పు వచ్చిందని, కాంగ్రెస్ పట్ల తీవ్రవ్యతిరేకత మొదలయ్యిందని అన్నారు.

## తమ్ముడి దాడిలో అక్క మృతి

**హైదరాబాద్, ఏప్రిల్ 10 (జనంసాక్షి)** : క్షణికావేశంలో దారుణాలకు ఒడిగడుతున్నారు. ఆస్తుల కోసం కన్నతల్లిదండ్రులు, తోబుట్టువులుపై కూడా దాడులకు పాల్పడుతున్నారు. ఇటీవలి కాలంలో ఇలాంటి ఘటనలు ఎక్కువైపోతున్నాయి. తాజాగా ఇలాంటి ఘటనే ఒకటి చోటు నగరంలో చేసుకుంది. హైదరాబాద్ పాతబస్తీ చాదర్ ఘాట్ లో దారుణం వెలుగుచూసింది. అక్క, అన్న పై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు ఓ తమ్ముడు. ఈ దాడిలో సోదరుడికి తీవ్ర గాయాలు కాగా అక్క ప్రాణాలు కోల్పోయింది. లక్ష్మిని ఆమె సోదరుడు మదన్ బాబు కత్తితో దాడిచేసి చంపేశాడు. గాయపడిన సోదరుడిని ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ దారుణానికి పాల్పడ్డట్టు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు- తెలిపారు.

# గ్రామ తరలింపుపై కదం తొక్కిన పరుషురాంపల్లివాసులు

- ఓసి-3 ప్రధాన రహదారిపై టెంట్ వేసే ప్రయత్నం
- జిఎం హామీతో ఆందోళన విరమించిన గ్రామస్థులు



**గణపురం, ఏప్రిల్ 10 (జనం సాక్షి):** ఓసి త్రీ నిర్వాసిత గ్రామమైన పరశురాంపల్లిని తరలించి ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని గురువారం గ్రామస్థులు పెద్ద ఎత్తున ఓసి త్రీ రహదారిపై ఆందోళన చేపట్టారు. నెల రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పిన అధికారులు మాట తప్పారని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఉదయం ఓసి త్రీ ప్రధాన రహదారిపై బైఠాయించి టెంటు వేసే ప్రయత్నం చేశారు. ఆందోళన కార్యక్రమానికి వచ్చే సమయంలో కొద్ది మంది గ్రామస్థులు తమ వెంట క్రిమిసంహారకమందు డబ్బాలను వెంట తెచ్చుకున్నారు. అవసరమైతే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటామని ఆందోళనకు దిగారు. దీంతో పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. వారి వద్ద నుండి క్రిమిసంహారక మందు డబ్బాలను లాక్కున్నారు. ఇది ఇలా ఉండగా గత నెల 10న మా గ్రామాన్ని తరలించి న్యాయం చేస్తామని చెప్పి ఒకపక్క కాలుష్యం మరోపక్క బ్లాస్టింగ్ మోతలతో ఇబ్బందులు పడుతున్నామని ఆందోళనకు దిగిన పరుశురాంపల్లి గ్రామస్థులకు సింగరేణి జిఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి పోలీసు అధికారులు నచ్చజెప్పి నెల రోజుల్లో పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. అప్పటినుండి ఇప్పటివరకు అధికారుల నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో తిరిగి మళ్లీ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాలుష్యం నుండి కాపాడాలంటూ మా గ్రామాన్ని తరలించాలని ఆందోళనకు దిగడంతో ఓసి త్రీ రహదారిపై ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ముందస్తు సమాచారం తెలుసుకున్న పోలీసులు సకాలంలో అక్కడికి చేరుకొని రోడ్డుపై టెంటు వేయకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో గ్రామస్థులు పోలీసుల మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. పరిస్థితి చేయి దాటి పోతుండడంతో చిట్యాల సిఐ మల్లేష్ , గణపురం ఎస్ఐ రేఖ అశోక్ ల ఆధ్వర్యంలో రేగొండ ఎస్సై సందీప్ కుమార్, మొగుళ్ళపల్లి ఎస్సై అశోక్, టేకుమట్ల ఎస్సై సుధాకర్, భూపాలపల్లి ఎస్సై మచ్చ సాంబమూర్తి, ట్రైనీ ఎస్ ఐ అమూల్య లు ఆందోళన వద్ద గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు సంయమనం పాటించారు. అయినప్పటికీ తమ సమస్యను పరిష్కరించాలని లేదంటే తమ వెంట తెచ్చుకున్న క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడతామని హెచ్చరించడంతో పరిస్థితి చేయి దాటి పోతుండడంతో స్థానిక పోలీసులు సింగరేణి అధికారులతో మాట్లాడి సింగరేణి జిఎం రాజేశ్వర్ రెడ్డిని పిఓ బిక్షమయ్య, మేనేజర్ శ్రీనివాస్ లను ఆందోళన వద్దకు పిలిపించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ గోడును వెల్లబోసుకోగా సింగరేణి జిఎం స్పందించి ఐదు రోజుల్లో గా పరశురాం పల్లి సమస్యను సింగరేణి సిఎండి దృష్టికి తీసుకెళ్లే విధంగా గ్రామస్థులను అక్కడికి తీసుకెళ్తానని లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. సుమారు నాలుగు గంటల పాటు ఓసి త్రీ రహదారిపై ఆందోళన కొనసాగింది.

## క్షేత్ర పర్యటనలో పొలిటికల్ సైన్స్ విద్యార్థులు




**బెల్లంపల్లి, ఏప్రిల్ 10, (జనంసాక్షి)** : బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న పొలిటికల్ సైన్స్ విద్యార్థులకు కళాశాల పొలిటికల్ సైన్స్ అధ్యాపకురాలు సమ్మక్క బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఫీల్డ్ ట్రిప్ నిర్వహించారు. విద్యార్థులు తహసీల్దార్ ను పౌరుల యొక్క హక్కులు, విధులు, చట్టాలు, ఎన్నికల నిర్వహణ కోసం వివిధ సందేహాలను తహసీల్దార్ ను అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. ఈ ఫీల్డ్ ట్రిప్ నిర్వహించడం వల్ల విద్యార్థులు తమ జ్ఞానాన్ని ఆచరణలో ఎక్కువ అవగాహన చేసుకోవడం జరిగిందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో కళాశాల పొలిటికల్ సైన్స్ అధ్యాపకురాలు కూనురాజుల సమ్మక్క, అల్లం తిరుపతి, విద్యార్థులు తహసీల్దార్ జోష్న , నాయబ్ తాసిల్దార్ కల్పన, రెవెన్యూ అధికారులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.




# జై భీమ్ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఉప్పల

**హైదరాబాద్, ఏప్రిల్ 10 (జనంసాక్షి)** : అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎల్బీనగర్‌లోని అంబేద్కర్ విగ్రహం నుండి 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వరకు జరిగే జై భీమ్ ర్యాలీ పోస్టర్‌ను నాగోల్ లోని ఉప్పల క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భగా కమిటీ సభ్యులు ఉప్పల శ్రీనివాస్ గుప్తను ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీ నీ ప్రారంభించాలని కోరారు. ఈ సందర్భగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ప్రపంచ మేధావి, సామాజిక, రాజకీయ విప్లవకారుడు, మానవ హక్కుల ప్రదాత, మహోన్నత రాజనీతిజ్ఞుడు, భారత రాజ్యాంగ నిర్మాత, భారత దేశ తొలి న్యాయశాఖ మంత్రి , కుల నిర్మూలన సిద్ధాంతకర్త , స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతో కూడిన సమ సమాజ స్వాప్నికుడు బాబాసాహెబ్ డా.బీ.ఆర్.అంబేద్కర్ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నక్క మహేష్ మాదిగ జేఏసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మరియు గుర్రం కొటేష్ మాదిగ జేఏసీ రాష్ట్ర నాయకులు మేడి ప్రసాద్ ,మాదిగ జేఏసీ యువజన రాష్ట్ర నాయకులు ,కొత్తపల్లి అన్వేష్ మాదిగ జేఏసీ యువజన రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి సంస్థకు భూసేకరణకు నోటిఫికేషన్

**గణపురం, ఏప్రిల్ 10 (జనంసాక్షి)** : మండలంలోని నగరంపల్లి గ్రామానికిచెందిన 64.27 గుంటల భూమి సింగరేణి సంస్థ భూపాలపల్లి వారు భూసేకరణ కొరకు ప్రాథమిక ప్రకటన భూములపై గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నగరంపల్లి గ్రామసభ నిర్వహించడం జరిగినది, ఈ సభకు ముఖ్య అతిథిగా భూపాల్ పల్లి ఆర్డీవో రవి హాజరయ్యారు.ఈ విషయంలో ప్రచురించిన ప్రాథమిక ప్రకటనలు 38.05, 26.22 ఏకరముల ప్రాథమిక ప్రకటన భూసేకరణ జాబితాలను గ్రామస్తులకు హాజరైన రైతులకు చదివి వినిపించారు. తదుపరి ఈ ప్రాథమిక ప్రకటనలపై అభ్యంతరం ఉన్నట్లయితే వ్రాత పూర్వకంగా తెలపగలరని ఆర్డీవో తెలిపారు. ఈ గ్రామ సభలో సింగరేణి సంస్థ జనరల్ మేనేజర్, భూపాలపల్లి, గణపురం తహాశీల్దార్ మధురకవి సత్యనారాయణ స్వామి, ఘనపూర, ఎంపీడీవో ఎల్ భాస్కర్, ఆర్ ఐ దేవేందర్ రెవిన్యూ, పంచాయతీ కార్యదర్శి నాగమణి సింగరేణి సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## సామాజిక దార్శనికుడు
# జ్యోతిరావు పూలే




సామాజిక వేత్త జ్యోతిరావు పూలే 1827లో ప్రస్తుత పశ్చిమ మహారాష్ట్రలో జన్మించారు, ఆయన జన్మస్థలం ఖాన్వాడి గ్రామం అని చెప్పుకున్నా ఖచ్చితమైన ప్రదేశం తెలియదు. ఇది పూణే సమీపంలో సతారా జిల్లాలో ఉంది. ప్రపంచ దేశాల్లో పూలే పేరు తరచుగా లాటిన్ లిపిలో వివిధ రూపాల్లో అనువదించబడుతుంది: జోతిబా పూలే, మహాత్మా జ్యోతిరావు పూలే అని కూడా పిలుస్తారు. అతడు శూద్ర సామాజిక తరగతిలోని మాలి కులానికి చెందినవారు, భారతదేశ సాంప్రదాయ సామాజిక తరగతులలో అత్యల్పమైనది. పూలే చిన్నతనంలో ప్రతిభావంతుడైన విద్యార్థి, అప్పుడు ఉన్న పరిస్థితుల్లో కానీ మాలి పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించడం అసాధారణం. మాలి కుటుంబాలకు చెందిన అనేక మంది పిల్లల మాదిరిగానే, అతను కూడా చిన్న వయసులోనే చదువు ఆపివేసి,కుటుంబం యొక్క వ్యవసాయ పొలంలో పనిచేస్తూ ఉండేవాడు. పూలే జ్ఞానాన్ని పసిగట్టిన బంధువులు ఒకరు తన తండ్రిని పాఠశాలకు పంపమని ఒప్పించడంలో సహాయపడ్డారు. 1840లలో పూలే పూణేలో స్కాటిష్ క్రైస్తవ మిషనరీలు నిర్వహిస్తున్న మాధ్యమిక పాఠశాలలో చేరి పూలే అక్కడ నేర్చుకున్న చారిత్రక ఉద్యమాలు, ఆలోచనాపరుల ద్వారా ప్రేరణ పొందాడు, అమెరికాలో స్వాతంత్ర్యం కోసం బానిసత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలతో పాటు బుద్ధుడు మరియు ఆధ్యాత్మికవేత్త మరియు కవి కబీర్ రచనలు,బోధనల ద్వారా కూడా అతను ప్రేరణ పొంది, సామాజిక బాధ్యతగా మద్యపానం యొక్క చెడును వ్యతిరేకించి నాడు పూనా ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేసి, ప్రభుత్వంతో గొడవ పడి పేద ప్రజల ఆరోగ్యం కాపాడడంలో సఫలీకృతుడైనారు.

ఉన్నత కుల బ్రాహ్మణ కుటుంబానికి చెందిన స్నేహితుడి వివాహానికి పూలేను ఆహ్వానించారు. వరుడి బంధువులు పూలేను అతని తక్కువ కుల నేపథ్యం గురించి ఎగతాళి చేశారు, ఆత్మగౌరవం కోసం పూలే పెళ్లి వేడుక నుండి బయటకు వెళ్లారు. శాశ్వత పరిష్కారం శతబ్దాలుగా విద్య లేకపోవడం ప్రధాన కారణంగా భావించారు. ఈ సంఘటన పూలే కళ్ళు తెరవడానికి సహాయపడింది,కుల వ్యవస్థ యొక్క అన్యాయాలకు సహాయపడిందని చెప్పడంలో ఎలాంటి అనుమానం లేదు. అందుకే విద్య ద్వారానే సమానత్వం సాధ్యమని బలంగా నమ్మి 1848లో పూణేలో తక్కువ కుల బాలికల కోసం ఆయన ఒక మార్గదర్శక పాఠశాలను ప్రారంభించారు,ఆ సమయంలో భారతదేశంలో ఏ బాలికలు విద్యను పొందడం చాలా అరుదు. అటువంటిది పట్టుదలతో తన భార్య సావిత్రిబాయి పూలేను ఇంట్లోనే చదివించారు. ఆమె బాలికల పాఠశాలకు ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారు. బాలికల కోసం మరిన్ని పాఠశాలలను శూద్ర, అతిశూద్ర కులాల ప్రజలకు, ముఖ్యంగా మహర్లు, మాంగ్‌లకు ఒక పాఠశాలను ప్రారంభించారు. పూలే పని సనాతన బ్రాహ్మణుల నుండి గణనీయమైన వ్యతిరేకతను ఎదుర్కొంది, వారు సామాజిక స్థితిని భంగపరిచారని నిందించారు. అయినప్పటికీ, పూలే మరియు అతని భార్య సామాజిక ఆర్థిక,లింగ సమానత్వం వైపు తమ పనిని కొనసాగించారు. తన ఉద్యమాన్ని ఆప లేదు. పూలే బాల్య వివాహాలను వ్యతిరేకించారు, వితంతువులు తిరిగి వివాహం చేసుకునే హక్కును ఆయన సమర్థించారు,దీనిని ముఖ్యంగా ఉన్నత కులాల హిందువులు తిరస్క రించారు. గర్భవతి అయిన వితం తువులకు, ముఖ్యంగా బ్రాహ్మణు లకు ఆయన ఒక గృహాన్నివారి పిల్లల కోసం ఒక అనాథాశ్రమాన్ని ఏర్పాటు చేసారు. ఈ పిల్లలలో ఒకరిని పూలే దంపతులు దత్తత తీసుకుని ఆదర్శంగా నిలిచారు.

పూలే సామాజిక సమానత్వాన్ని ప్రోత్సహించడానికి, శూద్రులను మరియు ఇతర నిమ్న కులాల ప్రజలను ఏకం చేయడానికి ఉద్ధరించడానికి కుల వ్యవస్థ వల్ల కలిగే సామాజిక ఆర్థిక అసమానతలను తిప్పికొట్టడా నికి సత్యశోధక్ సమాజ్ ("సత్యశోధక్ సమాజ్") అనే సంస్కరణ సంఘాన్ని స్థాపించాడు. ఆ సమాజం విద్య యొక్క ప్రాముఖ్యతను కూడా నొక్కి చెప్పింది, బ్రాహ్మణ పూజారులు లేకుండా వివాహాలు నిర్వహించుకోవాలని ప్రజలను ప్రోత్సహించింది. సామాజిక తరగతితో సంబంధం లేకుండా ఎవరైనా సత్యశోధక్ సమాజంలో చేరడానికి స్వాగతం పలుకుతారని పూలే స్పష్టం చేశారు. బ్రాహ్మణ ఆధిపత్య కుల వ్యవస్థలో అణచివేతను పంచుకున్న అనుభవాన్ని కలిగి ఉన్న వ్యక్తులను ఏకం చేయడం పూలే ప్రాథమిక ఉద్దేశాలలో ఒకటిగా ముందుకు సాగారు. సత్యశోధక్ సమాజ్‌లో ప్రధానంగా బ్రాహ్మణేతర కులాల ప్రజలు ఉన్నారు, కానీ సభ్యులలో బ్రాహ్మణులతో పాటు వివిధ మత సంప్రదాయాల ప్రజలు కూడా ఉన్నారు. పూలే సామాజిక బాధ్యతగా తన వ్యక్తిగత మంచి నీటి బావిని కూడా ప్రజలందరూ ఉపయోగించుకోవడానికి గేట్లు తెరిచాడు,దానితో అన్ని సామాజిక తరగతుల ప్రజలను తన ఇంటికి ఆహ్వానించాడు. తన ఆలోచనలను ప్రచారం చేయడానికి, పూలే అనేక పుస్తకాలు రచించారు సామాజిక చైతన్యం కోసం వ్యాసాలు, కవితలు, కథలు రాశారు. అందులో అత్యంత ప్రసిద్ధ రచన 1873లో ప్రచురించబడిన గులాంగిరి బానిసత్వం అనే పుస్తకం. పూలే రచనలు భారతదేశంలో కుల సంస్కరణ కోసం తరువాతి ఉద్యమాలకు ప్రేరణనిచ్చాయి,ఆయన పక్షపాతానికి గురై 63 సంవత్సరాల వయస్సులోనే 1890లో పూణేలో మరణించారు. భారతదేశంలో కుల వ్యవస్థ యొక్క వివక్షత ప్రభావాలను తొలగించడానికి కొనసాగుతున్న ప్రయత్నాలు నేడు ఆయన వారసత్వాన్ని కొనసాగించడమే.

**డాక్టర్ సంగని మల్లేశ్వర్,**
**విభాగాధిపతి, జర్నలిజం శాఖ**
**కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్,**
**సెల్: 9866255355**


### వాణిజ్య యుద్ధం!



కాదేదీ 'వ్యాపారాని'కనర్హం!
నేడు ప్రపంచమంతావ్యాపారం
లోగుట్టు 'ట్రంప్'కెరుక!
టారిఫ్ లతో'మార్కెట్లు'కుదేల్!
అదురు బెదురు మార్కెట్లు!
ప్రపంచవ్యాపార నాయకులు!
ఆయుధాలవ్యాపారి 'పెద్దన్న'!
పెద్దన్నను కాదంటే యుద్ధం!
యుద్ధంతో మార్కెట్ల పతనం
పతనం దిశగా ప్రపంచం!
వ్యాపారప్రపంచానికి హద్దుల్లేవ్
ఇది కార్పొరేట్ల ప్రపంచం!
సామాన్యప్రజలంతా'పావులు'!
పావుల్ని కదిపే నాయకులు!
నాయకులవెనుక కార్పొరేట్లు
జీవితాలు 'చదరంగం' ఆట!
ఈ ఆట ముగించాలన్నా
ఇంకా కొనసాగించాలన్నా
ట్రంప్ చేతిలో'రాజు మంత్రి'!
ఇది ఒక వాణిజ్య యుద్ధం!

**-తమ్మినేని అక్కిరాజు, హైదరాబాద్**

## డిజిటల్ వ్యక్తిగత డేటా రక్షణ చట్టం (డీపీడీపీఏ) 2024తో
# పత్రికా స్వేచ్ఛకు ముప్పు




2023లో భారత పార్లమెంట్ ఆమోదించిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ ఆక్ట్ (డీపీడీపీఏ), 2025 ప్రారంభంలో దశలవారీగా అమలులోకి రానుంది. ఈ చట్టం నియమాలు ఇంకా రూపొందుతున్నాయి. ఇంకా పూర్తి కాలేదు. ఈ డిజిటల్ యుగంలో 140 కోట్ల భారతీయుల వ్యక్తిగత డేటాను రక్షించే లక్ష్యంతో రూపొందిన ఈ డీపీడీపీఏ చట్టం. ఒక ప్రగతిశీల చట్టంగా ప్రశంసలు అందు కుంది. ఇది ఒక వ్యక్తి యొక్క వ్యక్తిగత గోప్యతను కాపాడుతూ, డేటా ప్రాసెసింగ్ యొక్క చట్టబద్ధ అవసరాలను పరిగణనలోకి ఈ చట్టం తీసుకుంటుంది. అయితే, ఈ చట్టం మీడియా స్వేచ్ఛకు ప్రతిబంధకంగా తయారైంది. పౌరుల డేటా దుర్వినియో గాన్ని నిరోధించాలీ అనే ఈ చట్టం ఉద్దేశం ప్రశంసనీయం అయినప్పటికీ, దాని విస్తృత నిబంధనలు, పత్రికలు జరిపే "ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం" పై తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ఉదాహరణకు ఒక రాజకీయ నాయకుని అక్రమ సంపాదనకు సంబంధించిన సమాచార సేకరణ రహస్యంగా జరపాలి. వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్లు, బినామీ ఆస్తుల వివరాలు మొదలైనవి అనాధికారికంగా సమాచారం సేకరించాల్సి ఉంటుంది. ఈ సందర్భంలో "గోప్యతా చట్టం" అడ్డం వస్తే ఆ నాయకునికి సంబంధించిన అవినీతిని సమాచారాన్ని సేకరించి, ఆ విషయాలను ఆధారాలతో బయట పెట్టడం సాధ్యం కాదు.

ఈ చట్టం యొక్క ప్రధాన ఉద్దేశం డిజిటల్ వ్యక్తిగత డేటా ప్రాసెసింగ్‌ను నియంత్రించడం. దీని కోసం వ్యక్తుల నుండి, లేదా సంబంధిత సంస్థల "డేటా బ్యాంక్" నుండి అధికారిక సమాచారం సేకరించటానికి ముందుగా స్పష్టమైన "అనుమతి" అవసరం అవుతుంది. ఈ "సమ్మతి ఆధారిత డేటా నిర్వహణ విధానం", గతంలో ఉన్న "స్వేచ్ఛాయుత విధానం నుండి పెద్ద మార్పును సూచిస్తుంది". గతంలో జర్నలిస్టులు 2005 సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) (ఆర్‌టీఐ) ద్వారా ప్రజా ప్రయోజనాల కోసం కీలక సమాచారాన్ని సేకరించగలిగేవారు. కానీ డీపీడీపీఏ, ఆర్‌టీఐ చట్టంలోని సెక్షన్ 8(1)(జే)ని రద్దు చేస్తూ, ఈ చట్టం రూపొందింది. గతంలో ఆర్టీఐ చట్టం కింద, ప్రజా ప్రయోజనం కోసం వ్యక్తిగత సమాచారం సేకరించటానికి, ఆ అవినీతి సమాచారం బహిర్గతం చేయటానికి అవకాశం ఉండేది. వ్యక్తిగత అవినీతి, లేదా సంస్థాగత అవినీతి, పాలనా వైఫల్యాలపై అనేక స్కాంలు బహిర్గతం కావటానికి ఈ ఆర్టీఐ చట్టం ఉపయోగ పడింది.

ఇప్పుడు డీపీడీపీఏ చట్టంలో సెక్షన్ 44(3), దీనికి విరుద్ధంగా ఉంది. ఇది వ్యక్తిగత డేటా రక్షణకు ప్రాధాన్యత ఇస్తుంది. ముందస్తు అనుమతి లేకుండా సంబంధిత వ్యక్తుల నుండి, అధికారుల నుండి, సంస్థల నుండి సమాచారాన్ని సేకరించడం సాధ్యం కాదు. పైగా ఈ నూతన చట్టం ప్రకారం నేరం కూడా. ఇప్పుడు ఆర్టీఐ (ఆర్‌టీఐ) చట్టం.. దంతాలు లేని పులిగా మార్చేసింది. మరో మార్గంలో రహస్యంగా సమాచారం అందించే, సంబంధిత అధికారి బాధ్యత వహించేలా ఈ నూతన చట్టం ఉంది. ఇప్పుడు ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం స్వేచ్ఛకు హద్దులు ఏర్పడ్డాయి. మీడియా కార్యకలాపాలకు కూడా స్పష్టమైన మినహాయింపులు లేకపోవడం ఈ ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తుంది.

యూరోపియన్ యూనియన్ " జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్" ( జిడిపిఆర్) లేదా సింగపూర్ యొక్క 'వ్యక్తిగత డేటా రక్షణ చట్టం' వంటివి పత్రికా స్వేచ్ఛ కోసం మినహాయింపులను అనుమతిస్తాయి. కానీ డీపీడీపీఏ చట్టంలో అలాంటి వెసులు బాటు లేదు. "ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా" ఈ లోపాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రతి వార్తా సేకరణ కోసం ముందుగా అనుమతి తీసుకోవడం సాధ్యం కాదు. ఈ చట్టం "ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం స్వేచ్ఛ"ను స్తంభింపజేస్తుందని వాదిస్తోంది. ఒక జర్నలిస్ట్ ఒక పబ్లిక్ సర్వెంట్ ఆర్థిక కుంభకోణాన్ని బయటపెడితే, డీపీడీపీఏ చట్టం కింద ఆ అధికారి అనుమతి లేకుండా "బ్యాంక్ రికార్డులు" లేదా అకౌంట్ల సమాచారాన్ని ఉపయోగించ లేదు. మీడియా సంస్థలు, ముఖ్యంగా చిన్న ఔట్‌లెట్లు, స్వతంత్ర జర్న లిస్టులు, ఇప్పుడు లాజిస్టికల్ సమస్యలతో పాటు, ఆర్థిక భారాన్ని కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఎందుకంటే ముం దుగా అనుమతి లేకపోతే ఆ జర్నలిస్ట్ 10,000 రూపాయల నుండి సంస్థలకు 250 కోట్ల రూపాయల వరకు జరిమానాలు విధించబడతాయి.

ఈ చట్టం యొక్క అమలు విధానం మీడియా స్వేచ్ఛకు పెనుముప్పుగా మారుతుంది. "డేటా ప్రొటెక్షన్ బోర్డ్ ఆఫ్ ఇండియా" (డీపీబీఐ), ఉల్లంఘన లపై తీర్పు చెప్పే బాధ్యతను కలిగి ఉంది. ఇది కేంద్ర ప్రభుత్వం నియమించిన సం స్థ. జరిమానాలు విధించే, అలాగే ఆదేశాలు జారీ చేసే విస్తృత అధికారాలను కలిగి ఉం ది. విమర్శకులు, విపక్ష నాయకులు, డిజిటల్ హక్కుల సమర్థకులు ఈ కేంద్రీకరణ దుర్వినియోగానికి దారితీస్తుందని కొందరు హెచ్చరిస్తు న్నారు. 2023 "వరల్డ్ ప్రెస్ ఫ్రీడం ఇండెక్స్"లో భారతదేశం 180 దేశాల లో 161వ స్థానంలో ఉన్న విషయం మనకు తెలిసిందే. మన దేశంలో, డేటా ప్రొటెక్షన్ బోర్డు ఆఫ్ ఇండియా (డీపీబీఐ) కు స్వాతంత్ర్యం లేకపోవడం విచారకరం.

మన దేశంలో ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం రిపోర్టింగ్ వల్ల గతంలో అనేక కుంభకోణాలు వెలుగులోకి వచ్చాయి. అందువల్ల అసంతృప్తి చెందిన కేంద్ర ప్రభుత్వం, జర్నలిస్టుల డేటా సేకరణ అభ్యర్థనలను, కఠిన శిక్షాత్మక జరిమానాలతో ముంచెత్తి ఇన్వెస్టిగేటివ్ జర్నలిజంను నోరు మూయించేందుకు పూనుకుంది. "జాతీయ భద్రత"పై ఈ చట్టం యొక్క అస్పష్ట నిబంధనలు, ప్రభుత్వ మినహాయింపులు ఈ ఆందోళనను మరింత రేకెత్తిస్తాయి. సెక్షన్ 17(2)(ఏ) భద్రత పేరుతో రాష్ట్ర సంస్థలు డీపీడీపీఏని పూర్తిగా తప్పించుకోవడానికి అనుమతిస్తుంది. ఇది విస్తృత పోలీసుల నిఘా లేదా డేటా నిల్వకు దారితీస్తుంది. ఇవి మీడియా పై ఎటువంటి పర్యవేక్షణ లేకుండా ఆంక్షలు విధించిద వచ్చు. డీపీడీపీఏ సమర్థకులు, డిజిటల్ యుగంలో వ్యక్తిగత డేటా దుర్వినియోగానికి గురవుతున్న సమయంలో పత్రికా స్వేచ్ఛను "గోప్యత హక్కులతో" సమతుల్యం చేయాలని వాదించవచ్చు.

ఈ వాదాన్ని సమర్థిస్తే మీడియాకు ఉండే "సమాచార సేకరణ" అనే ప్రజాస్వామ్య సూత్రాలకు దెబ్బ తగులుతుంది. జర్నలిజం అనేది కేవలం ఒక ప్రత్యేక హక్కు కాదు. ప్రజాస్వామ్యం యొక్క నాలుగో స్తంభం. మీడియా స్వేచ్ఛ సమాచార సేకరణపై ఆధారపడి ఉంటుంది. 2025 ఏప్రిల్ చివరి వరకు ఈ చట్టం ఆలస్యమైనా అమలు, నియమాలు ఇంకా సంప్రదింపులలో ఉండటం కొంత ఆశను కలిగిస్తుంది. ప్రజా సలహాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి, ఈ లోపాలను పరిష్కరించేలా చేయవచ్చు. బహుశా జర్నలిస్టిక్ మినహాయింపులను లేదా డేటా ప్రొటెక్షన్ బోర్డు యొక్క స్వాతంత్ర్యాన్ని స్పష్టం చేయడం ద్వారా. ప్రస్తుత పరిస్థితి ప్రజాస్వామ్య శక్తి కంటే "బ్యూరోక్రాటిక్ సౌలభ్యానికి" అనుగుణంగా ఉన్న చట్టాన్ని సూచిస్తుంది. 1975-77 ఎమర్జెన్సీ సమయంలో పత్రికా సెన్సార్‌షిప్ గరిష్ట స్థాయికి చేరిన చారిత్రక ఉదాహరణలు, బలమైన రక్షణలు లేని చట్టపరమైన చట్రాలు అణచివేత సాధనాలుగా సులభంగా మారవచ్చని గుర్తు చేస్తాయి. ప్రస్తుత రూపంలో డీపీడీపీఏ, ఆ అపఖ్యాతి పాలైన తీరు ప్రమాదంలో ఉంది. బహిరంగ సెన్సార్‌షిప్ ద్వారా కాకుండా పత్రికల జీవనాడి అయిన సమాచారాన్ని సున్నితంగా గొంతు నొక్కడం ద్వారా చేస్తుందేమో చూడాలి.

చివరిగా, 2023 డిజిటల్ వ్యక్తిగత డేటా రక్షణ చట్టం ఒక కీలకమైన దశలో ఉంది. దీని లోపాలను త్వరగా, నిజాయితీగా పరిష్కరిస్తే, ఇది పత్రికా స్వేచ్ఛను త్యాగం చేయకుండా గోప్యతకు సమతుల్య రక్షణగా రూపాంతరం చెందవచ్చు. ప్రస్తుతం, ఈ చట్టం సమ్మతి పేరుతో బాధ్యతను కప్పిపుచ్చే ప్రమాదాన్ని, జర్నలిస్టులను రెడ్ టేప్‌తో కట్టిపడేసే ప్రమాదాన్ని సూచిస్తుంది. ఇప్పటికే అతివ్యాప్తికి లోనైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను శక్తివంతం చేసే ప్రమాదాన్ని కలిగి ఉంది. దెబ్బతిన్నా, స్థితిస్థాపకంగా ఉన్నా భారత ప్రజాస్వామ్యం ఈ జర్నలిజం క్షీణతను, అణిచివేతను భరించలేదు. నాల్గవ స్తంభంగా మీడియా డిజిటల్ యుగంలో రక్షణకు అర్హమైనవి. మీడియా గొంతు నొక్కితే ప్రజలకు ద్రోహం చేసినట్లే.

**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496**

# రేణుకను గుర్తు చేసుకుందాం!



మా ఇంట్లో, మా ఊళ్లో అందరూ ప్రేమగా 'చిట్టమ్మ'గా పిలుచుకునే రేణుక 1970 అక్టోబర్ 14న పుట్టింది. బాపు గుముడవెల్లి సోమయ్య, అమ్మ జయమ్మ (యశోద)ల రెండో సంతానమైన రేణుకకు ఒక అన్న, ఒక తమ్ముడు ఉన్నాం. ఇంట్లో ఒకే ఆడపిల్ల కావడంతో ఆమెను అందరూ ప్రేమగా చూసుకునేవారు. ఊళ్లో వాళ్లు కూడా రేణుకను చాలా ముద్దు చేసేవాళ్లు. అందరు ఆడపిల్లల్లా ఇంటిపనులు, వంటపనులు నేర్చుకోవాలనే ఒత్తిడి ఆమెపై మా ఇంట్లో ఉండేది కాదు. అమ్మాబాపులు ఇచ్చిన స్వేచ్ఛతో ఇంట్లో ఆమెకు పితృస్వామ్య పెత్తనాన్ని పెద్దగా ఎదుర్కోవాల్సి రాలేదని చెప్పొచ్చు.

సన్నగా, పొడుగ్గా ఉండే రేణుక చిన్నప్పటి నుంచే తెలివైన విద్యార్థి. బాపు స్కూలు టీచరు కావడంతో మా కుటుంబం చాలా ఊళ్లు మారాల్సి వచ్చింది. దాంతో ఆమె కోల్కొండ, సీతారాంపురం, కడవెండి, మొత్కూరు, దేవరుప్పుల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూలు చదువు పూర్తి చేసింది. జనగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది.

రేణుక ఇంటర్ చదువుతున్న సమయంలో అన్న వెంకట కిషన్ ప్రసాద్ పూర్తికాలం కార్యకర్తగా ఉద్యమంలోకి వెళ్లిపోయాడు. తను ఇంటర్మీడియట్ పూర్తి చేశాక మా కుటుంబం కడవెండి నుంచి మొత్కూరుకు మారింది. కడవెండిలో ఉన్న ఇల్లు అమ్మేసి మొత్కూరులో ఇల్లు కట్టుకున్నాం. అదే సమయంలో రేణుకకు పెళ్లి జరిపించాలనే తొందరపాటు నిర్ణయం మా కుటుంబం తీసుకుంది. రేణుకకు ఉన్నత చదువులు చదవాలని, అప్పుడే పెళ్లి చేసుకోవద్దని బలంగా ఉన్నప్పటికీ బాపు నిర్ణయాన్ని వ్యతిరేకించలేక పోయింది. పెళ్లి చేసుకున్న తర్వాత కూడా చదువు కొనసాగించవచ్చని బాపు హామీ ఇవ్వడంతో అయిష్టంగానే పెళ్లికి ఒప్పుకుంది. కానీ కొన్ని నెలల్లోనే భర్త వేధింపులు, మానసిక హింసలు, అవమానాలు మొదలయ్యాయి. ఇక అప్పటి నుంచి అమ్మాబాపు ఆమెకు అన్ని విధాలా ప్రోత్సాహం అందించడంతో ఆగిపోయిన చదువును మళ్లీ మొదలుపెట్టింది. దాంతో ఆమెలో మళ్లీ స్వేచ్ఛ రెక్కలు విప్పుకుంది.

ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బీఏ (ఎక్స్‌టర్నల్) పూర్తి చేసి, ఆ తర్వాత ఎంఏ (తెలుగు), లా కోర్సుల కోసం ఎంట్రెన్సు రాసింది. కోఠి విమెన్స్ కాలేజీలో ఎంఏ (తెలుగు)లో, తిరుపతి పద్మావతి యూనివర్సిటీలో ఎల్ఎల్బీలో సీట్లు వచ్చాయి. అయితే, దూరంలో ఉన్నప్పటికీ తిరుపతిలో లా చేయడాన్నే ఆమె ఎంచుకుంది. అలా ఆమె 1992లో తిరుపతికి పయనమైంది. తొలి నుంచే చదువరి, సాహిత్యాభిమాని అయిన రేణుక ఈ దశలో సాహిత్యాన్ని విస్తృతంగా చదివింది. ఆనాడు కడవెండి గ్రామంలో, మొత్తంగా ఉత్తర తెలంగాణలో ఉధృతంగా సాగుతున్న విప్లవోద్యమ ప్రభావం ఆమెపై ఎలాగూ ఉంది. వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా, జీతగాళ్ల వేతనాల పెంపుదల కోసం జరిగిన సమ్మెలు, కడవెండిలో ఒక భూస్వామికి చెందిన పడమటితోటను ఆక్రమించుకొని ఇళు లేని వారికి ఇళ్ల స్థలాలు కేటాయిం చడం కోసం జరిగిన పోరాటం, మహిళలపై వేధింపులకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల ప్రభావం రేణుకపై బలంగా పడింది. వాటిన్నింటినీ ఆమె ఒక క్రమంలో అర్థం చేసుకోవడం మొదలుపెట్టింది.

సంక్షిప్త వైవాహిక జీవితంలో తాను ఎదుర్కొన్న వేధింపుల అనుభవంతో, పితృస్వామ్యాన్ని, దాని వివిధ రూపాలను, ధోరణులను అవగాహన చేసుకోసాగింది. అది నాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫెమినిస్టు సాహిత్యం విస్తృతంగా వెలువడుతున్న కాలం. దాని ప్రభావం కూడా రేణుకపై బాగానే పడింది. అయితే, నూతన ప్రజాస్వామ్యం, సోషలిజం కోసం పోరాడుతున్న కమ్యూనిస్టులు మహిళా సమస్యను ఏ కోణంలో చూస్తారు? దాన్ని ఎంత సీరియస్‌గా తీసుకుంటారు? మహిళల హక్కులను, స్త్రీపురుష సమానత్వాన్ని కమ్యూనిస్టులు అసలు ఎలా సాధిస్తారు? ఇలాంటి ప్రశ్నలు, అనుమానాలు ఆమెకు ఉండేవి. ఈలోగా తిరుపతి పట్టణ ఆర్గనైజర్ పద్మక్కతో ఆమెకు పరిచయం ఏర్పడింది. అమరుడు పులి అంజన్న ఇచ్చిన రిఫరెన్సుతో 1992లో ఒక రోజు మధ్యాహ్నం పూట పద్మక్క యూనివర్సిటీ హాస్టల్‌కు వెళ్లి రేణుకను కలవడం.. తన జీవితాన్ని చిరస్థాయిగా మార్చేస్తుందని బహుశా రేణుక ఊహించి ఉండకపోవచ్చు. రేణుకలో ఉన్న అనుమానాలను, ప్రశ్నలను పద్మక్క ఒక క్రమపద్ధతిలో నివృత్తి చేసింది. స్థానికంగా జరిగే మహిళా ఉద్యమంలో పాల్గొనేలా ప్రోత్సహించింది. అయితే, 1994లో పద్మక్క బూటకపు ఎన్‌కౌంటర్ వార్త రేణుకకు ఓ పిడుగుపాటు. ఆ దుఃఖం నుంచి తేరుకోవడానికి ఆమెకు చాలా కాలం పట్టింది.

ఆచరణ, అధ్యయనం రెండింటిని మేళవిస్తూ రేణుక క్రమంగా ఒక విప్లవకారిణిగా రూపొందింది. మహిళాశక్తి అనే సంఘంలో పని చేస్తూ, ఆ సంఘం నడిపించే మహిళా మార్గం పత్రికకు క్రమం తప్పకుండా కథలు, రిపోర్టులు రాస్తూ ఉండేది. ఒక వైపు చదువుకుంటూనే సంఘం కార్యకలాపాల్లో క్రియాశీలంగా పాల్గొంటూ.. అదే సమయంలో కథా రచయితగా ఎదిగింది. నిజానికి తిరుపతి వెళ్లడానికి ముందే ఒక కథ రాసి 'నలుపు' పత్రికకు పంపించినప్పటికీ, వాళ్ల ఆఫీసులో దాని చివరి పేజీ మిస్ కావడంతో అది అచ్చుకు నోచుకోలేదు. ఆ తర్వాత, తిరుపతిలో ఉన్న కాలంలో వరుసగా అనేక కథలు రాసింది. అక్కడి సాహితీమిత్రుల సద్విమర్శలతో, సూచనలతో తన కథారచన విధానాన్ని మెరుగుదిద్దుకుంది.

1996 నాటికే పూర్తికాలం పార్టీ కార్యకర్తగా పని చేసేందుకు సిద్ధపడ్డ రేణుకను పార్టీ నాయకత్వం పట్టణోద్యమంలోనే పని చేయాలని సూచించింది. వరకట్న హత్యలు, ఆడపిల్లలపై లైంగిక వేధింపులు, మురికివాడల్లో ప్రజలు ఎదుర్కొనే దైనందిన సమస్యలు వంటి వాటిపై జరిగిన పోరాటాల్లో ఆమె క్రియాశీలంగా పాల్గొంది. వాటికి నాయకత్వం వహించింది. అదే సమయంలో మహిళామార్గం ఎడిటోరియల్ బోర్డులో భాగమై పత్రికను క్రమం తప్పకుండా ప్రచురించడంలో కీలక బాధ్యత పోషించింది. ఆ తర్వాత వేర్వేరు మహిళా సంఘాలతో కలిసి ఏర్పడ్డ చైతన్య మహిళా సమాఖ్యలో కూడా రేణుక భాగమైంది.

పార్టీ ఉన్నత నాయకత్వాన్ని కలిసేందుకు రేణుక అప్పుడప్పుడు నల్లమల అడవుల్లోకి వెళ్తూ ఉండేది. అమరుడు లింగమూర్తి (కృష్ణన్న) ఆమెకు బాధ్యుడు. ఆనాటికి సంతోష్ కేంద్రకమిటీ సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సెక్రటరీగా ఉన్నాడు. సంతోష్ పేరు కడవెండిలో అందరికీ సుపరిచితమే కానీ రేణుకకు ఆయనతో పెద్దగా పరిచయం లేదు. కృష్ణన్న, అమరుడు ఆర్కే ఇద్దరూ కలిసి సంతోష్, రేణుకల ముందు విడివిడిగా పెళ్లి ప్రతిపాదన ఉంచారు. వారిద్దరు కలుసుకుని మాట్లాడుకునే ఏర్పాటు చేశారు. అలా కొంత కాలం పాటు ఇద్దరి మధ్య కొనసాగిన సంభాషణలు, ప్రేమకు, పెళ్లికి దారితీశాయి. అయితే, సంతోష్ అప్పటికే అగ్రశ్రేణి నాయకుడు కావడం, మరోవైపు రేణుక పట్టణంలో బహిరంగంగా జీవిస్తూ ప్రజాసంఘాల కార్యక్రమాల్లో పని చేస్తూ ఉండటంతో ఈ పెళ్లిని రహస్యంగా ఉంచాలని పార్టీ నిర్ణయించింది. ఉన్నత నాయకత్వానికి, రేణుకకు సన్నిహితులైన కొందరు కామ్రేడ్స్‌కు తప్ప మరెవ్వరికీ ఇది తెలియదు.

కొంతకాలానికి రేణుక కార్యరంగం విశాఖ నగరానికి మారింది. అక్కడ లాయర్‌గా ప్రాక్టీస్ కొనసాగిస్తూనే ప్రజాసంఘాల్లో క్రియాశీలంగా పని చేసింది. పేద బస్తీల్లో నివసించే మహిళలను కూడగట్టేందుకు కృషి చేసింది. విశాఖ నగర కమిటీ కార్యదర్శిగా ఉన్న అమరుడు కౌముది నాయకత్వంలో పని చేసిన రేణుక తన సాహిత్యకృషిని కూడా యథావిధిగా కొనసాగించింది. కౌముది అప్పటికే పేరుగాంచిన విప్లవ కవి. అందుకే, తమ మధ్య జరిగే సమావేశాల్లో ఉద్యమ సమస్యలపై జరిగే చర్చలతో సమానంగా కవిత్వం, కథల గురించి కూడా చర్చలు కూడా జరిగేవని రేణుక గుర్తు చేసుకునేది.

2003 చివరి నాటికి కౌముది బూటకపు ఎన్‌కౌంటర్‌కు బలికావడంతో రేణుక ఇక బహిరంగ జీవితం గడపలేని పరిస్థితి తలెత్తింది. పోలీసులు నిరంతరం వెంటాడుతూ, అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తూ ఉండటంతో వారి కన్ను గప్పేందుకు అన్ని విధాలా ప్రయత్నించింది. చివరకు కొందరు విప్లవాభిమానులు ఎంతో సాహసోపేతంగా ఆమెను మహారాష్ట్రకు తరలించి అక్కడి పార్టీ నాయకత్వానికి రేణుకను అప్పగించారు. అక్కడి నుంచి ఒడిషా చేరుకున్న ఆమె బాంసధార డివిజన్‌లో ఉద్యమ బాధ్యతలు చేపట్టింది. త్వరలోనే ఒడియా భాష నేర్చుకొని ఆ భాషలో రాయడం కూడా నేర్చుకునే దిశగా అడుగులు వేసింది.

2005లో శాఖమూరి అప్పారావును ఆమె తన జీవిత భాగస్వామిగా ఎంచుకుంది. ఇద్దరికీ ప్రత్యక్ష పరిచయం లేకున్నా పరోక్షంగా ఒకరి గురించి మరొకరికి బాగా తెలుసు. ఇద్దరూ తమ తమ వైవాహిక జీవితాల్లో సంక్షోభాలను అధిగమించిన వారే. అయితే, ఇద్దరి బాధ్యతలు, కార్యరంగాలు వేర్వేరు కాబట్టి చాలా అరుదుగానే వారిద్దరికి ఒకచోట గడిపే అవకాశం దొరికేది. 2010 మార్చి 12న శాఖమూరి ఎన్‌కౌంటర్ వార్త రేణుక జీవితంలో మరోసారి విషాదాన్ని నింపింది. కలిసి గడిపింది కొద్ది కాలమే అయినా ఆమెపై చెరగని ముద్ర వేసిన ప్రేమమూర్తి శాఖమూరి. అయితే, వ్యక్తిగత జీవితంలో ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా విప్లవాచరణలో ఏనాడూ వెనుకడుగెయ్యని రేణుక మరోవైపు సాహితీకృషిని అంతే పట్టుదలతో కొనసాగించింది.

2006లో పార్టీ ఆమెకు 'క్రాంతి' పత్రిక సంపాదక బాధ్యతలు అప్పగించింది. అలా ఆమె కార్యరంగం ఒడిషా నుంచి దండకారణ్యానికి మారింది. ఆనాటి నుంచి ఏప్రిల్ 1, 2025 సాయంత్రం నిర్జీవిగా ఇంద్రావతి నదికి దక్షిణం వైపున్న రోడ్డు మీదుగా ఆంబులెన్సులో ప్రయాణించి, గోదావరి నది దాటి తెలంగాణ సరిహద్దులోకి ప్రవేశించేంత వరకూ.... అంటే దాదాపు ఇరవయ్యేళ్ల పాటు దండకారణ్యం ఆమె చిరునామాగా నిలిచింది.

ఆమె సాహితీ కృషి గురించి చెప్పుకోవాలంటే... 'భావుకత'తో మొదలై, 'మెట్లమీద', 'ప్రవాహం', 'ఇద్దరు తల్లులు', 'అమ్మ కోసం'.... ఇలా మొత్తం ఆమె రాసిన కథలు 40 వరకు ఉండొచ్చని అంచనా. 'మిడ్కో' పేరుతో కథలు, 'జమీన్' పేరుతో కొన్ని కవితలు, 'బిడి దమయంతి' పేరుతో ఉద్యమ నివేదికలు, విశ్లేషణలు రాసింది. ఇంకా 'నిర్మల' అనే పేరుతో కూడా కొన్ని కథలు రాసింది. తర్వాతి కాలంలో ఆమె రాసిన వాటిలో 'పచ్చని బతుకులపై నిప్పుయి కురుస్తున్న రాజ్యం', 'మండుతున్న గాయాలు', 'విముక్తి బాటలో నారాయణపట్నా', 'దండకారణ్యంలో గ్రీన్ హంట్' మొదలైనవి ముఖ్యమైనవి. మూసపోత భాషను, రొడ్డకొట్టుడు పదజాలాన్ని వాడకుండా, అనవసర అతిశయోక్తులు లేకుండా సూటిగా, సంక్షిప్తంగా, అర్థమయ్యేలా, పాఠకులను కదిలించేలా రాయడం రేణుక ప్రత్యేకత. అవసరానికి మించి ఒక్క మాట కూడా అదనంగా మాట్లాడని ఆమె స్వభావం ఆమె రచనలో కూడా ప్రతిబింబించేది. తక్కువ మాట్లాడుతూ, ఎక్కువ పరిశీలించడం, ఏదైనా తప్పనిపిస్తే ఎలాంటి మొహమాటం, భయం లేకుండా చెప్పడం, అందరితో ఆప్యాయంగా, నిష్కల్మషంగా మాట్లాడే ఆమె స్వభావం అందరినీ ఆకట్టుకునేది.

మహిళా మార్గంతో మొదలై, విప్లవ పథం, క్రాంతి, ప్రభాత్, పోరు మహిళ, లడెమాయన మహిళ.... లాంటి ఎన్నో పత్రికలకు ఆమె సంపాదకత్వం వహించింది లేదా వాటి కోసం రాసిందని ఆమె సహచరులు గుర్తు చేసుకుంటారు. శారీరకంగా దుర్బలంగా కనిపించే రేణుక పనిలో అంతులేని పట్టుదలను, ఓపికను ప్రదర్శించేదని, పగలూ, రాత్రి తేడా లేకుండా కంప్యూటర్‌పై పని చేసేదని ఎందరో గుర్తు చేసుకుంటారు. ఒకవైపు పత్రికల నిర్వహణ పనులు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలిగా నాయకత్వ బాధ్యతలు చూస్తూనే దొరికిన విరామ సమయాల్లో తోటి సహచరులకు ఉత్తరాలు రాస్తుండేది. ఆమె రాసే ఉత్తరాలను వారు అపురూపంగా దాచుకునేవారు. ఆమె వారిని పలకరించే తీరు, వారిపట్ల చూపే ఆప్యాయత, సమస్యలపై ఆమె చేసే విశ్లేషణ... వీటిని గుర్తు చేసుకుంటూ కన్నీరు పెట్టనివారు లేరంటే అతిశయోక్తి కాదు. ఉద్యమం నుంచి బయటకు వెళ్లిపోయిన వారిలో కూడా కొందరు ఇప్పటికీ ఆమె ఉత్తరాలు దాచిపెట్టుకున్నారంటే ఆమె ఎలా వారిపై చెరగని ముద్ర వేసిందో అర్థం చేసుకోవచ్చు. 2014లో తన అన్న ఉద్యమం నుంచి బయటకు రావడం రేణుకను నిరాశపర్చింది. ఆయన లొంగుబాటును ఆమె వ్యతిరేకించింది. తాను మాత్రం చివరి ఊపిరి ఉన్నంత వరకూ విప్లవపథాన్ని వీడనని తల్లిదండ్రులకు లేఖ రాసింది.

చివరగా... ఒక కమ్యూనిస్టు విప్లవకారిణిగా, రచయితగా, సంపాదకురాలిగా ఆమె చేసిన కృషినంతా కుటుంబంగా మేం సమగ్రంగా అర్థం చేసుకోలేక పోవచ్చు. తెలుసుకోలేకపోవచ్చు. బహుశా ఎన్నటికీ తెలియను కూడా తెలియకపోవచ్చు. కానీ అంచెలంచెలుగా ఎదుగుతూ, తాను నమ్మిన లక్ష్యం కోసం చివరి వరకూ పట్టుదలగా నిలబడ్డ రేణుక జీవితం మాకు ఎల్లప్పటికీ గర్వకారణంగా ఉంటుంది. శ్రమజీవుల కష్టాలు తొలగిపోవాలని, దోపిడీ పీడనలు లేని సమసమాజం రావాలని, మహిళలపై వివక్ష, అణిచివేతలు లేకుండా పోవాలని, కుల నిర్మూలన జరగాలని, కులహంకార దాడులు లేకుండా పోవాలని, మతతత్వం నశించాలని ఆమె కన్న కలలను నిజం చేయడం మనందరి కర్తవ్యం. దానికి ఆమె అమరత్వం మనకు ప్రేరణగా నిలవాలి. ఎందుకంటే... ఆమెది మామూలు చావు కాదు.. ఒక కథలో ఒక తల్లి సంభాషణగా రాసినట్టు, 'ఊరి నడిమధ్యన గోరయి నిలిచే అసువంటి సావు!'

# మీడియా సానుకూల దృక్పథాన్ని పెంచాలి

- దేశ సమైక్యతను ప్రోత్సహించే వార్తలు ఇవ్వాలి
- సమాజాన్ని చీల్చే ప్రయత్నాలు చేసేవారికి మీడియాలో ప్రాధాన్యం ఇవ్వకూడదు
- భారత గౌరవ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు
- వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధులతో సమావేశం



**హైదరాబాద్, ఏప్రిల్ 10 (జనంసాక్షి) :** సమాజంలో సానుకూల దృక్పథం పెంపొందించేలా, ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెంచేలా మీడియా కృషి చేయాలని భారత గౌరవ పూర్వ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ ప్రతినిధులు గురువారం శ్రీ వెంకయ్యనాయుడుగారిని హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా ప్రచురించిన శ్ర విశ్వావసు నామ సంవత్సర ఉగాది పంచాంగ ప్రతిని వెంకయ్యనాయుడుగారికి అందించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడారు. వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియాలు సంచలనాలకు దూరంగా, వాస్తవాలకు దగ్గరగా సమాచారాన్ని ఇవ్వాలన్నారు. సమాజ నిర్మాణంలో, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాల్సిన మీడియా విశ్వసనీయతను పోగొట్టుకోకూడదని సూచించారు. పాత్రికేయులు నిత్యం దేశహితాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. దేశానికి హాని కలిగించే వార్తలను, సమాచారాన్ని ప్రోత్సహించకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆ ప్రభుత్వం మన దేశానిదని గ్రహించాలని, అందుకే దేశానికి హాని కలిగించే విధంగా వార్తలు రాయకూడదని సూచించారు. దేశ సమైక్యతను ప్రోత్సహించే వార్తలు, ప్రకృతి వనరులను పరిరక్షించే విధంగా ప్రోత్సహించే వార్తలు రావాలన్నారు. "జర్నలిజం అంటే ఏ ఇజం వైపు మొగ్గు చూపకుండా నిజం మాత్రమే వినిపించే, చూపించే విధంగా ఉండాలి. కొంతమంది నేతలు సమాజాన్ని చీల్చే విధంగా, కులమత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారు. జర్నలిస్టులు అటువంటి వారికి ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వకూడదు. జాతీయతా భావాన్ని పెంచే విధంగా, సమాజాన్ని ఐక్యంగా ఉంచడానికి పాటుపడే నేతలకు మద్దతుగా జర్నలిస్టులు, మీడియా ఉండాలి." అని సూచించారు.

### ఒకే దేశం-ఒకే ఎన్నికతో ప్రయోజనం

ఒకేదేశం-ఒకే ఎన్నిక ప్రతిపాదనపై ఇటీవల దేశవ్యాప్తంగా చర్చజరుగుతుండడంపై స్పందిస్తూ జమిలి ఎన్నికల వల్ల చాలా ప్రయోజనం ఉందన్నారు. కొన్ని పార్టీలు ఈ ప్రతిపాదనను వ్యతిరేకించడం హేతుబద్ధంగా లేదని చెప్పారు. ప్రాంతీయ పార్టీలకు ముప్పు అన్న వాదనలో పసలేదన్నారు. ఒకేసారి కేంద్రానికి, రాష్ట్రాలకు ఎన్నికలు నిర్వహించినా కేంద్రంలో ఎవరికి ఓటువేయాలో, రాష్ట్రంలో ఎవరికి ఓటు వేయాలో ప్రజలు వివేచనతో, విచక్షణతో నిర్ణయం తీసుకోగలరని స్పష్టం చేశారు. జమిలి ఎన్నికలను వ్యతిరేకించడం అంటే ప్రజల విజ్ఞతను ప్రశ్నించడమే అన్నారు. లోక్ సభకు, ఏదైనా రాష్ట్రానికి ఒకేసారి ఎన్నికలు జరిగినా కేంద్రంలో ఒక పార్టీని, రాష్ట్రంలో మరో పార్టీని ఎన్నుకున్న సందర్భంగా గతంలో చాలా ఉన్నాయని ఉదాహరణలను ఉటంకించారు.

### మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలి

మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలని వెంకయ్యనాయుడు చెబుతూ నూతన విద్యావిధానం మాతృభాషలో ప్రాథమిక విద్యబోధనను తప్పనిసరి చేయడం మంచి పరిణామన్నారు. త్వరలోనే సాంకేతిక విద్యకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు కూడా మాతృభాషలోనే వస్తాయన్నారు. బ్రిటిష్ వలసపాలకులు పోతూ పోతూ ఆంగ్లభాషను మనపై రుద్ది వెళ్లారని, సంపదను కొల్లగొట్టుకుని వెళ్లడమే కాకుండా కొంత మంది మనసులను కూడా దోచుకుని వెళ్లారని, అందుకే వారు రుద్దిన చరిత్రకే ప్రాచుర్యం కల్పిస్తున్నారని చెప్పారు. అలెగ్జాండర్, రాబర్ట్ క్లైవ్ వంటి వారిని గ్రేట్ అన్నారని, మన ఛత్రపతి శివాజీ, మన వీరపాండ్య కట్టబ్రహ్మన, మన అల్లూరి సీతారామరాజు, మన రాణా ప్రతాప్ సింగ్, మన కొమరం భీం, మన రాణీ రుద్రమదేవి గొప్పవారు కాదా అని ప్రశ్నించారు. ఇప్పుడు పరిస్థితుల్లో మార్పు వచ్చిందని, ప్రజలు వాస్తవాలు గ్రహిస్తున్నారని చెప్పారు. మాతృభాష పట్ల ప్రజల్లో మమకారం పెరుగుతోందని చెప్పారు. మాతృభాషలో మాట్లాడుతూ మిగిలిన ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులన్నీ తెలుగులోనే ఇవ్వాలని, తెలుగు భాషకు మరింత ప్రాధాన్యం పెరగాలంటే తెలుగు మాధ్యమంలో బోధనకు, రాయితీల పథకాలకు ముడిపెట్టాలని సూచించారు.

### వక్ఫ్ సవరణ చట్టంపై..

వక్ఫ్ సవరణ చట్టంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ విశాల హితాన్ని దృష్టిలో ఉంచుకుని దీన్ని ఎవరూ వ్యతిరేకించకూడదన్నారు. ధర్మకార్యాలకు ఇచ్చిన ఆస్తులు దుర్వినియోగం కాకుండా చూసేందుకు తీసుకొచ్చిన ఈ చట్టాన్ని అందరూ గౌరవించాలన్నారు. వక్ఫ్ ఆస్తులు కొంత మంది స్వార్థపర వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా చూడడమే ఈ చట్టం ఉద్దేశమన్నారు.

### రాజ్యాంగాన్ని గౌరవించాలి

మావోయిస్టుల శాంతి ప్రతిపాదనపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ ప్రజలు శాంతిని స్వాగతిస్తారని, ఆయుధం పట్టడమే అసలు సమస్య అని, వారు ఆయుధాలు వీడాలని అన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించాలన్నారు. తమ సిద్ధాంతం బలమైనది అని విశ్వసించినప్పుడు ప్రజల తీర్పు కోరాలని, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే ఎన్నికల్లో పోటీ చేసి ప్రజల మద్దతు కోరాలని అన్నారు.

### భాష హుందాగా ఉండాలి

కొంత మంది రాజకీయ నేతలు వాడుతున్న అభ్యంతకర భాషపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ రాజకీయాల్లో ఉన్నప్పుడు భాష హుందాగా ఉండాలన్నారు. బూతులు మాట్లాడే నేతలకు పోలింగ్ బూత్‌లలో సమాధానం చెప్పాలని తాను ఎప్పుడూ చెబుతుంటానని, ప్రజలు అలాంటి నేతలకు బుద్ధి చెప్పడం మనం చూశామని చెప్పారు. కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా - తెలంగాణ గౌరవ అధ్యక్షులు శ్రీ నందనం కృపాకర్, ప్రధాన కార్యదర్శి శ్రీ రావికంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శ్రీ సిద్దిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, హైదరాబాద్ అధ్యక్షుడు శ్రీ జోష్యుల బాలకృష్ణ, హైదరాబాద్ సిటీ ఉపాధ్యక్షుడు శ్రీ కోటిరెడ్డి పాల్గొన్నారు.

## చంద్రబోస్ నగర్‌లో చలివేంద్రం ఏర్పాటు




**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 10 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గ మాదాపూర్ డివిజన్ పరిధి సుభాష్ చంద్రబోస్ నగర్ లో డివిజన్ మాజీ అధ్యక్షులు డి సురేష్ నాయక్ జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన చారిటబుల్ ట్రస్ట్ నేతృత్వంలో గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వాలిదాసు జగదీశ్వర్ గౌడ్ హాజరై తన చేతులమీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదాపూర్ డివిజన్ పరిధిలో మాజీ అధ్యక్షులు డి సురేష్ నాయక్ కు రాజకీయంగానే కాకుండా సౌమ్యుడిగా ఎంతో పేరు ఉందని, నిజమైన ప్రజానాయకునిగా డివిజన్ ప్రజల హృదయాలలో ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. అందుకే సురేష్ నాయక్ జ్ఞాపకార్థం చారిటబుల్ ట్రస్ట్ ను ఏర్పాటుచేసి ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలను చేపడుతుండడం శుభపరిణామం అన్నారు. ప్రతి మనిషి తోటి వారి సంక్షేమం కోసం తోచిన మంచి పనులు కొన్ని చేయడం ద్వారా ఆత్మసంతృప్తితోపాటు సమాజ అభివృద్ధికి పరోక్షంగా సహకరించిన వారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, సురేష్ నాయక్ కుటుంబ సభ్యులు, అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువ వికాసం..దరఖాస్తుల పరిశీలన




**పాపన్నపేట, ఏప్రిల్ 10 (జనంసాక్షి) :** పాపన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తులను మండల ప్రత్యేక అధికారి డీఎల్పీవో సురేష్ బాబు పరిశీలించారు.ఇందులో భాగంగా సీనియర్ సహాయకులు వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

## ఇండియా-సౌత్ ఏషియాలో నాలుగోసారి జిఎంఆర్ శంషాబాద్ బెస్ట్ ఎయిర్‌పోర్ట్ స్టాఫ్ అవార్డు




**శంషాబాద్, ఏప్రిల్ 10 (జనంసాక్షి) :** జీఎంఆర్ శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్) ప్రతిష్ఠాత్మక స్కైట్రాక్స్ సర్వేలో మరోసారి అత్యున్నత గౌరవాన్ని సాధించింది. ఇండియా, సౌత్ ఏషియా విభాగంలో 'బెస్ట్ ఎయిర్‌పోర్ట్ స్టాఫ్ 2025 అవార్డును గేల్ నాలుగవ సారిగా అందుకుంది. స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో జరిగిన ప్యాసింజర్ టెర్మినల్ ఎక్స్‌పో 2025లో ఈ గుర్తింపు ప్రకటించబడింది. ఈ అవార్డు ప్రతి కస్టమర్ టచ్‌పాయింట్ వద్ద స్టాఫ్ వ్యవహారం, స్నేహపూర్వకత, సమర్థతను జాగ్రత్తగా పరిశీలించే స్కైట్రాక్స్ ఆడిట్ల ఆధారంగా ప్రకటించబడింది.ప్రయాణికుల కోసం వేచిచూచే సమయాన్ని తగ్గించే డిజిటల్ పరిష్కారాలు, విశ్రాంతికి అనువైన లౌంజ్‌లు, విభిన్నమైన షాపింగ్, భోజన సదుపాయాలు, ప్రయాణికుల కోసం శిక్షణ పొందిన సిబ్బందితో గేల్ తీసుకొచ్చిన ఎన్నో వినూత్న మార్గాలు ఈ గౌరవానికి కారణం.

జీఎంఆర్ శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ సీఈఓ ప్రదీప్ పనిక్కర్ మాట్లాడుతూ ఇండియా సౌత్ ఏషియా విభాగంలో నాలుగోసారి 'బెస్ట్ ఎయిర్‌పోర్ట్ స్టాఫ్' అవార్డు అందుకోవడం గర్వకారణం అన్నారు. ఇది మా సిబ్బంది భాగస్వాముల అంకితభావం, ప్రొఫెషనలిజం, ఆతిథ్యానికి ప్రతీక. ప్రతి ఒక్కరూ నిష్టతో పనిచేస్తూ, ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారు. మేము ప్రయాణికుల అవసరాలను ముందుగానే అంచనా వేసి, వ్యక్తిగత శ్రద్ధతో గుర్తుండిపోయే అనుభవాన్ని కల్పించేందుకు కట్టుబడి ఉన్నాం. ప్రయాణికుల సౌకర్యాన్ని ధ్యేయంగా పెట్టుకుని, మా సేవా సంకల్పం కొనసాగుతుందన్నారు. 1989 నుండి గ్లోబల్ విమానయాన ప్రమాణంగా నిలిచిన స్కైట్రాక్స్, విమానాశ్రయాల్లోని టెర్మినల్ సౌకర్యాలు, పరిశుభ్రత, సిబ్బంది సేవల నాణ్యత, భద్రతా ప్రమాణాలు వంటి అంశాలపై సమగ్రంగా మూల్యాంకనం చేస్తుంది. జిఎంఆర్ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చిన ఈ గౌరవం అన్నారు.

## శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- రాష్ట్ర ప్రజాపద్దల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 10 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం రాష్ట్రంలోనే అత్యంత శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నియోజకవర్గమని, నియోజకవర్గం అభివృద్ధికి బల్దియా ప్రత్యేక కార్యాచరణను రూపొందించి నిధులను కేటాయించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. నియోజకవర్గం పరిధి గచ్చిబౌలి జంక్షన్, నల్లగండ్ల తెల్లాపూర్ చౌరస్తా జంక్షన్‌లను జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో అభివృద్ధిపరిచిన కూడల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయా డివిజన్లో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, గంగాధర్ రెడ్డితో కలిసి గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలు మరియు లింక్ రోడ్ల అభివృద్ధిపై జిహెచ్ఎంసి అధికారులు ప్రత్యేక కార్యాచరణను రూపొందించి అమలుపరచాలని కోరారు. గచ్చిబౌలి జంక్షన్, నల్లగండ్ల తెల్లాపూర్ చౌరస్తా జంక్షన్ లను ఆధునిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ నిర్దిష్టమైన విధానంలో పనులన్నీ త్వరితగతిన పూర్తిచేయడం జరిగిందని, సకల సౌకర్యాలు అన్ని రంగులతో ప్రస్తుతం ఈ రెండు కూడళ్ళు నిర్మాణాత్మక అభివృద్ధిని సాధించాయన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి బాటలువేసే విధంగా ప్రజల మెరుగైన జీవన ప్రమాణాలకోసం, ట్రాఫిక్ రహిత సమాజం కోసం నియోజకవర్గ పరిధిలో అవసరమైన ప్రాంతాలలో మరిన్ని రోడ్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అన్నారు. నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని, ఇందుకోసం ప్రత్యేక నిధులను కేటాయించి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని అరికపూడి కోరారు. లింక్ రోడ్లు, రోడ్డు విస్తరణ పనుల పురోగతి, అసంపూర్తిగా మిగిలిపోయిన నాలాల పనులు త్వరగా పూర్తయ్యేలా ప్రత్యేక చొరవను చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో జిహెచ్ఎంసి అధికారులు సానుకూలంగా స్పందించడం జరిగిందని, వెంటనే పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని భరోసాను వ్యక్తం చేయడం జరిగిందని అరికపూడి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న నిందితుడు అరెస్టు

- రిమాండ్‌కు తరలింపు



**రాజేంద్రనగర్, ఏప్రిల్ 10 (జనం సాక్షి) :** అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హసన్ నగర్ లో గంజాయి విక్రయిస్తున్న నిందితున్ని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. అత్తాపూర్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు ప్రకారం నిందుతుడు పహాడీ షరీఫ్ కు చెందిన షేక్ జాకీర్(42) చార్మినార్ మజీద్ రాజీవ్ గాంధీ నగర్ కు చెందిన షాహిన్ నగర్ లో ఉంటూ ఆటో డ్రైవర్గా వృత్తి కొనసాగిస్తూ గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తున్నాడు. 6-4-2025 అర్ధరాత్రి మూడు గంటలకు నిందితుడు హైదరాబాద్‌లోని కాచిగూడ రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కి 06.04.2025న మధ్యాహ్నం 3:00 గంటలకు మహారాష్ట్రలోని అమరావతికి చేరుకున్నాడు. కమేలా గ్రౌండ్‌కు వెళ్లి గుర్తు తెలియని వ్యక్తిని కలిసి రూ. 20 వేలకు మొత్తానికి 1 కిలోల డ్రై గంజాయిని కొనుగోలు చేశాడు. 7.04.2025న సాయంత్రం 8గంటలకు రైలులో హైదరాబాద్‌కు తిరిగి వచ్చి తన ఇంటికి చేరుకున్నాడు. 8.04.2025 మధ్యాహ్నం అతను 100 ఖాళీ చిన్న ప్యాకింగ్ పాలిథిన్ కవర్లను తీసుకుని వీటిని నలుపు రంగు క్యారీ బ్యాగ్‌లో ప్యాక్ చేసి, దీనిని గంజాయిని కాటన్ లూప్‌లో ఉంచి, హసన్ నగర్‌లోని కబ్రస్తాన్ ఏరియాకు వచ్చి, గంజాయిని తక్కువ పరిమాణంలో అవసరమైన వారికి విక్రయించి సొమ్ము చేసుకున్నాడు.ఆ తర్వాత ఈ గంజాలను దాదాపు 1012 గ్రాముల బరువున్న జిప్ లాక్ పాలిథిన్ కవర్లో పోసి విక్రయిస్తుండగా నిందితులను పట్టుకుని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

# గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

- పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎంపీ
- డీకే అరుణ



**ఉర్కొండ, ఏప్రిల్ 10 (జనం సాక్షి) :** ఉర్కొండ మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి మహబూబ్నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి మండల అధ్యక్షులు రాజేందర్ గౌడ్ అధ్యక్షతన ఎంపీ డీకే అరుణకు ఘన స్వాగతం పలికారు. ముచ్చర్లపల్లి గ్రామంలో దేవాలయ ఆవరణలో మొక్కలను నాటడం జరిగింది.అనంతరం రామ్ రెడ్డి పల్లి గ్రామంలో అండర్ డ్రైనేజీ పనులను, సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు.ఊరుకొండ మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బిజెపి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ,మండల, గ్రామస్థాయి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాందేవ్ షర్బత్ జిహాద్




ముందు యోగా గురువుగా రంగ ప్రవేశం చేసి మెల్ల మెల్లగా రాందేవ్ బాబా అవతారం ఎత్తిన ఈ పతంజలి ప్రొడక్ట్స్ గురువు ఇప్పుడు తన షర్బత్ అమ్ముకోవడానికి ఇతర బ్రాండ్ షర్బతులను జిహాద్ అంటున్నాడు. ఇతర బ్రాండ్ మార్కెట్లో మంచి పేరుఉన్న బ్రాండ్ షర్బతుల వాళ్ళు షర్బత్ అమ్మి వచ్చే డబ్బుతో మస్జిద్, మదరసాలు నిర్మిస్తారట, తన షర్బత్ అలా కాదని బహిరంగం గా చెబుతున్నాడు.

### దంత మంజన్ సంగతి మర్చిపోతే ఎట్లా?

బాబా పతంజలి బ్రాండ్ దంత్ మంజన్ వెజిటేరియన్ కాదని అందులో సముద్రపు చేప వెముకల పౌడర్ ఉందని ఆరోపణలు వచ్చాయి. అలోపతి డాక్టర్లను అవహేళన చేస్తూ రాందేవ్ బాబా తన పతంజలి బ్రాండ్ ఇమేజ్ కోసం పనిచేస్తున్న క్రమంలో సుప్రీం కోర్టు మరోసారి తప్పుడు కూతలు కూసి ఇబ్బందులు పడవద్దు అని హెచ్చరించి నపుడు ఇతను సుప్రీం కోర్టులో క్షమాపణ లు చెప్పింది దేశం ఇంకా మరచి పోలేదు. రాందేవ్ కరోనా సమయంలో మందు తయారు చేసి నితిన్ గడ్కరీ లాంటి కేంద్ర మంత్రులను మార్కెట్ కోసం వాడుకున్న విషయాన్ని ఎవరు మర్చిపోగలరు. రాందేవ్ తనని తాను యోగ గురువు నుంచి బాబా గా మార్చుకుని వేలకోట్ల రూపాయల ఆస్తికి పతంజలి బ్రాండ్ మందులను తెచ్చి, ఇతర తినుబండారాలను అమ్ముకుంటూ ఫక్తు వ్యాపారి గా మారాడు. ఇతను ఒక పచ్చి అబద్ధాలు చెప్పే మోసగాడు! ఇప్పుడు ఏకకంగా తన షర్బత్ ను అమ్ముకోడానికి దశాబ్దాలు గా జన ఆదరణలో ఉన్న బ్రాండ్ షర్బత్ లను తక్కువ చూపడమే కాకుండా దానికి ముస్లిం మైనార్టీలకు లింకు పెట్టి షర్బత్ జిహాద్ అంటున్నాడు.

### వారు మస్జిద్, దర్గాలు నిర్మిస్తారట

వారు మస్జిద్ లు మదరసాలు నిర్మిస్తారట, దీరేంద్ర , కుమార్ విశ్వాస్ ఇలా ంటి వాళ్ళు తాజ్ మహల్ మీద కూడా తప్పుడు మాటలు మాట్లాడుతారు. ప్రముఖ నటుడు ఎంపీ శత్రుఘ్నసిన్హా కూతురు నటి సోనాక్షి సిన్హా ఒక ముస్లింను వివాహం చేసుకుంటే తప్పుడు ట్వీట్ లు చేస్తారు. ఇంటిపేరు రామాయన్ పెట్టుకుంటే లాభం లేదు (శత్రుఘన్ సిన్హా) ఇంటి ముందు రామాయఎన్ అని ఉంటుంది. ఇలా హేళన చెస్తారు. వీళ్లంతా బీజేపీ మద్దతు దారులు, కుమార్ విశ్వాస్ ఇంతకు ముందు ఆమ్ ఆద్మీ పార్టీ లో ఉండే వాడు, ఇప్పుడు బీజేపీ లో ఉండి రెచ్చి పోతున్నాడు, బీజేపీ టికెట్ ఇస్తే ఎంపీ కావాలని చూస్తున్నాడు! బీజేపీ వీళ్ళను ఎంటర్టైన్ చేస్తున్నది.

### రామ్ రహీం 13 వసారి పేరోల్ మీద

ఒక జర్నలిస్ట్ , మహిళల హత్య కేసుల్లో జైల్లో ఉన్న రామ్ రహీం అలియాస్ గుర్మీథ్ బాబా 13 వ సారి పేరోల్ మీద విడుదల అయి బయట ఉన్నాడు ! ఇతన్ని ఎన్నికలు ఉన్నప్పుడల్లా విడుదల చేయిస్తారు! ఇతనికి ప్రథమ శ్రేణి వివిఐపి ట్రీట్మెంట్ ఇచ్చి వాడుకుంటారు! ఇతని అం ధభక్తులు ఇతన్ని నమ్మి ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు వేయిస్తారు! చివరికి బిల్కిస్బాను కేసులో శిక్షలు అనుభవిస్తున్న వారిని శిక్షలు పూర్తి కాకుండానే విడుదల చేయించి రేప్ మర్డర్ కేసుల్లో ఉన్న వారికి సన్మానాలు చేసి వేదికలు ఎక్కించిన దృశ్యాలు చూసాం! అదేమరి బీజేపీ అంటే! రాందేవ్ షర్బత్ జిహాద్ వివాదంలో అయన వివాదాస్పద వీడియోతో మళ్ళీ కోర్టు ముందుకు అతన్ని తీసుకెళ్లే పరిస్థితి కనిపిస్తున్నది.



ఎండి. మునీర్
సీనియర్ జర్నలిస్ట్
విశ్లేషకులు, 9951865223

# చివరి గింజ వరకు ప్రభుత్వం వరి కొనుగోలు

- జిల్లాలో 95,687 ఎకరాలలో వరి ధాన్యం పంట
- దొడ్డు రకం దాన్యం 28,013 ఎకరాలలో పంట
- సన్న రకం ధాన్యం 7654 ఎకరాలలో పంట
- జిల్లావ్యాప్తంగా 218 కొనుగోలు కేంద్రలు కేంద్రలు
- ఆందోల్ మార్కెట్లో యాసంగి వడ్ల కొనుగోలు ప్రారంభం
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 10 (జనం సాక్షి) :** చివరి గింజ వరకు ప్రభుత్వం వరి కొనుగోలు చేస్తుందని వైద్య ఆరోగ్య,కుటుంబ, సంక్షేమ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లాలోని అందొల్ వ్యవసాయ మార్కెట్లో యాసంగి పంట వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరైనారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యాసంగి పంట వరి కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాల ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. వరి ధాన్యం కొనుగోలు యాసంగి (రబీ) 2024-25 కనీస మద్దతు (ఎం ఐ పి) రూ. 2320 తో పాటు సన్న రకం ధాన్యం పండించే రైతులకు తెలంగాణ ప్రభుత్వం 500/- రూపాయిలు అదనపుగా చెల్లిస్తున్నదన్నారు. సంగారెడ్డి జిల్లాలో ప్రస్తుత సీజన్లో



వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం 95,687 ఎకరాలలో రైతులు వరి ధాన్యం పంట పండించే అవకాశం ఉందని ,ఇందులో దొడ్డు రకం దాన్యం 28,013 ఎకరాలలో మరియు సన్న రకం ధాన్యం 7654 ఎకరాలలో పండించే అవకాశం ఉంటుందని సంగారెడ్డి జిల్లాలో వరి ధాన్యం దిగుబడి అంచనా 2.07. 456 మెట్రిక్ టన్నులు (దోడ్డు ధాన్యం:1,93,677 మెట్రిక్ టన్నులు, సన్న దాన్యం: 13,779 మెట్రిక్ టన్నులు)గా 1,52,000 ఎం టి ఎస్ దొడ్డు ధాన్యం, 2,000 ఎంటిఎస్ సన్న దాన్యం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల ద్వారా కొనుగోలు చేయవచ్చని అంచనా వేశారు. ప్రస్తుత సీజన్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రలు 218 ఉండగా అందులో ఇందిరా కాంతి పథకం 107.ప్రాథమిక సహకార సంఘాలు 88, జిల్లా సహకార సంఘాలు 21గా ఉన్నాయన్నారు. గత వానాకాలం (ఖరిప్) 2024-25 సీజన్ లో ధాన్యము పండిచే రైతుల కనీస మద్దత్తు దర చెల్లించుటకు గాను జిల్లాలో ఇందిరా కాంతి పథకం ద్వార (88) కేంద్రాలను, ప్రాదమిక సహకార సంఘాల ద్వార (126), రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వార మొత్తము (215) కేంద్రాలను ఏర్పాటు చేసి 15,94,910,80 క్వింటాల వరి ధాన్యము ప్రభుత్వ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లాలో 29,628 రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి దాదాపు రూ.307 కోట్ల 02 లక్షల రూపాయిలు నేరుగా రైతుల ఖాతాలలో జమచేయడం జరిగినదన్నారు. అదేవిదంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వానాకాలం 2024-25 సీజన్ నుండి రైతులు పండించిన సన్న ధాన్యం నకు క్వింటల కు 500 రూపాయిలు బోనస్ ఇవ్వడం జరిగినదనీ మన జిల్లాలో ఇప్పటివరకు 29,408 క్వింటల సన్న ధాన్యం సేకరించి 447 రైతుల ఖాతాలలో దాదాపు రూ.1 కోటి 47 లక్షల రూపాయిలు బోనస్ ధాన్యం డబ్బులు జమచేయడం జరిగినదనీ తెలిపారు. రబీ లో 2023-24 లో 104 39 వేల మెచ్నిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయబడిందనీ రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని రైతులకు అనేక మార్పులు జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమం అదనపు కలెక్టర్ మాధురి, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి ,సివిల్ సప్లై అధికారి శ్రీనివాస్ రెడ్డి,సివిల్ సప్లై మేనేజర్ అంబదాస్ రాజేశ్వర్, పి డి డిఆర్డిఎ జ్యోతి, జిల్లా సహకార శాఖ అధికారి కిరణ్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ఆర్డీవో పాండు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



**నంగునూరు, ఏప్రిల్ 10 (జనం సాక్షి) :** రైతులు తాము పండించిన ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందాలని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి ,జడ్పీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య, పిఏసిఎస్ చైర్మన్ ఎల్లంకి మైపాల్ రెడ్డి అన్నారు.మండల పరిధిలోని పాలమాకుల రాజగోపాల్ పేట్ ముండ్రాయి అంక్సాపూర్ ఖాతా గట్ల మల్యాల గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ లు మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని వడ్ల కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరను పొందాలన్నారు ఏ గ్రేడ్ ధాన్యానికి 2320 రూపాయలు 2300 మద్దతు ధరను ప్రభుత్వ అందిస్తుందన్నారు కావున రైతులందరూ కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు మైపాల్ రెడ్డి వేల్పుల ఐలయ్య వేణుచక్రవర్తి రవీందర్ రెడ్డి ఏటి పరమేశ్వర్ కుమార్ శ్రీనివాస్ రాములు అశోక్ ఏ పి ఎం మైపాల్ సిసి శ్రీనివాస్ రెడ్డి మహిళలు గ్రామ ఐక్య సంఘాలు లీడర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆటోపై కుప్పకూలిన కటౌట్

- ప్రయాణికులెవరూ లేకపోవడంతో తప్పిన ప్రాణ నష్టం



**హత్నూర, ఏప్రిల్ 10 (జనం సాక్షి) :** కొందరు రాజకీయ నాయకులు వారి ఉనికిని ప్రచారం చేసుకోవడం కోసం వారి పై స్థాయి నాయకుల పుట్టిన రోజు వేడుకల సందర్భంగా ఏర్పాటు చేస్తున్న కటౌట్లు ప్రమాదకరంగా మారుతున్నాయి.ప్రధాన రహదారులను ఆనుకుని కటౌట్లు ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.ఈదురు గాలులతో కూడిన వర్షానికి భారీ కటౌట్ ఓ ఆటో పై కుప్పకూలిన ఘటన మండలంలోని దౌల్తాబాద్ బస్టాండ్ సమీపంలో గురువారం చోటుచేస్నుంది.ప్రమాద సమయంలో ఆటోలో ప్రయాణికులెవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ నాయకులు వారి ఇష్టానుసారంగా భారీ కటౌట్లు ఏర్పాటు చేస్తున్నప్పటికీ అధికారులెవరూ పట్టించుకోవడం లేదని ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.భారీ కటౌట్లను రోడ్లపై ఏర్పాటు చేయకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## మంత్రి దామోదర్ ను సన్మానించిన యేసయ్య



**రాయికోడు, ఏప్రిల్ 10 (జనం సాక్షి) :** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర సింహ కు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎం యేసయ్య గురువారం శాలువాతో సన్మానించారు. జోగిపేట లో జరిగిన ఓ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య సమక్షంలో మంత్రి దామోదర్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాల లేమితో ప్రజల ఇక్కట్లు

- సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి ఉన్న బ్రాండ్ ఇమేజ్ ను కాపాడాలి
- తెలంగాణ రాష్ట్ర మాజీ నర్సింగ్ కౌన్సిల్ మెంబర్ పాల సాయిరాం

**సిద్దిపేట బ్యూరో, ఏప్రిల్ 10 (జనంసాక్షి) :** నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అనే నానుడి నుండి పోతే సర్కారు దవాఖానకే పోతా అనేలా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ దవాఖానాలను అభివృద్ధి చేస్తే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ నేను ఫోను బిడ్డో సర్కారు దావకానకు అనేలా ప్రభుత్వ ఆసుపత్రులను నిర్లక్ష్యం చేస్తుందని తెలంగాణ రాష్ట్ర మాజీ నర్సింగ్ కౌన్సిల్ మెంబర్ పాల సాయిరాం అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బి ఆర్ ఎస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యాధునిక సౌకర్యాలు కల్పించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు మాజీ మంత్రి హరీష్ రావు అన్ని రకాల ఏర్పాట్లు చేశారని.సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి అంటే ఒక బ్రాండ్ ఇమేజ్ ఉండేదని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పేద ప్రజలకు కనీస వైద్యం కూడా అందడం లేదని వాపోయారు. ప్రజలకు అన్నివేళలా అందుబాటు లో ఉండాల్సిన ఆంటీబయాటిక్స్ కూడా డిస్పెన్సరీలో లేకపోవడం బాధాకరమన్నారు. రోగుల అటెండర్లకు కనీస టాయిలెట్ సౌకర్యాలు కూడా లేవని వీటిని వెంటనే మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి పై నమ్మకంతో పక్క జిల్లాల నుండి కూడా డెలివరీ కోసం, మెరుగైన వైద్యం కోసం ఇక్కడికి వచ్చేవారని ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడానికి బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 500 కు పైగా జరిగే డెలివరీల సంఖ్య



300కు తగ్గిందని, ఆసుపత్రిలో సౌకర్యాలను దిక్కు దివానా లేకుండా గాలికి వదిలేసారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్య వైఖరిని విడనారాలని అన్నారు. గత ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలుపరిచిన కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్స్ వంటి పథకాలు అమలు పరచాలని, పేద ప్రజల ఆరోగ్యం కాపాడాలని కోరారు. సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి ఒక వ్యక్తి పాము కాటు వేసిందని చికిత్స కోసం వస్తే కనీసం మెడిసిన్ లేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అన్నారు. డ్యూటీ డాక్టర్ అందుబాటులో ఉండి చికిత్స కోసం మందులు రాస్తే బయట కొనుక్కోవాల్సిన పరిస్థితి ఉందని.కుట్లు వేయడానికి దారం, కాటన్ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సౌకర్యాలు మెరుగుపరిచి ఆసుపత్రికి ఉన్న బ్రాండ్ ఇమేజ్ ను కాపాడాలన్నారు. ఇప్పటికైనా రాజకీయ బేశజాలకు పోకుండా సిద్దిపేట ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని.లేనిపక్షంలో ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో కౌన్సిలర్లు సుందర్, మణిదీప్ రెడ్డి, నాయకులు మోహిజ్, నాగరాజు, సయ్యద్, కంఠం రాజు, అహ్మద్ పలువురు పాల్గొన్నారు.

## ఈదురు గాలులతో బీభత్సం..

- ఎగిరి పడిన ఇంటి పైకప్పులు

**న్యాల్కల్, ఏప్రిల్ 10 (జనం సాక్షి) :** ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు మండలంలో బీకర బీభత్సాన్ని సృష్టించాయి. గురువారం సాయంత్రం కురిసిన వర్షం ప్రజానీకానికి తీవ్ర భయాందోనలకు గురి చేశాయి. ఏక దాటిగా ఈదురు గాలులతో ఇంటి పైకప్పులు నేల వాలయి. మండల కేంద్రమైన న్యాల్ కల్ తో పాటు చాల్కి, రాఘవపూర్, మురుతుకపూర్, ముంగి, అథ్నూర్, డపూర్, హద్నూర్, గంగ్వార్, తదితర గ్రామాల్లో ఇంటి పైకప్పులు, వృక్షాలు నేల వారాయి. భారీ గాలులతో



మండలంలో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది.

## 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయండి

- భారాస నేతలు బాలనర్సయ్య, నాగేశ్వరరావు, శ్రీధర్ రెడ్డి



**చేర్యాల, ఏప్రిల్ 10 (జనంసాక్షి) :** ఈనెల 27న వరంగల్ లోని ఎల్కతుర్తిలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నేతలు ముస్త్యాల బాల నర్సయ్య, ముస్త్యాల నాగేశ్వరరావు, అంకుగారి శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం చేర్యాల పట్టణంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ.. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉండి చేసిన అభివృద్ధి పనులు తప్ప ఈ రాష్ట్రంలో ఏ ఒక్క అభివృద్ధి పని కాంగ్రెస్ పార్టీ చేయలేదన్నారు. ఎల్కతుర్తిలో జరిగే సభకు అధిక సంఖ్యలో తరలించి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిమ్మ రాజీవ్ రెడ్డి, మంగోల్ చంటి, బురగోని తిరుపతి గౌడ్, మేడిశెట్టి శ్రీధర్,పూర్మా వెంకటరెడ్డి, శివగారి అంజయ్య, తాడెం రంజిత కృష్ణమూర్తి, బిరెడ్డి ఇన్నారెడ్డి, ఎండి ఇక్బాల్, యాట యాదగిరి, పచ్చిమడ్ల సిద్ధిరాములు గౌడ్, పచ్చిమడ్ల మానస గౌడు, పాక పరశు రాములు, ఎర్రోళ్ల రామచంద్రం, కాశెట్టి బాగన్న, యాట బిక్షపతి, రాచకొండ శీను, ఒగ్గు శ్రీశైలం, భూమిగారి రాజేందర్, పచ్చిమట్ల బాచి, కందుకూరి సిద్ధి లింగం గుప్తా, ఉట్కూరి అమర్ గౌడ్, రాచకొండ వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

## టీసీసీ తోట కోల్డ్ సెల్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- గాయపడిన బాల కార్మికుడికి 20 లక్షల నష్టపరిహారం అందించాలి



**తూప్రాన్, ఏప్రిల్ 10 (జనం సాక్షి) :** మనోహరాబాద్ మండలంలోని ముప్పిరెడ్డి పల్లి పారిశ్రామిక ప్రాంతంలోని టిసిసి తోట కోల్డ్ సెల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో గాయపడిన జస్వంత్ కు కార్మికునికి 20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని సిఐటియు జిల్లా నాయకులు మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. కార్మికుడిని పరామర్శించిన తర్వాత ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 19వ తేదీన పరిశ్రమలో విధులు కొనసాగిస్తున్న కార్మికుడికి ప్రమాదం జరిగి చేతి వేళ్ళు కోల్పోవడం జరిగిందని ప్రమాదం జరిగిన వెంటనే యజమాన్యం హుటా హుటిన కార్మికుడిని హాస్పిటల్ కు తరలించి మెరిగైన వైద్యం అందించకుండా హాస్పిటల్ యాజమాన్యంతో కుమ్మక్కై నామమాత్రంగా వైద్యం చేయించి బలవంతంగా డిశ్చార్జ్ చేయించి ఇంటికి తరలించడం జరిగిందని అన్నారు. బాల కార్మికుడి అన్ని తెలిసి కూడా పరిశ్రమలు పనిచేయొచుకొన్న టి సీసీ తోట కోల్డ్ సెల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.. మైనర్‌తోని పనిచేస్తున్న అనుభవం లేకున్నా పరిశ్రమలో యంత్రం వద్ద పని చేయించి చేతి వేళ్ళు కోల్పోవడానికి కారణమైన యజమాన్యంపై జిల్లా లేబర్ అధికారులు చర్యలు తీసుకుని తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వెంటనే యాజమాన్యం కార్మికుడికి మెరుగైన వైద్యాన్ని అందించి, కార్మికుడికి నష్ట పరిహారం అందించే విధంగా లేబర్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కంపెనీలో జరిగిన ప్రమాదంపై డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సంగారెడ్డికి ఫిర్యాదు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. వెంటనే బాల కార్మికుల చేత పని చేయించిన టిసిసి తోట కోల్డ్ సేల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించి చైల్డ్ లేబర్ అధికారులు యజమాన్యం పై కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు . లేనిపక్షంలో కంపెనీ ముందు పెద్ద ఎత్తున కంపెనీ ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు తెలిపారు.

## ప్రభుత్వ బడులలోనే మెరుగైన విద్య

**చారకొండ, ఏప్రిల్ 10 (జనంసాక్షి) :** ప్రభుత్వ బడులలోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని చారకొండ జడ్పీహెచ్ఎస్ జిహెచ్ఎం భగవాన్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో జెడ్ పి హెచ్ ఎస్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలపై విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.



కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు యాదగిరి, కమలాకర్ రావు, రాజేందర్ రెడ్డి,బాలాజీ, రామ్ బిక్షం రామకృష్ణ, డాక్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు భూకంప హెచ్చరిక

- భయాందోళనలో ప్రజలు

**వెల్దండ, ఏప్రిల్ 10 (జనంసాక్షి) :** తెలంగాణకు భూకంప హెచ్చరిక భయాందోళనకు గురిచేస్తోంది. రామగుండంలో భూకంపం వచ్చే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భూకంప తీవ్రత గట్టిగా ఉంటుందని చెబుతున్నారు. ఆ భూకంప తీవ్రత హైదరాబాద్, అలాగే అమరావతి వరకు కూడా ఉంటుందని అంటున్నారు. తెలంగాణకు భూకంపం వచ్చే అవకాశం ఉందని ఎర్త్‌క్వేక్ రీసర్చ్ అండ్ అనాలసిస్ అనే సంస్థ స్పష్టం చేసింది. తమ పరిశోధనల ఆధారంగా తెలంగాణలో రామగుండం సమీపంలో భారీ భూకంపం సంభవించి అవకాశం ఉందని.. ఆ ప్రకంపనలు హైదరాబాద్, వరంగల్, అమరావతి వరకు చేరే అవకాశం ఉందని అందులో పేర్కొంది. అయితే ఎర్త్‌క్వేక్ రీసర్చ్ అండ్ అనాలసిస్ సంస్థ భూకంపం సూచనలను ఎవరూ కూడా ధృవీకరించని పరిస్థితి. ప్రభుత్వ వర్గాలు గానీ, శాస్త్రీయ సంస్థలు ఎవరూ ధృవీకరించడం లేదు. భూకంపాలను కచ్చితంగా ముందస్తుగా అంచనా వేయడం ప్రస్తుతం శాస్త్రీయంగా సాధ్యం కాదని, ఇలాంటి సూచనలు తరచుగా నిర్ధారణకు నోచుకోవని అధికారులు చెబుతున్న మాట. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పెసిఫిక్ జోన్ రెండు,




మూడులో ఉన్నాయి. ఇవి తక్కువ నుంచి మోస్తారు భూకంప ప్రమాదాన్ని మాత్రమే సూచిస్తాయి. గతంలో ఈ ప్రాంతంలో కొన్ని చిన్న చిన్న భూకంపాలు సంభవించాయి. అవి ఏమాత్రం నష్టం కలిగించలేదు. రామగుండం పరిసర ప్రాంతాల్లో భారీ భూకంపం సంభవించే అవకాశం ఉందని అధికారిక సమాచారం. అయితే భూకంపాల విషయంలో అప్రమత్తంగా ఉండటం మంచిదే. కానీ నిర్ధారణలేని సమాచారంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ఐఎండీకి సంబంధించిన అధికారులు చెబుతున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో గతంలో చిన్న నుంచి మోస్తారు తీవ్రత గల భూకంపాలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఎర్త్‌క్వేక్ వెబ్ సైట్ మాత్రం రామగుండం సమీపంలో భూకంప ప్రమాదం వచ్చే అవకాశం ఉన్నట్లు చెబుతోంది. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల్లో భూకంపాల రికార్డు కూడా పెద్దగా లేదు. కొద్ది సందర్భాల్లో స్వల్ప భూకంపాలు ప్రజలను భయాందోళనకు గురిచేశాయి. 1969 ప్రకాశం జిల్లా ఒంగోలు ప్రాంతంలో 5.1 తీవ్రత గల భూకంపం వచ్చింది. అది అప్పట్లో రాష్ట్రాన్ని బాగా ఊపేసిందని చెప్పొచ్చు. ఆ తరువాత 1998లో తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లా 4.5 తీవ్రతతో ప్రకంపనలు నమోదు అయ్యాయి. అలాగే హైదరాబాద్‌లో 1984, 1999, 2013లో చిన్న భూకంపాలు మాత్రమే సంభవించగా... ప్రజలు ఒక్కసారిగా భయపడిపోయారు. కానీ ఎలాంటి ఆస్తి నష్టం కూడా సంభవించలేదు. అలాగే శ్రీశైలం డ్యాం పరిసరాల్లో కొన్ని సందర్భాల్లో భూమి కంపించినట్లు రికార్డు అయ్యాయి. అయితే భూకంపాల రాకను కచ్చితంగా అంచనాలు వేయడం ఇప్పటికీ శాస్త్రీయంగా సాధ్యం కాదు కాబట్టి భద్రతా చర్యలు తీసుకోవడం మంచిది. తెలుగు రాష్ట్రాల్లో భారీ భూకంపాలు సంభవించనప్పటికీ ప్రకృతి ఎప్పుడు ఎలా ఉంటుందో చెప్పడం కష్టం కాబట్టి అప్రమత్తంగా ఉండటం మంచిదన్నది అధికారుల మాట.

# పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

మంథని, (జనంసాక్షి)

: పోలీసుల సంక్షేమానికి తమ కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. గురువారం సీఎం రేవంత్ రెడ్డి తో కలిసి యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశంలో ఎక్కడా లేని విధంగా పోలీసుల పిల్లలకు ప్రత్యేకంగా స్కూల్ ను ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణకే దక్కుతుంది. ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుంది. పోలీసుల విధి నిర్వహణ కత్తిమీద సాములాంటిది. వారి త్యాగాలకు మనం వెల కట్టలేం. మనం ప్రశాంతంగా ఉంటున్నామంటే దానికి కారణం పోలీసులే. వారి కోసం మనమేం చేసిన తక్కువే. రాబోయే పదేళ్లలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ దేశంలోనే అత్యుత్తమ స్కూల్స్ లో ఒకటిగా నిలిపేందుకు కృషి చేస్తాం. అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రైవేట్ ఇంటర్నేషనల్ స్కూల్స్ కు ధీటుగా ఈ పాఠశాలను తీర్చి దిద్దుతాం. ఇక్కడ చదువుకునే విద్యార్థులను అకడమిక్స్ తో పాటు అన్ని రంగాల్లోనూ మెరుగ్గా రాణించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తాం. హెూంగార్డు నుంచి డీజీపీ పిల్లల వరకు అందరికీ ఇక్కడ



చదువుకునే అవకాశం కల్పించాం. విద్య, వైద్యంపై మా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతాం. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ లో చదివే విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చి దిద్దుతాం.

ఈ స్కూల్ నిర్మాణానికి ఎంతో మంది దాతలు ముందుకొస్తున్నారు. వారికి ప్రభుత్వం తరపున ప్రత్యేక ధన్యవాదాలు. ఈ స్కూల్ నిర్వహణలో అందర్నీ భాగస్వామ్యం చేసి.. గొప్ప స్కూల్ గా తీర్చి దిద్దుతాం అని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

# ఉపాధి హామీ పనులకు పూర్తి వివరాలు అందుబాటులో ఉంచాలి



గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 10 (జనం సాక్షి)

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులకు సంబంధించిన పూర్తి వివరాలు,రిజిస్టర్లు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు .గురువారం ఐడీఓసీ సమావేశ హాల్ నందు ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టే పనులపై గద్వాల్ నియోజకవర్గ అధికారుల కోసం నిర్వహించిన జిల్లా స్థాయి ఒకరోజు అవగాహన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పనులను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో ఉన్నామని ఉపాధి హామీ పథకం పనులు పెద్దఎత్తున చేపట్టేందుకు కూలీలను మొబలైజ్ చేయాలని, వందరోజుల పని దినాలు కల్పించాలని సూచించారు. ప్రతి పనికి సంబంధించిన అన్ని రిజిస్ట్రర్లు,ప్రాథమిక రికార్డులు పూర్తిగా ఖచ్చితంగా ఉండాలన్నారు.గత మూడు సంవత్సరాల పనుల వివరాలు సంవత్సరాల వారీగా, ప్రతి పని పూర్తయిందా లేదా పెండింగ్‌లో ఉందా అనే వివరాలు పంచాయతీ కార్యదర్శి దగ్గర ఉండాలన్నారు.

ఈ పథకం కింద ఏప్రిల్ 14 వరకు దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. జిల్లాలోని గట్టు, కేటుదొడ్డి, మల్దకల్ మండలాల్లో బాల్య వివాహాల సమస్యలు ఎక్కువగా వస్తున్నందున, ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు

గ్రామ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించి నిర్మూలన చర్యలు చేపట్టాలన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఇంచార్జ్ డీపీఓ నాగేంద్రం, ఎంపీడీఓలు,ఎంపిఓలు, ఏపీఒలు ,పంచాయితీ సెక్రటరీలు,ఫీల్డ్ అసిస్టెంట్లు,తదితర అధికారులు పాల్గొన్నారు.

# సహకార సంఘాల ఏర్పాటుకు కృషి చేయాలి

## జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):



సహకార సంఘ మార్గదర్శకాలు ప్రామాణికంగా సహకార సంఘాల పునర్విభజన చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో సహకార సంఘాల పునర్విభజనపై రెవెన్యూ, సహకార, వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, పశు సంవర్ధక, వరంగల్, కరీంనగర్ డిసిసిబి డిజిఎం, ఎజిఎంలతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సహకార సంఘం మార్గదర్శకాల మేరకు 10 అంశాలను పరిగణనలోకి తీసుకుని10 నూతన సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. సహకార సంఘాల ఏర్పాటు ద్వారా అన్ని గ్రామాల రైతులకు ప్రయోజనం కలగాలని తెలిపారు. ప్రస్తుతం ఉన్న సహకార సంఘాలు సుదూరం ఉన్నందున ప్రజలకు సేవలు అందించడానికి ఇబ్బందులు వస్తున్నాయని, అట్టి ఇబ్బందులు పరిగణలోకి తీసుకుని నూతన సహకార సంఘాలు ఏర్పాటు చేయుటకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. నూతన సంఘాల ఏర్పాటులో మూడు సంవత్సరాల పాటు జరిగిన వ్యాపార లావాదేవీలు, ఆడిట్ నివేదికతో పాటు 9 అంశాలను తు.చ. తప్పక పరిగణలోకి తీసుకోవాలని

సూచించారు. సహకార సంఘాల ఏర్పాటు ద్వారా రైతులకు ఇన్ పుట్ సబ్సిడీలు అందించి రైతుల ఆర్థికాభివృద్ధికి సహకారాన్ని అందించేందుకు బహుళ ప్రయోజన సహకార సంఘాలు ఏర్పాటు అవశ్యకత అవసరమని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సహకార శాఖ అధికారి వాల్యానాయక్, పశుసంవర్ధక శాఖ అధికారి డా కుమారస్వామి, వ్యవసాయ శాఖ ఎడిఏ బాపు, ఉద్యాన అధికారి సునీల్, మత్స్యశాఖ అధికారి విజయ్ కుమార్, నాబార్డు డిడిఎం చైతన్యరవి, కరీంనగర్, వరంగల్ డిసిసిబి సీఈఓలు సత్యప్రసాద్, వజీర్ సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసిలో ఎమర్జెన్సీ టీంల ఏర్పాటు

హైదరాబాద్ (జనంసాక్షి)

హైదరాబాద్ వాతావరణంలో అకస్మాత్తుగా మార్పులు చోటుచేసుకుని, భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున నగర ప్రజలందరూ సురక్షిత ప్రదేశాల్లో ఉండాలని కోరుతూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి నివేదిక విడుదల చేశారు. జిహెచ్ఎంసి అధికారులు తక్షణమే ఎమర్జెన్సీ టీంలను ఏర్పాటు చేసి, నీరు నిలిచిన ప్రాంతాలను వెంటనే తొలగించడమే కాకుండా, ఫాగింగ్ మరియు శుభ్రపరిచే పనులను ఎప్పటికప్పుడు నిర్వహించాలని సూచించారు.

## ప్రజా సంక్షేమ పథకాల పరిష్కారనికి

# కంట్రోల్ రూమ్



సంగారెడ్డి ప్రతినిధి,ఏప్రిల్ 10( జనం సాక్షి)

కలెక్టర్ కార్యాలయంలో, ఇందిరమ్మ ఇల్లు, ఎల్ఆర్ఎస్, రాజీవ్ యువ వికాసం పథకం, తాగునీటి ఎద్దడి నివారణ కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు గురువారం ఒక ప్రకటన తెలిపారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలైన రాజీవ్ యువ వికాసం అప్లికేషన్ లో ఇబ్బందులు తలెత్తితే, ఇందిరమ్మ ఇళ్లపై ఏదైనా సమస్యలు ఉంటే, ఎల్ఆర్ఎస్, త్రాగునీటి సమస్యలు తలెత్తితే గ్రీవెన్స్ సెల్ నంబర్ 08455 276155 నెంబర్ కు డయల్ చేసి సమస్యల పరిష్కరించుకోవాలని జిల్లా ప్రజలను కోరారు. కార్యాలయ పని వేళల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

# కరీంనగర్‌లో 12న పటిష్ట బందోబస్తు

## కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్

కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 10 (జనంసాక్షి)

చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 12వ తేదీ శనివారం కరీంనగర్ లో నిర్వహించనున్న శ్రీ వీరహనుమాన్ విజయ యాత్రకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నట్లు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్, టౌన్ ఏసీపీ కార్యాలయంలో గురువారం డివిజన్ లోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. శోభాయాత్ర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై ఆయన సమీక్షించారు. ఈ యాత్ర కరీంనగర్లోని వైశ్య భవన్ ప్రక్కన గల రామాలయం నుండి ప్రారంభమై రాజీవ్ చౌక్ , టవర్ సర్కిల్ , గంజ్ రోడ్ , రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా , కమాన్ రోడ్ మీదుగా , బస్టాండ్ , తెలంగాణ చౌక్ , ఐబీ చౌరస్తా , కోర్ట్ చౌరస్తా , మంచిర్యాల చౌరస్తా , గాంధీ



స్టాట్యూ తిరిగి రామాలయం వద్ద ముగుస్తుందని తెలిపారు. దాదాపు ఆరు కిలోమీటర్ల మేర నిర్వహించు ఈ యాత్రకు 500 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని పోలీసు కమీషనర్ తెలిపారు. బందోబస్తులో భాగంగా స్టాటిక్ ఫోర్స్ , స్ట్రైకింగ్ ఫోర్స్ , మొబైల్ పెట్రోలింగ్ , అవసరమైన చోట రూఫ్ టాప్ లతో పాటు సున్నితమైన ప్రాంతాల్లో పికెట్ లు ఏర్పాటు చేస్తున్నామని కమీషనర్ తెలిపారు. ఈ యాత్రలో

సీసీ కెమెరా ల పర్యవేక్షణతో పాటు పోలీసు డ్రోన్ లను వాడనున్నామని ఆయన తెలిపారు. ట్రాఫిక్ రద్దీ వుండే ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు దారి మల్లింపు చర్యలు చేపడుతున్నారని ఆయన తెలిపారు.

యాత్ర నిర్వహించు మార్గం అంతా పోలీసు కమీషనర్ గురువారం ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీసు కమీషనర్ తో పాటు అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ, ఏసీపీ లు వెంకటస్వామి టౌన్ , యాదగిరిస్వామి ట్రాఫిక్ , టౌన్ ఇన్స్పెక్టర్లు బిల్లా కోటేశ్వర్ , సృజన్ రెడ్డి , జాన్ రెడ్డి , ఖరీముల్లాఖాన్ లతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 2 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

మక్కల్, ఏప్రిల్ 10 (జనంసాక్షి)

జిల్లాలో ఎవరైనా సరే నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ హెచ్చరించారు. గురువారం నర్వ మండలంలోని లంకాల గ్రామ శివారులో నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, నర్వ పోలీసులు, అగ్రికల్చర్ ఆఫీసర్స్ కలసి సంయుక్తంగా దాడులు నిర్వహించి కుర్వ బస్వరాజు పొలంలో గల షెడ్ లో 5 సంచులు (2 క్వింటాళ్ల లూస్ పత్తి విత్తనాలు పట్టుపడినవి వీటిని నర్వ మండల అగ్రికల్చర్ ఆఫీసర్ అకిలరెడ్డి పంచనామా చేసి పిర్యాది ఇవ్వగా ఎస్ఐ కుర్మయ్య కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.





నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ

ఆరుగాలం కష్టపడి వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తూ ఉండే రైతులకు నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులను అమ్ముతు రైతులను మోసం చేస్తే అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కట్టిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ హెచ్చరించారు. రైతులు గుర్తింపు లేని పార్టీలైజర్ షాపుల నుండి దళారులతో, నకిలీ విత్తనాలను, నాసిరకం ఎరువుల మందులను కొనరాదని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# నెల రోజులపాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్

## సంగారెడ్డి జిల్లాలో అమలు

సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 10( జనం సాక్షి )



జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు (ఏప్రిల్ 1వ తేది నుండి 30 వరకు) జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా యస్పి పరితోష్ పంకజ్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల ముందస్తు అనుమతి లేనిది సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా, ప్రజాధనానికి నష్టం కల్గించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా సూచించారు.అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# హజ్ శిక్షణా కార్యక్రమానికి విశేష స్పందన

**కరీంనగర్ (జనంసాక్షి) :** జిల్లా హజ్ సొసైటీ కరీంనగర్ నిర్వహించిన రెండవ హజ్ శిక్షణా కార్యక్రమానికి విశేషా స్పందన లభించింది.ఈ రోజు ఉదయం షాలిమార్ ఫంక్షనల్ ఫంక్షనల్ జిల్లా హజ్ సొసైటీ కరింనగర ఆద్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రియాజ్ అలీ రజీవి అధ్యక్షత వహించారు. ఇ సమావేశంలో ముఖ్య అతిథిగా సయ్యద్ గులాం అఫ్జల్ బీయాబానీ ఖుస్రో పాషా సాహిబ్ రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ తెలంగాణ పాల్గొన్నారు. రాష్ట్ర చైర్మన్ సయద్ గులాం అఫజలు బియాబానీ మాట్లాడుతూ హజ్ ధనంతొ సంబంధించిన అంశంతో పాటు శారీరక ఆరాధన కాబట్టి హజ్ సమయంలో మేము కోనీ ఇబ్బందులను ఎదుర్కొవాల్సి ఉంటుంది, అందుకే హజ్ యాత్రికులు అన్నిటికీ సిద్ధంగా ఉండాలని సూచించారు.ఈ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం హజ్ యాత్రికులకు మెరుగైన ఏర్పాట్లు చేయడానికి ప్రయత్నిస్తోందని మౌలానా తెలిపారు. సయ్యద్ అఫ్జల్ బీయాబానీ ఖుస్రో పషా చైర్మన్ రాష్ట్ర హజ్ కమిటీ తెలిపింది. సయ్యద్ గులాం అఫ్జల్ బీయాబానీ ఖుస్రో పాషా కరింనగర



హజ్ సొసైటీ పనితీరును ప్రశంసించారు మరియు కరీంనగర్ యొక్క యాత్రికులందరినీ ఈసారి ఒకే విమానంలో పంపించడానికి చర్యలుతొ పాటు కరింనగరకు చెందిన హజ్ ఇన్స్పెక్టర్కు పంపుతానని చెప్పారు. తద్వారా జిల్లా యాత్రికులు తమ సేవలను పొందవచ్చు. జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షుడు మొహమ్మద్ రియాజ్ అలీ రిజ్వి మాట్లాడుతూ యాత్రికులు హజ్ శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం

చెసుకొవాలని కొరారు. అయినా మాట్లాడుతూ యాత్రికులు "హజ్ స్వధా అప్" ని వాడాలి దానివలన యాత్రికులు అదృశ్యంపై , మరియు ఏదైనా అవాంఛనీయ సంఘటనలపై మన భారతీయ హజ్ మిషన్ సకాలంలో కనుగొనటానికి బాగా ఉపయోగపడుతుంది అన్నారు. మౌలానా మజార్ ఖాసిమి మాస్టర్ ట్రైనర్, హజ్ యాత్ర నియామకాలు నిబంధనలు వివరణాత్మక తెలిపారు. యాత్ర సమయం లో,ఉమ్రా, హజ్, తవాఫ్, సయి, మిణి, అరాఫత్, ముజదలఫ ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించారు మరియు వారి ఆరోగ్య నిలుపుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని యాత్రికులను కోరారు. మౌలానా ఖ్వాజా కలీముద్దీన్ అసది, మదీనా యొక్క ప్రాముఖ్యతపై యాత్రికులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.మొలాన అలీం ఉద్దీన్, మరియు తదితరులు పాల్గొన్నారు. 200 వందల మంది హజ్ యాత్రికులు ఈ శిక్షన కార్య క్రమంలో పాల్గొన్నారు.



# తాసిల్దార్ కార్యాలయం ఎదుట రైతు అర్ధనగ్న ప్రదర్శన

నాగిరెడ్డిపేట,ఏప్రిల్ 10 జనం సాక్షి...



మండలంలోని పోచారం గ్రామానికి చెందిన చౌదరి శ్రీనివాసరావు అనే వ్యక్తి గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అర్ధనగ్న ప్రదర్శన చేపట్టాడు. శ్రీనివాసరావు మాట్లాడుతూ తన తండ్రి నర్సింగ్ రావు పేరు పై పోచారం గ్రామ శివారులో ఉన్న సర్వే నెంబర్ 287లో 1 ఎకరం 30 గుంటల భూమి ఉండగా తన అన్న చౌదరి బాపురావు తనకు తెలియకుండా అక్రమంగా పట్టా చేయించుకున్నాడని,తాను బ్రతుకుతెరువు నిమిత్తం కోసం హైదరాబాద్ వెళ్లి జీవిస్తున్నానని, కాగా మాఅన్న తనకు తెలియకుండా అక్రమంగా పట్టా చేసుకున్న భూమి గురించి తాసిల్దార్ కార్యాలయ అధికారులు విచారణ జరిపించి తనకు రావలసిన భూమిని ఇప్పించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో జనవరి 6వ తేదీన వినతి పత్రం సమర్పించానని తెలిపారు.తాసిల్దార్ కార్యాలయం అధికారులకు వినతి పత్రం అందజేసి 3 నెలలు గడుస్తున్న తనకు రావలసిన భూమి పై ఇప్పటివరకు ఎలాంటి విచారణ చేపట్టకుండా, తాసిల్దార్ కార్యాలయం అధికారులు నిర్లక్ష్యం చేస్తూ,నిర్లక్ష్య సమాధానాలు ఇస్తున్నారని,ఈ విషయమై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కూడా వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు.తన అన్న అక్రమంగా పట్టా చేసుకున్న భూమిని విచారణ చేపట్టి సమస్యను పరిష్కరించడంలో తాసిల్దార్ కార్యాలయం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తన సమస్యను పరిష్కరించాలని రైతు చౌదరి శ్రీనివాసరావు కోరారు.

# రైతులకు మద్దతు ధర ఇప్పించడంలో ప్రభుత్వాలు విఫలం

- మిల్లులో అమ్ముకున్న ధాన్యానికి బోనస్ ఇవ్వాలి
- గ్యాస్ ధర పెంపుతో సామాన్యులపై పెనుభారం
- ట్రంపు సుంకలతో ప్రజలకు మరింత కష్టాలు
- హామీలు గ్యారెంటీగా అమలు చేయాలి
- విలేకరుల సమావేశంలో జూలకంటి



**మిర్యాలగూడ, ఏప్రిల్ 10 (జనం సాక్షి) :** రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ఇప్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంతో కష్టపడి పండించిన పంటలకు కనీసం మద్దతు ధర కూడా ఇప్పించలేకపోతున్నారని దీనివల్ల రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మిల్లుల వద్ద ధాన్యాన్ని అమ్ముకునేందుకు వెళ్లిన రైతులకు అనేక రకాలుగా మోసం చేస్తున్నారని వాటిని అరికట్టాల్సిన అధికారులు పర్యవేక్షించుకోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారని చెప్పారు. ప్రభుత్వం ఐకెపి పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ రైతులు అక్కడ ధాన్యాన్ని అమ్ముకోవడం లేదని మిల్లులకే ఎక్కువగా ధాన్యం అమ్ముకుంటున్నారని మిల్లుల్లో అమ్ముకున్న ధాన్యానికి ప్రభుత్వం 500 రూపాయల బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అప్పుడే రైతులకు కనీసం మద్దతు ధర అందుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరన్నర కావొస్తుందని రెండు సీజన్లు దాటిపోయాయని కనీసం రైతు భరోసా ఇవ్వలేదని ఆరోపించారు. వచ్చే సీజన్ నాటికైనా పాతవి కలిపి రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ ఇంకా పదివేల కోట్ల పెండింగ్ ఉందని వెంటనే విడుదల చేసి అందరికి అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్యాస్ ధరల పెంపుతో సామాన్య ప్రజలపై భారం పడిందని ఆరోపించారు. చమురు ధరలు తగ్గిన గ్యాస్ ధరలు పెంచడం సరైనది కాదన్నారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలు గ్యారెంటీగా అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్ల విషయం గ్రామాలను మోడల్ గా ప్రకటించిన ఆ ఇండ్లు పురోగతి లేదన్నారు. ట్రంపు సుంకాలు, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతో ప్రజల జీవన కష్టాలు మరింతగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలను అరికట్టి సామాన్యులకు అందుబాటులో నిత్యవసర వస్తువులు ఉండే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు జగదీష్ చంద్ర, జిల్లా నాయకులు రవి నాయక్, భవాండ్ల పాండు, తిరుపతి రామ్మూర్తి, ఎండి అంజాద్, నాయకులు పాదూరీ గోవర్ధనా, ఉన్న వెంకటేశ్వర్లు, లక్ష్మీ నారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# యువతకు రాజీవ్ యువ వికాసం ద్వారా స్వయం ఉపాధి

- ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులను ఎంపిడిఓ కార్యాలయంలో అందజేయాలి
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 10 (జనంసాక్షి) :** నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకం ద్వారా ఆర్థిక సహాయం చేస్తుందని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం సూర్యాపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు మంజూరు చేసేందుకు ఏప్రిల్ 14 వరకు ఆన్ లైన్ ద్వారా ధరఖాస్తులను స్వీకరించటం జరుగుతుందని తెలిపారు. లబ్ధిదారులు ఆన్ లైన్ లో చేసిన దరఖాస్తుకి ఆధార్, బ్యాంకు అకౌంట్, క్యాస్ట్ సర్టిఫికెట్, రవాణా రంగంలో దరఖాస్తు చేసుకున్న వారు లైసెన్స్ లను జత చేసి రూరల్ ప్రాంతానికో చెందిన వారు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో, అర్బన్ ప్రాంతానికో చెందిన వారు మున్సిపాలిటీ కార్యాలయంలో తప్పనిసరిగా సమర్పించాలని అన్నారు. దరఖాస్తులను అధికారులు పరిశీలించిన తదుపరి జూన్ 2న లబ్ధిదారుల జాబితా ప్రకటించటం జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు ఎన్ని ధరఖాస్తులు ఏ యూనిట్లకి వచ్చాయని అడగగా సూర్యాపేట రూరల్ మండలంలో డైరీ, రవాణా రంగం, కిరాణం షాప్ లకి ఎక్కువగా వస్తున్నాయని, ఇప్పటి వరకు 1600 మంది ఆన్ లైన్ లో ధరఖాస్తు చేసుకోగా 450 లబ్ధిదారులు మాత్రమే ధరఖాస్తులు ఎంపిడిఓ కార్యాలయంలో సమర్పించారని వివరించారు.

### నమూనా ఇంటిని పరిశీలన..

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ పథకం కింద నిర్మించే నమూనా ఇంటిని సూర్యాపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణం త్వరగా పూర్తి చేసి 5 లక్షల వ్యయంతో ఇందిరమ్మ ఇండ్లను ఎలా నిర్మించాలో, ఇంటికి ఉపయోగించిన సామాగ్రి, చేసిన ఖర్చుల వివరాలతో కూడిన పట్టికను ఇంటి ముందు ప్రదర్శించి లబ్ధిదారులకి అవగాహన కల్పించటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బాలకృష్ణ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పేదవారికి సన్న బియ్యం



**తూప్రాన్, ఏప్రిల్ 10 (జనం సాక్షి) :** ప్రతి పేదవారికి సన్న బియ్యం ఇవ్వాలనే సంకల్పంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సమ్మె బియ్యం పంపిణీ చేస్తుందని రాష్ట్ర సర్పతుల ఫోరం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రతి పేదవానికి ప్రతి పూరి గుడిసేవారికి సన్నబియ్యం తినాలని రేవంత్ రెడ్డి ఆశయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లారెడ్డి ,తూప్రాన్ యూత్ అధ్యక్షులు శశిభూషణ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, కావేరి వెంకటరెడ్డి, రఘుపతి, నవీన్ మండల మైనార్టీ అధ్యక్షులు జావిద్ పాషా, సంతోష్, పంతులు నరసింహ చారి, నాగరాజ్ గౌడ్ ,అనిల్ రెడ్డి, ఉప సర్పంచ్ల ఫోరం మాజీ మండల అధ్యక్షులు ధర్మేందర్ ,సత్యనారాయణ, ఇర్ఫాన్ , నాగరాజ్ యాదవ్ రమేష్ ,బలరాం, నరసింహులు, బిట్టు, అప్సర్ ,నర్సింగ్ రావు, శ్రీనివాసరెడ్డి, సురేశ్రామస్వామి గణేష్ గౌడ్ ,రఘు, బుజ్జి, కార్తీక్, సమీర్, అజార్, వెంకటేష్, షారుక్, ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఒకేచోట రెండు ప్రాణాలు మృత్యు ఒడిలోకి..



**కనగల్లు, ఏప్రిల్ 10 (జనం సాక్షి) :** మండలంలోని బాబా సాహెబ్ గూడెం స్టేజి సమీపంలో ఒక వ్యక్తి నిర్లక్ష్యం కారణంగా రెండు ప్రాణాలు మృతి ఒడిలోకి జారుకున్నాయి. కనగల్ ఎస్సై విష్ణు తెలియజేసిన వివరాల ప్రకారం హాలియా నుంచి ద్విచక్ర వాహనంపై నల్లగొండకు వెళుతున్న చింతకాయల కిరణ్ స్టేజ్ వద్ద ఆపిన డాక్టర్ ట్రాలీ గమనించకుండా మసిక వెల్తురు సమయములో ప్రమాదవశాత్తు ట్రాలికి ఢీకొని తలకు బలమైన గాయాలు తగలగా చికిత్స నిమిత్తం ప్రాణాలు కోల్పోయాడు. మరికొద్ది సమయంలోనే కొప్పోలుగ్రామానికి చెందిన బల్గూరి శేఖర్ హాలియా పరిసర ప్రాంతాలలో పనులను ముగించుకొని తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి చేరుకోవడానికి తన ద్విచక్ర వాహనంపై వెళుతుండగా బాబాసాహెబ్ గూడెం స్టేజి సమీపంలో టా క్టర్ ర్యాలీకి ఢీకొని బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సంఘటన స్థలలో ప్రాథమిక విచారణలో తేలినందున బల్గూరి శేఖర్ భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి విష్ణుమూర్తి తెలియజేశారు.

## పేదల ఆరోగ్యానికి ఆసరా సీఎం రిలీఫ్ ఫండ్

- ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య
- టేకులపల్లిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



**టేకులపల్లి, ఏప్రిల్ 10 (జనం సాక్షి) :** పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఎంతగానో ఆసరా అవుతుందని, అనారోగ్యంతో కార్పొరేట్ వైద్యం పొందిన వారికి వైద్యం ఖర్చు కొంత ప్రభుత్వం భరిస్తుందని, పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఇల్లందు నియోజకవర్గం లో పలు మండలాలకు చెందిన 518 మంది లబ్ధిదారులకు గాను రు. 1 కోటి 69 లక్షల 97 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు కాగా, టేకులపల్లి మండలంలోని 74 మంది లబ్ధిదారులకు రు. 22 లక్షల 32 వేలు మంజూరు కాగా గురువారం టేకులపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భూక్య దేవా నాయక్, కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, ఈది గణేష్, మోకాళ్ళ పోశాలు, ఇస్లావత్ రెడ్యా నాయక్ బానోతు శంకర్, బానోత్ రవి, గడ్డం మధురెడ్డి, శంకర్,భద్రు,బుర్ర ధర్మయ్య గౌడ్, బోడ మంగీలాల్, చందర్ సింగ్,సంజయ్,బోడ సరిత,కాలే ప్రసాద్, నర్సింగ్ లక్ష్మయ్య, బల్లెం చెన్నయ్య, నగేష్, ఈశ్వర్, చంటి, నవీన్, సురేందర్,వెంకట్, సుధీప్ తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

- పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు వేళాయె
- ఉజ్వల భవితకు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఐలయ్య
- ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు చివరి తేది ఏప్రిల్ 19



**నాగార్జునసాగర్, ఏప్రిల్ 10 (జనంసాక్షి) :** 2025 విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నాగార్జున సాగర్ పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఐలయ్య ఓ ప్రకటనలో తెలిపారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2025- 26విద్యా సంవత్సరానికి గాను సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఐలయ్య తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఏప్రిల్ 19 వరకు దరఖాస్తులు చేసుకోవాలని పాలిటెక్నిక్ పరీక్ష తేది మే 13వ తేదీన మంగళవారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఒకటిగా పేరుగాంచిన నాగార్జునసాగర్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రతి సంవత్సరం వివిధ కోర్సుల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున చేరుతున్నారని ఆయన తెలిపారు. సాంకేతిక విద్య కున్న ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని రాబోయే రోజుల్లో ఉద్యోగ పరంగా ఎంతో ప్రాముఖ్యత గాంచిన పాలిటెక్నిక్ సాంకేతిక విద్య నిరుద్యోగ యువతీ,యువకుల భవిష్యత్తుకు మార్గదర్శనం చూపిస్తుందని,పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు చివరి తేది ఏప్రిల్ 19 అని అన్నారు. కోర్సులు: పాలిటెక్నిక్ డిప్లొమాలో సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ శాఖలలో ప్రవేశము వివరములకు నాగార్జున సాగర్, పైలాన్ కాలనీలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ 7095678629 సంప్రదించవలసిన సమయం ఉ? 10 గం.ల నుండి సా. 4 గం.ల వరకు సివిల్ ఇంజనీరింగ్ .నాగార్జునసాగర్ పైలాన్ కాలనీ లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గల మొత్తం ఒక్కొక్క కోర్సులో 60 సీట్లు చొప్పున ఖాళీలు ఉన్నాయని వీటి కోసం ప్రభుత్వం సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 19 వరకు దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పించిందని ప్రిన్సిపాల్ ఐలయ్య తెలిపారు.

## వెనుకబడిన గిరిజన తండా, గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నాగార్జునసాగర్, ఏప్రిల్ 10 (జనంసాక్షి) :** నాగార్జునసాగర్ మున్సిపల్ కార్యాలయంలో దర్తి ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకం జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలో నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ పాల్గొని మాట్లాడుతూ నాగార్జునసాగర్ నియోజకవర్గంలో దర్తి ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకం కింద గిరిజన తండాలు, వెనుకబడిన గిరిజన గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు గాను కార్యాచరణ ప్రణాళికతో పాటు, అంచనాలు రూపొందించాలని సమీక్ష సమావేశంలో సూచించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో పెద్దవూర, త్రిపురారం, తిరుమలగిరి సాగర్ మండలాలలో 18 తండాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ గ్రామాలలో వన్ ధన్ విక్రయ కేంద్రాలను (విడివికె) ఏర్పాటు చేయడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గుర్తించిన తండాలలో రహదారులు, విద్యుత్, తాగునీరు ,విద్య, వైద్య సదుపాయాలు, స్వయం ఉపాధి, వ్యవసాయ అనుబంధ రంగాలు, ఇతర రంగాల ద్వారా జీవనోపాధి అవకాశాలను కల్పించడం జరుగుతుందని వెల్లడించారు. సుమారు 95 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. అంగన్వాడి కేంద్రాలకు సొంత బిల్డింగులు కట్టే ప్రయత్నంలో ఉన్నామని, ఈ సంవత్సరం తాగునీటికి సమస్యలు రాకుండా ముందు జాగ్రత్తగా జిల్లాలోని అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇంచార్జ్ అధికారి రాజ్ కుమార్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, డిపిఓ వెంకయ్య, మత్స్యశాఖ ఏడి చరిత, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, పెద్దఊర తహసిల్దార్ శ్రీనివాస్ , ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, ఈ సమావేశానికి హాజరయ్యారు.

## బస్తీ దవఖానను ప్రారంభించిన ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి



**నాగార్జునసాగర్, ఏప్రిల్ 10 (జనంసాక్షి) :** నాగార్జునసాగర్ నందికొండ మున్సిపాలిటీలో గురువారం నాడు బస్తి దవఖానను ప్రారంభించిన నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి ,సబ్ కలెక్టర్ నారాయణ అమిత్. ముందుగా జిల్లా కలెక్టర్ త్రిపాటి మాట్లాడుతూ బస్తీ దవఖానలో ప్రజలు టెస్టులు చేయించుకోవచ్చుని ఉదయం 9 గంటల నుండి సాయంకాలం 4:00 వరకు బస్తి దవఖానలో ఒక ఎంబిబిఎస్ డాక్టర్ నర్సులు అందుబాటులో ఉంటారని , ఒక టెస్టింగ్ ల్యాబ్ ఉందని అందులో ప్లేట్లెట్స్ కౌంట్ , బయో కెమికల్ టెస్ట్ అందుబాటులో ఉంటాయనితెలిపారు .అనంతరం ఎమ్మెల్యే కుందూరు జేవిరెడ్డి మాట్లాడుతూ నాగార్జున సాగర్ కమల నెహ్రూ ఆసుపత్రికి అనుబంధంగా పైలాన్ కాలనీలో బస్తి దవఖానను ప్రారంభించడం జరిగిందని, హాలియా మున్సిపాలిటీ లో బస్తి దవఖాన ప్రారంభించేందుకు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహను అడగడం జరిగిందని , నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రజలకు కావలసిన అన్ని సదుపాయాలు ఎల్లప్పుడు సమకూరుస్తానని తెలిపారు. ఆసుపత్రి మూతపడడంతో ఆసుపత్రి ఆవరణలో మందుబాబులకు అడ్డగా మారిందనీ, కాంగ్రెస్ ప్రజా పాలనలో బస్తీ దవఖాన ప్రారంభించినందుకు నాగార్జునసాగర్ పైలాన్ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కర్నాటి లింగారెడ్డి, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, డి. హెచ్. ఎం. ఓ పుట్ల శీను, డిప్యూటీ డిఎంహెచ్వో రవి, ప్రోగ్రాం అధికారి కృష్ణకుమారి, మున్సిపల్ కమిషనర్ దండు శ్రీను, పెద్దవూర ఎమ్మార్వో శ్రీనివాస్, ఆర్.ఐ. దండు శ్రీనివాస్, సి.ఐ.శ్రీను నాయక్, యస్.ఐ.సంపత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జంగయ్య, ఈర్ల రామకృష్ణ, రంగా, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సామాజిక బాధ్యతగా అడవులను సంరక్షించుకోవాలి

- జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్



**చంద్రుగొండ, ఏప్రిల్ 10 (జనం సాక్షి) :** అడవుల సంరక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకొని అటవీ సంపదను రక్షించుకోవాలని జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణ గౌడ్ సూచించారు. గురువారం చంద్రుగొండ అటవీ శాఖ రేంజర్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి సారించే విధంగా అటవీశాఖ కృత నిశ్చయంతో ఉందన్నారు. అడవుల్ని ధ్వంసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అదే విధంగా కొత్తగా పోడు పేరుతో చెట్లను నరికే వారి పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. వేసవిలో మంచినీటి కోసం వచ్చే వన్య మృగాలను వేటాడటానికి విద్యుత్ తీగలను ఏర్పాటు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటువంటి సమాచారం ఉంటే తమకు అందించాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం బెండలపాడు శివారు అటవీ ప్రాంతమును సందర్శించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ అటవీశాఖ అధికారి కోటేశ్వరరావు, రేంజర్ ఎల్లయ్య, సిబ్బంది ఉన్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల స్వీకరణ పకడ్బందీగా చేపట్టాలి

- మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య



**ఖమ్మం, ఏప్రిల్ 10 (జనం సాక్షి) :** ఖమ్మం మున్సిపల్ కార్యాలయంలోని రాజీవ్ వికాస పథకం దరఖాస్తు సేకరణ ప్రక్రియ అప్లికేషన్ సమర్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద వచ్చే దరఖాస్తుల స్వీకరణ పకడ్బందీగా చేపట్టాలని పలువురు దరఖాస్తులు దారులతో మాట్లాడుతూ వారు ఏ యూనిట్లనే ఎంచుకున్నారు అనేది అడుగుతూ అప్లికేషన్స్ క్షుణ్ణంగా చదివి యూనిట్ సంబంధిత పనిలో ఎంత మేరకు అనుభవం ఉంది ఎలాంటి కార్యాచరణ చేసుకున్నారు కుటుంబ సభ్యులతో తోడ్పాటు ఉందా అనే విషయాలను వారి నుంచి వాకప్ చేశారు రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన వారి దగ్గర నుంచి ఆధార్ కార్డు రేషన్ కార్డ్ ,ఆధార్ , ఆదాయ ధ్రువీకరణ పత్రం ,కుల దృవీకరణ పత్రలతో కలిపి దరఖాస్తు చేసుకుంటున్నారా లేదా అనేది పరిశీలించారు, అంతే ఇప్పటివరకు ఎన్ని అప్లికేషన్స్ వచ్చాయి ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తు వివరాలను రిజిస్టర్లో నమోదు చేస్తున్నారా లేదా అనేది పరిశీలించి ప్రతి ఒక్కరి వివరాలను రిజిస్టర్ లో నమోదు చేయాలని సూచించారు.

# భానుడి భగభగ..

- వికారాబాద్ జిల్లాలో పెరిగిన ఉష్ణోగ్రత
- 8 మండలాల్లో నలభై డిగ్రీలకు పైబడి నమోదైన ఉష్ణోగ్రత
- 8 మండలాలలో ఆరంజ్ జోన్
- 21 మండలాలలో ఎల్లో జోన్
- ఏప్రిల్ నెలలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 10 (జనం సాక్షి) :** వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. జిల్లాలో ఉష్ణోగ్రత క్రమక్రమంగా పెరుగుతుంది. నలభై డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రత నమోదయింది. దీంతో ఉక్క పోత తట్టుకోలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు .వివరాల్లోకి వెళితే వికారాబాద్ జిల్లా కొడంగల్ వికారాబాద్ నియోజకవర్గాల్లోని వివిధ మండలాలలో గురువారం భారీగా ఉష్ణోగ్రత నమోదయింది. కొడంగల్. దుద్యాల .మర్పల్లి. బంటారం. ధరూర్ .మోమిన్ పేట్. నాగారం. తోర మామిడి కోట్‌పల్లి 40 నుండి 45 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ తెలియజేసింది. దీంతో 9 గ్రామాల్లో ఉష్ణోగ్రతలకు గాను వాతావరణ శాఖ ఆరెంజ్ జోన్ గా ప్రకటించింది. మరో 21 మండలాల్లో 35 నుంచి 40 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత నమోదయింది. ఈ మండలాలను ఎల్లో జోన్గా వాతావరణ శాఖ ప్రకటించింది. వికారాబాద్ జిల్లాలో క్రమక్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 40 డిగ్రీలు పైబడి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న కారణంగా 45 డిగ్రీలకు చేరెందుకు చెరువలో ఉన్న కారణంగా ఈ జిల్లా రెడ్ జోన్ పరిధిలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎండ తీవ్రత వల్ల వడదెబ్బ తగలకుండా ప్రజల జాగ్రత్త తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు.




# ట్రంప్ విరామ ఊరట




## హైదరాబాద్ కంపెనీ ఒలెక్ట్రాకు
## రూ. 424 కోట్ల డీల్
### 297 ఎలక్ట్రిక్ బస్సుల ఆర్డర్

హైదరాబాద్(జనంసాక్షి):ఎలక్ట్రిక్ వాహనాల తయారీ దిగ్గజం ఒలెక్ట్రా గ్రీన్‌టెక్‌కు హిమాచల్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (హెచ్‌ఆర్‌టీసీ) నుంచి 297 బస్సు ల సరఫరా, నిర్వహణకు భారీ ఆర్డరు లభించింది.కాంట్రాక్ట్ ప్రకారం లెటర్ ఆఫ్ అవార్డ్ (ఎల్‌వోఏ) తేదీ నుంచి 11 నెలల్లో బస్సులను అందించాల్సి ఉంటుంది.ఈ డీల్ విలువ సుమారు రూ. 424.01 కోట్లని కంపెనీ వివరించింది. హిమాచల్ ప్రదేశ్‌లోని కొండ ప్రాంతాల్లో నడిపేందుకు ప్రత్యేకంగా రూపొందిన ఈ బస్సులు 30 మంది ప్రయాణికుల సీటింగ్ సామర్థ్యంతో ఉంటాయి. ఒక్కసారి చార్జ్ చేస్తే 180 కి.మీ. వరకు ప్రయాణిస్తాయి.ఒక రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఇన్ని విద్యుత్ బస్సులను నేరుగా కొనుగోలు చేయడం దేశీయంగా ఇదే తొలిసారని ఒలెక్ట్రా సీఎండీ కేవీ ప్రదీప్ చెప్పారు. ఎలక్ట్రిక్ బస్సులకు సంబంధించి దేశీయంగా అతి పెద్ద ఆర్డరును అందుకోవడం తమకు గర్వకారణమని తెలిపారు.

### పుంజుకున్న ఆసియా మార్కెట్లు


చైనా మినహా మిగతా దేశాలపై విధించిన అధిక సుంకాలను 90 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన తర్వాత..ఆసియా మార్కెట్లు లాభాలబాట పట్టాయి. జపాన్ నిక్కీ 8.35% పెరిగింది. దక్షిణ కొరియా కోస్పి ఇండెక్స్ 5.38 శాతం పెరగగా, స్మాల్ క్యాప్ కోస్డాక్ 5.09 శాతం లాభపడింది.చైనా.. అమెరికన్ వస్తువులపై 84 శాతం సుంకాలను ప్రకటించిన తరువాత.. అమెరికా సుంకాలను 104 శాతం నుంచి 125 శాతానికి పెంచడంతో.. పెట్టుబడిదారులు చైనా స్టాక్‌లపై ఇన్వెస్ట్ చేయడానికి ఆలోచిస్తున్నారు. గురువారం శ్రీ మహావీర్ జయంతి సందర్భంగా భారతదేశంలో మార్కెట్లు సెలవు.మొత్తం 75 దేశాలపై విధించిన సుంకాలను 90 రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా వైట్‌హౌస్ అధికారికంగా ప్రకటించిన తరువాత.. అమెరికా- చైనా మధ్య ప్రతీకార సుంకాల వార్ కొనసాగుతోంది. ట్రంప్ మొదలు పెట్టిన సుంకాల యుద్ధాన్ని చైనా కూడా అదే స్థాయిలో తిప్పికొడుతోంది. ఇందులో భాగంగా బుధవారం అమెరికా వస్తువులపై ప్రస్తుతం ఉన్న 34 శాతం టారిఫ్‌ను 84శాతానికి పెంచుతూ చైనా నిర్ణయం తీసుకుంది.

**ట్రంప్‌పై ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఆరోపణలు!**

భాగస్వామ్య దేశాలపై విధించిన సుంకాలను 90 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



మొదటినుంచీ వెనక్కి తగ్గేది లేదంటూ ప్రకటనలు చేసిన ఆయన.. ఒక్క చైనా మినహా మిగిలిన దేశాలకు తాత్కాలిక ఊరట కల్పించారు. ఈ నేపథ్యంలో అమెరికా స్టాక్ మార్కెట్లు దూసుకెళ్లాయి. అయితే, సుంకాల మినహాయింపు ప్రకటన కంటే ముందు ట్రంప్ సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టు.. వివాదానికి కారణమైంది. ఆయన ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారంటూ డెమోక్రట్లు ఆరోపిస్తున్నారు.వివిధ దేశాలపై సుంకాల వాయిదా ప్రకటనకు ముందు ఉదయం డొనాల్డ్ ట్రంప్ ట్రూత్ సోషల్‌లో అధికారిక హ్యాండిల్ నుంచి కొన్ని పోస్టులు పెట్టారు. "బీ కూల్. అంతా సక్రమంగా జరుగుతుంది. అమెరికా ఇంతకుముందుతో పోలిస్తే మరింత మెరుగ్గా రాణిస్తుంది" అని తొలుత ఓ పోస్ట్ పెట్టారు. కాసేపటి తర్వాత "కొనుగోలు చేయడానికి ఇదే సరైన సమయం" అంటూ మరో పోస్ట్ పెట్టారు. చివర్లో %ఙఖీ% అని జోడించారు. డొనాల్డ్ ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ కార్పొరేషన్‌ను డీజేటీగా వ్యవహరిస్తారు.అక్కడికి కొన్ని గంటల తర్వాత సుంకాలపై డొనాల్డ్ ట్రంప్ తన నిర్ణయం వెలువరించారు. ఈనేపథ్యంలో అమెరికా టెక్ సూచీ అయిన నాస్‌డాక్ 12 శాతం మేర రాణించింది. ఎస్‌అండ్‌పీ 500 సూచీ 9.5 శాతం, డోజోన్స్ 8 శాతం మేర లాభపడ్డాయి. డొనాల్డ్ ట్రంప్‌నకు చెందిన మీడియా కంపెనీ షేర్లు భారీగా పెరిగి 22.67 శాతం మేర లాభాల్లో ముగిశాయి. ఈ కంపెనీలో ట్రంప్‌నకు 53 శాతం మేర వాటా ఉంది. దీంతో ఆయన వ్యక్తిగత సంపద 415 మిలియన్ డాలర్ల మేరకు పెరిగింది. ఈ మీడియా సంస్థను ట్రంప్ కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ నిర్వహిస్తున్నారు. ట్రంప్ ఈ పిలుపునివ్వడం.. కొన్ని గంటల తర్వాత టారిఫ్‌లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం.. ఆపై అమెరికా స్టాక్ మార్కెట్లు రాణించడం గమనార్హం.ఈ నాటకీయ పరిణామాలపై డెమోక్రట్ సెనేటర్ ఆడమ్ స్కిఫ్ తొలుత దీనిపై గళమెత్తారు. ట్రంప్ ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారని లేదా మార్కెట్ అవకతవకలకు పాల్పడ్డారంటూ ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఇదంతా చేస్తున్నారంటూ వర్జీనియాకు చెందిన మరో సెనేటర్ టిమ్ కైన్ ఆరోపించారు. మరికొందరు డెమోక్రట్లు సైతం ఇదేరహ అభిప్రాయం వ్యక్తంచేశారు. ఈనేపథ్యంలో ట్రంప్ పోస్ట్‌ను కాంగ్రెస్ సెనేటర్ హెవార్డ్ లుట్నిక్ సమర్థించారు. అమెరికా గొప్ప దేశం అని చెప్పడం ఆయన ఉద్దేశమని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడిగా దేశ ఆర్థికవ్యవస్థపై, మార్కెట్లపై నమ్మకాన్ని పాదుకొల్పే బాధ్యత ఆయనపై ఉందంటూ వైట్‌హౌస్ అధికార ప్రతినిధి కుష్ దేశాయ్ కూడా అధ్యక్షుడి చర్యను సమర్థించారు. మొత్తానికి ట్రంప్ పోస్ట్‌తో మార్కెట్లో పెట్టుబడులు పెట్టినవారు మాత్రం భారీగా లాభపడ్డారని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
| --- | --- |
| ₹ 3.90 | ₹ 3.92 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 85,600 | ₹ 93,380 |
| --- | --- |
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 1,07,000

## అమెరికాకు 600 టన్నుల ఐఫోన్లు..

• ప్రత్యేకంగా చార్టెడ్ ఫ్లైట్‌లలో తరలింపు..

విదేశీ దిగుమతులపై ప్రతీకార సుంకాల ప్రకటనతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాల్లో వాణిజ్య ప్రకంపనలు సృష్టించారు. ముఖ్యంగా చైనా నుంచి దిగుమతయ్యే వస్తువులపై భారీ సుంకాలు విధించడంతో అక్కడ తయారీ నిర్వహిస్తున్న కంపెనీలు ఇరుకున పడ్డాయి.ఈ క్రమంలో ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ ట్రంప్ టారిఫ్‌ల నుంచి బయటపడేందుకు ఉపాయం ఆలోచించింది. భారత్ నుంచి 600 టన్నులు లేదా సుమారు 15 లక్షల ఐఫోన్లను ప్రత్యేక కార్గో విమానాల్లో అమెరికాకు తరలించినట్లు వార్తా సంస్థ రాయిటర్స్ పేర్కొంది.అమెరికా-చైనాల మధ్య టారిఫ్ వార్ నడుస్తున్న నేపథ్యంలో యాపిల్‌కు అతిపెద్ద మార్కెట్‌లో ఒకటైన అమెరికాలో పాపులర్ ఐఫోన్ తగినంత స్టాక్‌ను అందుబాటులో ఉంచేందుకు కంపెనీ ఈ రహస్య వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తమ ఉత్పత్తులకు ప్రధాన తయారీ కేంద్రమైన చైనా నుంచి దిగుమతులపైనే యాపిల్ అధికంగా ఆధారపడుతున్న నేపథ్యంలో అమెరికాలో ఐఫోన్ల ధరలు భారీగా పెరగవచ్చని విశ్లేషకులు హెచ్చరించారు. చైనాపై విధించే టారిఫ్ రేటు ప్రస్తుతం 125 శాతంగా ఉంది. ఇక భారత్ నుండి వచ్చే దిగుమతులపై ఈ సుంకం 26 శాతం. అయితే చైనా మినహా ఇతర అన్ని దేశాలపై ఈ సుంకాల అమలును 90 రోజులు వాయిదా వేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. భారత్‌లోని దక్షిణాది రాష్ట్రమైన తమిళనాడులోని చెన్నై విమానాశ్రయంలో కస్టమ్స్ క్లియర్ చేయడానికి అవసరమైన సమయాన్ని 30 గంటల నుండి ఆరు గంటలకు తగ్గించేలా విమానాశ్రయ అధికారులతో కంపెనీ లాబీయింగ్ చేసినట్లుగా తెలుస్తోంది. "గ్రీన్ కారిడార్" పేరుతో చైనాలోని కొన్ని విమానాశ్రయాలలో చేస్తున్న ప్రత్యేక ఏర్పాటుగా చెన్నై ఎయిర్‌పోర్ట్‌లోనూ యాపిల్ చేయించినట్లు తమకు లభించిన సమాచారాన్ని ఉటంకిస్తూ రాయిటర్స్ రిపోర్ట్ చేసింది.మార్చి నెల నుంచి ఇప్పటి వరకూ ఒక్కొక్కటి 100 టన్నుల సామర్థ్యం కలిగిన ఆరు కార్గో జెట్ విమానాలు అమెరికా వెళ్లాయని, వాటిలో ఒకటి ఈ వారంలోనే అంటే కొత్త టారిఫ్‌లు ప్రకటించాక బయలుదేరిందని ఓ అధికారిని ఉటంకిస్తూ పేర్కొంది. ఐఫోన్ 14, దాని ఛార్జింగ్ కేబుల్ ప్యాకేజ్ బరువు సుమారు 350 గ్రాములు ఉంటుందని, ఇలా మొత్తం 600 టన్నుల కార్గోలో సుమారు 15 లక్షల ఐఫోన్లు వెళ్లి ఉంటాయని రాయిటర్స్ అంచనా వేస్తూ రాసుకొచ్చింది.

## రూ.4 కోట్ల కారు..
## రూ.46 లక్షల నెంబర్ ప్లేట్



భారతదేశంలో ఖరీదైన లంబోర్ఘిని కార్లను ఉపయోగించే వారి సంఖ్య నానాటికీ ఎక్కువవుతోంది. ఇటీవల కేరళకు చెందిన ఒక వ్యాపారవేత్త సరికొత్త ఉరుస్ పెర్ఫార్మాంటే కొనుగోలు చేశారు. కాగా ఈ కారు ఫ్యాన్సీ నెంబర్ కోసం రూ. 46 లక్షలు ఖర్చు చేశారు. లంబోర్ఘిని ఉరుస్ కొనుగోలు చేసిన వేణు గోపాల కృష్ణన్.. మోటారు వాహనాల శాఖ నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో 0007 అనే ఫ్యాన్సీ నెంబర్ కోసం 45.99 లక్షల రూపాయలు వెచ్చించారు. కేరళలో ఇప్పటివరకు అమ్ముడైన అత్యంత ఖరీదైన నోటిఫైడ్ ఫ్యాన్సీ వెహికల్ నెంబర్‌గా ఇది రికార్డ్ క్రియేట్ చేసింది.వేణు గోపాలకృష్ణన్ కొనుగోలు చేసిన లంబోర్ఘిని ఉరుస్ ధర రూ. 4 కోట్లు. దీనిని ఆయన బెంగళూరు లోని లంబోర్ఘిని డీలర్‌షిప్ నుంచి కొనుగోలు చేశారు. దీనికి సంబంధించిన వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇటాలియన్ స్పోర్ట్స్ కార్ బ్రాండ్ లంబోర్ఘిని భారతదేశంలోని పరిమిత నగరాల్లో మాత్రమే డీలర్‌షిప్‌లను కలిగి ఉంది. అతను బహుశా బుక్ చేసుకుని, ముందుగానే అన్ని కస్టమైజేషన్‌లను చేసి ఉండవచ్చు. ఈ వీడియోలో యజమాని, అతని కుటుంబం డెలివరీ తీసుకోవడానికి డీలర్‌షిప్‌ను సందర్శించారు. లంబోర్ఘిని ఉరుస్ పెర్ఫార్మాంటే 4.0 లీటర్, ట్విన్ టర్బో వీ8 ఇంజిన్‌తో పనిచేస్తుంది. ఇది 666 పీఎస్ పవర్, 850 న్యూటన్ మీటర్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. డిజైన్, ఫీచర్స్ పరంగా ఉత్తమంగా ఉండే ఈ కారు.. మంచి పనితీరును అందిస్తుంది. ఈ కారణంగానే చాలామంది దీనిని కొనుగోలు చేస్తుంటారు.

### అమెరికాలో భారత సంతతి
## సీఈఓ అరెస్ట్
### వ్యభిచార గృహాలతో సంబంధాల నేపథ్యంలో పోలీసుల అదుపులోకి..



క్లీన్ వాటర్ స్టార్టప్ అయిన 'గ్రాడియంట్' సీఈఓ అనురాగ్ బాజ్‌పేయిని పోలీసులు అరెస్ట్ చేశారు. అమెరికాలో ఉన్న త స్థాయి వ్యభిచార గృహాలతో సంబంధాలు పెట్టుకున్నా రనే ఆరోపణలపై ఈయనను అరెస్ట్ చేసినట్లు, బోస్టన్ ఏరియా కోర్టుకు సమర్పించిన పత్రాల్లో అధికారులు వెల్లడించారు. భారత సంతతికి చెందిన అనురాగ్ బాజ్‌పేయ్ మాత్రమే కాకుండా.. వ్యభిచార గృహాల్లో గడిపిన కేసులో వైద్యులు, న్యాయవాదులు, ప్రభుత్వ అధికారులు మొదలైనవారు ఉన్నట్లు తెలుస్తోంది. వీరు మహిళలతో గడపడానికి గంటకు 600 డాలర్లు (రూ. 50వేలు కంటే ఎక్కువ) వెచ్చించారు. వీరు ఎంచుకునే మహిళలలో ఎక్కువ మంది.. ఆక్రమ రవాణాకు గురై వ్యభిచార కూపంలో ఇరుక్కున్నవారే అని భావిస్తున్నారు.వ్యభిచార కుంభకోసం కేసులు తమ బాస్ అరెస్ట్ అవ్వడంతో.. కొందరు ఉద్యోగులు ఆయన తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అయితే గ్రాడియంట్ కంపెనీ మాత్రం ఆయనకు మద్దతుగా నిలిచింది. న్యాయ వ్యవస్థపై విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ.. సమస్య పరిష్కారమవుతుందని భావిస్తున్నామని ఒక ప్రకటనలో వెల్లడించింది.అనురాగ్ బాజ్‌పేయ్ బోస్టన్‌కు చెందిన గ్రేడియంట్ సంస్థకు సహ వ్యవస్థాపకుడు %ఙ% చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్. ఈ కంపెనీ మురుగు నీటిని శుభ్రం చేస్తుంది. భారతదేశంలో జన్మించిన బాజ్‌పేయి క్లీన్‌టెక్ పరిశ్రమలో ప్రముఖ వ్యక్తిగా ఎదిగారు. ఈయన నాయకత్వంలో కంపెనీ సెమీకండక్టర్లు, ఫార్మాస్యూటికల్స్, మైనింగ్, ఫుడ్, డ్రింక్స్ వంటి పరిశ్రమలకు సేవలు అందిస్తోంది. కంపెనీ మొత్తం 25 కంటే ఎక్కువ దేశాలలో 2500 కంటే ఎక్కువ సౌకర్యాలలో కార్యకలాపాలను కొనసాగిస్తోంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో పాఠశాల విద్యను పూర్తి చేసిన బాజ్‌పేయ్ 2006లో మిస్సోరీ కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి మెకానికల్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ పట్టా పొందారు. ఆ తరువాత ఎంఐటీలో అడ్వాన్స్‌డ్ డిగ్రీలు, 2008లో మాస్టర్ ఆఫ్ సైన్స్, 2012లో మెకానికల్ ఇంజనీరింగ్‌లో %్ఞ్మ% పట్టా పొందారు. పరిశోధనల సమయంలో ఈయన పారిశ్రామిక డీశాలినేషన్ నీటిని శుద్ధి చేయడం వంటి వాటిపై రీసర్చ్ చేశారు.

## అమెరికా వెళ్తున్నారా.. జాగ్రత్త!
### ట్రంప్ దూకుడుతో చైనీయులకు చైనా హెచ్చరిక



బీజింగ్: అగ్రరాజ్యం అమెరికా, డ్రాగన్ చైనా మధ్య టారిఫ్‌ల యుద్ధం కొనసాగుతోంది. ఇరు దేశాల పన్నులు విధించు కోవడంలో తగ్గేదే లేదంటూ దూసుకెళ్తున్నాయి.ఈ నేపథ్యంలో తన దేశ పౌరులకు చైనా హెచ్చరికలు జారీ చేసింది. చైనా విద్యార్థులు, పర్యాటకులు.. అమెరికా వెళ్లే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించి.. ప్లాన్ చేసుకోవాలని సూచన లు చేసింది. అమెరికాలో ఎదురయ్యే ముప్పులను ముందుగానే అంచనా వేసుకోవాలని కోరింది. అమెరికా-చైనా మధ్య టారిఫ్ యుద్ధం కొనసాగు తున్న సందర్భంగా చైనా పర్యటక శాఖ కీలక ప్రకట న చేసింది. అమెరికా వెళ్లే చైనీయులకు అక్కడ ఎదుర య్యే ముప్పులను ముందుగానే అంచనా వేసుకోవాల ని, జాగ్రత్త అంటూ చైనా టూరిజం శాఖ సూచించింది. దీంతోపాటు అమెరికా రాష్ట్రాల్లో చదువుకోవా లనుకునే విద్యార్థులు కూడా అయా ప్రాంతాల్లో భద్రతా ముప్పును అంచనా వేసుకొని వెళ్లాలని కోరింది. భద్రతా పరిస్థితుల కారణంగా ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికాకు వెళ్లకపోవడమే మంచిదని సూచనలు చేసింది.ఇదే సమయంలో.. ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లాలనుకునే చైనీయుల కోసం విద్యాశాఖ మరో హెచ్చరిక జారీ చేసింది. కొన్ని రాష్ట్రాల్లో చైనీయులకు సంబంధించి ప్రతికూల నిబంధనలు ఉన్నాయని తెలిపింది. భవిష్యత్తులో అక్కడ చదవాలనుకునే వారు స్థానికంగా ఎదురయ్యే సమస్యలను తెలుసుకోవాలని సూచించింది డి.ఇటీవల ఉండగా.. ప్రపంచవ్యాప్త ఆర్థిక ప్రకంపనల నేపథ్యం లో ట్రంప్ వెనక్కు తగ్గారు. భారత్‌తో పాటు 75 పై చిలుకు దేశాలపై విధించిన ప్రతీకార సుంకా లను తాత్కాలికంగా పక్కన పెట్టారు. వాటి అమలును 90 రోజుల పాటు వాయిదా వేస్తున్నట్టు ప్రకటిం చారు. దాంతో అదనపు సుంకాలు అమల్లోకి వచ్చిన ఒక్క రోజులోనే అటకెక్కాయి. కానీ చైనాతో మాత్రం అమెరికా టారిఫ్‌ల పోరు బుధవారం మరింత తీవ్రరూపు దాల్చింది. ఈ దిశగా రోజంతా శరవేగం గా నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నా యి. 50 శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించిన గంటల వ్యవధిలోనే అమెరికాపైనా చైనా అంతే మొత్తం బాదింది.అమెరికా ఉత్పత్తులపై 84 శాతం సుంకాలు గురువారం నుంచే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. దీనిపై ట్రంప్ తీవ్రంగా కన్నెర్రజేశారు. చైనా ఉత్పత్తులపై ఇప్పటికే 104 శాతానికి చేరిన సుంకాలను ఏకంగా 125 శాతానికి పెంచేశారు. అవి తక్షణం అమల్లోకి వస్తా యని కుండబద్దలు కొట్టారు. మరోవైపు యూరోపియ న్ యూనియన్ కూడా అమెరికాపై మల్లీ సుంకాల కత్తి ఝుళిపించింది. 23 బిలియన్ల విలువైన యూఎస్ ఉత్పత్తులపై దశలవారీగా అదనపు టారిఫ్‌లు విధిస్తున్నట్టు ప్రకటించింది. కెనడా కూడా అమెరికా ఆటో ఉత్పత్తులపై 25 శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్టు పేర్కొంది.

## జాతీయం అంతర్జాతీయం

### ఈసారి ఆశాజనకంగానే వర్షాలు

• ఆగస్టు, సెప్టెంబరులో భారీ వానలు
• ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా
• ఐఎండీ బులెటిన్ వచ్చే వారం విడుదల

విశాఖపట్నం(జనంసాక్షి): వ్యవసాయ రంగానికి, దేశ ఆర్థిక వ్యవస్థకు మేలు చేసే నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఈసారి సాధారణ వర్షపాతం నమోదవుతుందని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా వేసింది. దీర్ఘకాల సగటు (96 నుంచి 104 శాతం)లో 103 శాతం(ఐదు శాతం అటూఇటూగా) వర్షపాతం నమోదుకావచ్చని ప్రకటించింది. దీర్ఘకాల సగటు అంటే జూన్ నుంచి సెప్టెంబరు వరకూ గల నాలుగు నెలల నైరుతి సీజన్‌లో 865.6 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాలి. అయితే 895 మి.మీ. వర్షపాతం కురుస్తుందంటూ రైతాంగానికి స్కైమెట్ తీపికబురు అందించింది. ఇంకా యూకే(యునైటెడ్ కింగ్‌డమ్) వాతావరణ శాఖ, యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్ అంచనా మేరకు భారతదేశంలో సగటు, అంతకంటే ఎక్కువ వర్షపాతం కురుస్తుందని యూకే వర్సిటీ ఆఫ్ రీడింగ్‌లోని నేషనల్ సెంటర్ ఫర్ అట్మాస్ఫియర్ సైన్స్ శాస్త్రవేత్త అక్షయ డియోరాస్ వెల్లడించారు. కాగా, నైరుతి రుతుపవనాల సీజన్‌కు సంబంధించి ముందస్తు అంచనా బులెటిన్‌ను ఐఎండీ వచ్చేవారం విడుదల చేయనుంది. గతేడాది డిసెంబరులో పసిఫిక్ మహా సముద్రంలో ఏర్పడిన లానినా ప్రస్తుతం బలహీనపడుతోంది.ఈ నెలలో తటస్థ పరిస్థితులు ఏర్పడి ఆగస్టు వరకూ కొనసాగుతాయని అంతర్జాతీయ సంస్థలు ఇప్పటికే అంచనా వేశాయి.

## 'సందీప్ 26/11 బాధితుడు కాదు.. కర్తవ్యాన్ని నెరవేర్చాడు'



ముంబై: మహానగరం ముంబైలో 2008 నవంబర్ 26 నుంచి 29 వరకు జరిగిన 26/11 ఉగ్రదాడుల్లో 166 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడుల్లో లష్కరే-ఏ-తోయిబా ఉగ్రవాదులు తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్ తోపాటు పలు ప్రదేశాలను లక్ష్యంగా చేసుకున్నారు.ఈ దాడుల్లో తహవ్వుర్ హుస్సేన్ రాణా కీలక పాత్ర పోషించాడనే ఆరోపణలు ఉన్నాయి. 2025 ఏప్రిల్ 10న రాణాను భారత్‌కు అమెరికా అప్పగించింది.ఈ దాడుల సమయంలో ఎన్‌ఎస్‌జీ కమాండో మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ తాజ్ హోటల్‌లో ఉగ్రవాదులతో పోరాడుతూ వీరమరణం పొందారు. అతని ధైర్యం, తెగువ, త్యాగం దేశానికి స్ఫూర్తిగా నిలిచాయి. ఉగ్రవాది తహవ్వుర్ హుస్సేన్ రాణా భారత్‌కు రానున్నాడనే సంగతి తెలుసుకున్న మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ తండ్రి కె. ఉన్ని కృష్ణన్, ఎన్‌డీటీవీతో మాట్లాడుతూ 'సందీప్ 26/11 బాధితుడు కాదు, అతను తన కర్తవ్యం నిర్వర్తించాడు' అని అన్నారు. రాణా లాంటి ఉగ్రవాదులు ఈ దాడులకు కారణమని, అలాంటివారు భారత న్యాయవ్యవస్థలో శిక్షను ఎదుర్కోవాలని, న్యాయం కోసం ఎదురుచూస్తున్న బాధితులందరికీ ఇది ఒక ఆశాకిరణం' అని ఆయన పేర్కొన్నారు. తహవ్వుర్ రాణా భారత్‌కు అప్పగించిన కారణంగా 26/11 దాడులకు సంబంధించిన పూర్తి వివరాలు, పాకిస్తాన్‌లోని ఉగ్రవాద సంస్థలతో అతనికి గల సంబంధాలు బయటపడే అవకాశం ఉంది.

### ఉక్రెయిన్ ఆరోపణలపై
## చైనా ఆగ్రహం

బీజింగ్: చైనాకు చెందిన కొందరు పౌరులు రష్యాకు మద్దతు పలుకుతూ పోరాడుతున్నారని ఇటీవల ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ చేసిన ఆరోపణలపై చైనా మండిపడింది. తమ దేశ పౌరులు సాయుధ సంఘర్షణ ప్రాంతాలకు దూరంగా ఉండాలని, యుద్ధాల్లో పాల్గొనకుండా ఉండాలని కోరుకుంటుందని పేర్కొంది. జెలెన్‌స్కీ చేసిన వాదనలను తీవ్రంగా ఖండించింది.ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఇటీవల.. రష్యా సైన్యంతో కలిసి పోరాడుతున్న ఇద్దరు చైనీస్ పౌరులను తమ సైనికులు పట్టుకున్నారని, దీనిపై చైనా నుంచి వివరణ కోరుతున్నామని అన్నారు. ఈ ఘటన ఉక్రెయిన్‌లోని తూర్పు డొనెట్స్ ప్రాంతంలో జరిగినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. అయితే చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ ఈ వాదన పూర్తిగా ఆధారం లేనిదని తోసిపుచ్చారు. చైనా ప్రభుత్వం ఎప్పుడూ కూడా తమ దేశ పౌరులు సాయుధ సంఘర్షణ ప్రాంతాలకు దూరంగా ఉండాలని కోరుతుందని, వారు యుద్ధాల్లో పాల్గొనకుండా ఉండాలని అన్నారు.జెలెన్‌స్కీ చైనాపై మరిన్ని ఆరోపణలు చేస్తూ..రష్యా తన సోషల్ మీడియా ఖాతాల ద్వారా చైనీస్ పౌరులను తన సైన్యంలో నియమించుకుంటోందని, ఈ విషయం చైనా అధికారులకు తెలుసన్నారు. ఈ రిక్రూట్‌మెంట్‌లో బీజింగ్ నుంచి ఆదేశాలు అందాయా లేదా అనేది తమ దేశం అంచనా వేయాల్సి ఉందన్నారు. కాగా చైనా ప్రతినిధి లిన్ జియాన్ ఈ ఆరోపణలను ఖండిస్తూ, ఉక్రెయిన్ సంక్షోభంపై చైనా స్థితి స్పష్టంగా, స్థిరంగా ఉందని అన్నారు.

## ప్రియుడితో వెళ్లిపోయి రీల్స్.. చివరికి తండ్రి చేతిలో హతమై..



నా కూతురు ఎవరితోనో వెళ్లిపోయింది. ఎవరో చెవిలో తిరిగొచ్చింది. మళ్లీ ఎవరి కోసమో ఇంట్లోంచి వెళ్లిపోయింది. మా గురించి ఆలోచించని కూతురి గురించి మేమెందుకు ఆలోచించాలి..అంటూ పోలీసుల ఎదుట భావోద్వేగంతో ఓ తండ్రి కన్నీళ్లు పెట్టుకున్నాడు. అయితే ప్రాణంగా పెంచుకున్న కూతురిని పరువు పేరిట పొట్టన పెట్టుకుంటారనని కన్నతల్లి సహా ఎవరూ ఊహించలేకపోయారు. బీహార్ సమస్తిపూర్‌లో పరువు హత్య ఘటన చోటు చేసుకుంది. తక్కువ కులం వాడితో తన కూతురు వెళ్లిపోయి.. తిరిగొచ్చినని ఓ తండ్రి ఘాతుకానికి పాల్పడ్డాడు. ఆమెను కడతేర్చి ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు కన్నీరు పెట్టుకున్నాడు. మూడు రోజుల తర్వాత దుర్వాసన రావడంతో ఇంట్లోని బాత్రూం నుంచి ఆమె మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాక్షి(20) అనే యువతి కాలేజీ చదివే ఓ యువకుడిని ప్రేమించింది. ఆ యువకుడు ఉండేది కూడా ఆమె ఉండే కాలనీలోనే. ఆమె తండ్రి ముకేష్ కుమార్ సింగ్ రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్. వీరిద్దరి ప్రేమను ఆ తండ్రి అంగీకరించలేదు. దీంతో.. మార్చి 4వ తేదీన ఆమె ఆ యువకుడితో ఢిల్లీకి వెళ్లిపోయింది. అక్కడ రీల్స్ చేస్తూ సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయసాగింది.ఈలోపు యువకుడి బంధువు ఒకరు వాళ్లను ఒప్పించి వెనక్కి పంపించారు. వారం కిందట ఆమె తిరిగి ఇంటికి చేరుకుంది. సాక్షి తిరిగి రావడంతో ఈ కథ సుఖాంతమైందని బంధువులంతా అనుకున్నారు. కానీ, ఇంట్లోంచి వెళ్లిపోవడమే కాకుండా.. నలుగురికి తెలిసేలా కూతురు చేసిన రీల్స్‌పై ఆ తండ్రి ఆగ్రహంతో రగిలిపోయాడు. అయితే ఏప్రిల్ 7వ తేదీ నుంచి సాక్షి మళ్లీ కనిపించకుండా పోయింది. దీంతో ఆమె తల్లి కంగారుపడిపోయింది. కూతురు మళ్లీ ఇంట్లోంచి వెళ్లిపోయిందటూ తండ్రి ముకేష్ సింగ్ భార్య సహా అందరినీ నమ్మించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో సాక్షి తల్లికి అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముకేష్‌ను పోలీసులు విచారించగా.. ఎమోషనల్ డ్రామాలు ఆడాడు. ఈలోపు.. ముకేష్ బాత్రూం నుంచి దుర్వాసన రావడంతో అసలు విషయం బయటపడింది. పోలీసులతో నిజం ఒప్పుకున్న నిందితుడు.. తానే కూతురిని కడతేర్చినట్లు అంగీకరించాడు. కూతురిని చంపాక.. ఆ యువకుడిని కూడా చంపేందుకు ముకేష్ ప్రయత్నించాడని, కానీ సమయానికి ఆ యువకుడు ఊరిలో లేకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడని పోలీసులు వెల్లడించారు.

# వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన షబ్బీర్ అలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10 (జనం సాక్షి)**

మాచారెడ్డి మండలం లక్ష్మీ రావులపల్లి గ్రామంలో గురువారం మహిళా సమైక్య ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్.ఈ సందర్భంగా షబ్బీర్ ఆలీ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల రైతులు విని యోగించుకోవాలని కోరారు.రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ కృషి చేస్తోందని, పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామన్నారు.రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే విక్రయించుకొని మద్దతు ధర పొందాలని అన్నారు.సన్న రకం వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించిం దన్నారు.కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు కలుగనీయకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.రైతులకు గన్ని సంచుల కొరత, ఇతరత్రా సమస్యలు లేకుండా ప్రభుత్వం చూస్తుంది అన్నారు.ఈ కొనుగోలు కేంద్రాలను రైతుల ప్రయోనం కోసం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

# రాజ్యాంగ పరిరక్షణ

## పాదయాత్ర కు ప్రజలు నీరాజనం



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 10 (జనంసాక్షి) :**

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రకు ప్రజలు నీరాజనం పలుకుతున్నారని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. సుభాష్ నగర్ మెయిన్ రోడ్డులో గల హనుమాన్ టెంపుల్ నుండి పాదయాత్ర ప్రారంభమై 1, 2, 20, 23 డివిజన్ల మీదుగా రెడ్డి గార్డెన్ వరకు కొనసాగింది. ఈ పాదయాత్రను ఉద్దేశించి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ కి వంద సంవత్సరాల క్రితం మహాత్మా గాంధీ అధ్యక్షుడిగా ఉండి స్వాతంత్ర్య పోరాటం చేసిన సంగతి ఈ తరానికి తెలుపాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. డా.బాబా సాహెబ్ అంబేద్కర్ , భారత రాజ్యాంగం గొప్పతనాన్ని ప్రజలకు వివరిస్తూ.. పాదయాత్ర కొనసాగుతుందని నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ పాదయాత్ర లో నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్, పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, తాజా మాజీ కార్పొరేటర్ ఆర్ష కిరణ్మయి మల్లేశం, మెతుకు కాంతయ్యా, అనిల్, అటెపు వేణు, లింగమూర్తి, జంగపెల్లి మల్లయ్య, కాశెట్టి శ్రీనివాస్, దామోదర్, గుండటి శ్రీనివాస్ రెడ్డితదితరులు పాల్గొన్నారు.

# రా రైస్ మిల్లును పరిశీలించిన అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

**మల్హర్, ఏప్రిల్ 10(జనంసాక్షి) :**



మండలంలోని దబ్బగట్టు గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర రా రైస్ మిల్లును భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ గురువారం పరిశీలించారు. ఖరీఫ్ సీజన్ 2024-25 సీజన్ కు సంబంధించిన కష్టంమిల్లిడ్ రైస్ ప్రక్రియను వేగవంతంగా చేపట్టి నిర్ణీత సమయంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, తహసీల్దార్ రవికుమార్ పాల్గొన్నారు.

# జాబ్ మేళా విజయవంతానికి సమన్వయంతో పనిచేయండి

## వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

**వరంగల్ ప్రతినిధి ఏప్రిల్ 10( జనంసాక్షి) :**



జాబ్ మేళా విజయవంతానికి వివిధ విభాగాలు సమన్వయం తో పనిచేయాల్సిన అవసరం ఉందని వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అభిప్రాయపడ్డారు. (శుక్రవారం) వరంగల్ (తూర్పు) నియోజక వర్గ పరిధి లోని ఏం కే నాయుడు కన్వెన్షన్ హాల్ వరంగల్ లో నిర్వహించనున్న జాబ్ మేళా ఏర్పాట్లను గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే తో కలిసి క్షేత్ర స్తాయి లో పర్యటించి జాబ్ మేళా ను విజయవంతం చేయడం పై వివిధ విభాగాల ఉన్నతాధికారు లు సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అధికారులు వాలంటీర్స్ తో ఏర్పాటు చేసిన సమావేశం లో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మాత్యులు శ్రీమతి కొండ సురేఖ ప్రత్యేక చొరవ తీసుకొని ప్రతిష్టాత్మకంగా టాస్క్ వారి సౌజన్యంతో సుమారు 65 మల్టీ నేషనల్ కంపెనీలను భాగస్వాములను చేస్తూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు సుమారు 10 వేల మంది హాజరయ్యే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం బల్దియా సమన్వయంతో పనిచేసి జాబ్ మేళాను విజయవంతం చేయాల్సి ఉందని ఇందుకోసం ఫైర్ సేఫ్టీ కి, ఫస్ట్ ఎయిడ్, ఫుడ్ స్టాల్ ఏర్పాట్లతో పాటు మాతృమూర్తుల సౌకర్యార్థం ఫీడింగ్ రూము తో పాటు వయోవృద్ధులకు విశ్రాంతి కోసం ఏర్పాట్లు చేయాలని, బ్యాంక్ లింకేజీ రాజీవ్ యువ వికాసం సంబంధిత కేంద్రం ఐ సి డి ఎస్ వారికి సంబంధించిన ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. జాబ్ మేళా లో పాల్గొనే అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వీలుగా గ్రౌండ్ ఫ్లోర్ లో 20 హెల్ప్ డెస్కు స్టాళ్లను అలాగే రెండవ అంతస్తులో 30 హెల్ప్ డెస్క్ స్టాళ్లను ఏర్పాటు చేసి వివిధ జాబ్ లకు మెడికల్ ఐటి ఫార్మా అగ్రి ఇంజనీరింగ్ (ట్రేడ్స్) చెందిన అభ్యర్థుల కోసం వాలంటీర్స్ ద్వారా అవగాహన కలిగించి సంబంధిత డిపార్ట్మెంట్ కు చేరుకునేలా గైడ్ చేయాలని అన్నారు. డ్యూటీ నిర్వహించేవారికి, వాలంటీర్లకు, జాబ్ మేళా లకు హాజరయ్యే అభ్యర్థులకు ప్రత్యేక పాస్ లు అందించాలని బందోబస్తు, పార్కింగ్ తో పాటు విద్యుత్ సరఫరా లో ఎలాంటి అంతరాయాలు లేకుండా చూడడం, టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) కు చెందిన 15 మంది హెచ్ ఆర్ లు వచ్చే అవకాశం

ఉన్నందున వారికి సరైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. బల్దియా కమిషనర్ మాట్లాడుతూ జీ డబ్ల్యూ ఏం సి కి చెందిన ఉన్నతాధికారులు మిగతా విభాగాలను సమన్వయం చేసుకొంటూ ఏర్పాట్లలో లోపాలు లేకుండా చూడాలని ఆహారపు ఏర్పాట్లు మంచి నీటి వసతి నీడ ఉండేలా ఏర్పాట్ల ను పర్యవేక్షించి జాబ్ మేళా ను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖమంత్రుల ప్రత్యేక అధికారి శ్రీరాములు శ్రీనివాస్, జిల్లా ప్రోగ్రాం నోడల్ అధికారి రామ్ రెడ్డి సి ఏం హెచ్ ఓ డా.రాజారెడ్డి డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి రాజేశ్వర్ ఎల్డిఎం రాజు వివిధ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి

## జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

**నిజామాబాద్/ఆర్మూర్ ఏప్రిల్ 10 ( జనం సాక్షి):**



ఆర్మూర్ మండలం మంథని, జక్రాన్ పల్లి మండలం కేశ్ పల్లి గ్రామాలతో పాటు మోర్తాడ్ మండల కేంద్రంలో ఐకెపి మహిళా సంఘాలు, సహకార సంఘాల ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం పరిశీలించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం వివరాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. ధాన్యం తరలించిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. ధాన్యం తూకంలో ఏమైనా తేడాలు ఉంటున్నాయా అని ప్రశ్నించగా, ఒక్కో బస్తాకు 41.5 కిలోల చొప్పున తూకం జరుపుతున్నారని రైతులు తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిలువ చేసిన ధాన్యం రాశులను సందర్శించి వాటి నాణ్యతను పరిశీలించారు. గ్రెయిన్ క్యాలిపర్ ద్వారా నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా సన్న ధాన్యం ఉందా లేదా అని కలెక్టర్ స్వయంగా పరిశీలన జరిపారు. మంథని గ్రామంలోని కొనుగోలు కేంద్రంలో తూకం వేస్తున్న ధాన్యం అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. బాగా ఆరబెట్టి, శుభ్రపర్చిన ధాన్యాన్ని తరలించి ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయి మద్దతు ధర పొందాలని, సన్న ధాన్యానికి అదనంగా క్వింటాలుకు 500 రూపాయలు చొప్పున బోనస్ చెల్లించడం జరుగుతోందని గుర్తు చేశారు. ఇసుక, మట్టి బెడ్డలు, సేంద్రీయ పదార్థాలు, పొట్టు, తాలు గింజలు వంటివి లేకుండా, తేమ 17 శాతానికి మించకుండా ఎఫ్.ఏ.క్యూ ప్రమాణాల మేరకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చేలా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తద్వారా పూర్తిస్థాయిలో రైతులకు మద్దతు ధర అందడమే కాకుండా, రైస్ మిల్లుల వద్ద కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవని కలెక్టర్ హితవు పలికారు. కాగా, కొనుగోలు కేంద్రాల వద్ద మాయిశ్చర్ యంత్రాలు, టార్పాలిన్లు, వెయింగ్ మెషిన్లను సరిపడా సంఖ్యలో అందుబాటులో ఉంచాలని అన్నారు. అకాల వర్షాలు కురిసేందుకు అవకాశాలు ఉన్నందున రైతుల నుండి వేగవంతంగా ధాన్యం సేకరిస్తూ,వెంటదివెంట నిర్దేశించిన రైస్ మిల్లులకు తరలించాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. సన్నాలు ప్రభుత్వం బోనస్ చెల్లిస్తున్నందున గత సీజన్ తో పోలిస్తే ఈసారి యాసంగిలో 80 శాతానికి పైగా సన్న రకం ధాన్యం పండించారని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కొనుగోళ్లను వేగవంతం చేస్తూ, నిర్దిష్ట గడువుకు ముందే ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు వెంటదివెంట బిల్లుల చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని, రైస్ మిల్లుల నుండి ఎప్పటికప్పుడు ట్రక్ షీట్లు తెప్పించుకుని ట్యాబ్ ఎంట్రీలు చేయాలని ఆదేశించారు. రైతుల నుండి ధాన్యం కొన్న వెంటనే వారికి పూర్తి వివరాలతో కూడిన రసీదును తప్పనిసరిగా అందించాలని, ధాన్యం సేకరణకు సంబంధించిన వివరాలను కూడా సంబంధిత రిజిస్టర్లలో స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఇంచార్జ్ డీఆర్డీఓ సాయాగౌడ్, ఆర్డీఓ రాజాగౌడ్, డీసీఓ ఎన్.శ్రీనివాస్ రావు, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీ.ఎం శ్రీకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# భద్రాద్రి బ్యాంకు 23వ బ్రాంచ్ ప్రారంభం

**జమ్మికుంట (జనంసాక్షి)**



భద్రాద్రి బ్యాంక్ 23వ శాఖను కరీంనగర్ జిల్లా జమ్మికుంట కొండూరు కాంప్లెక్స్ నందు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. స్ట్రాంగ్ రూమ్ ను డాక్టర్ ఎం రాము జనరల్ సర్జన్, క్యాష్ కౌంటర్ ని జాయింట్ రిజిస్ట్రార్ జిల్లా సహకార అధికారి సముద్రాల రామానుజ చార్య పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అంచెలంచెలుగా ఒక్క శాఖతో ప్రారంభం అయ్యి 23వ శాఖను ప్రారంభించామని, 70వేల మంది ఖాతాదారులు ఉన్నారని, బ్యాంక్ సుమారు 1000 కోట్ల టర్నోవర్ కలిగివుందని, కష్టమర్లకు గృహ వ్యాపార చిన్న తరహా పరిశ్రమలు, ఎడ్యుకేషన్, అన్నిరకాల లోన్స్ ఇస్తామని అన్నారు. బ్యాంక్ అన్నిరకాల సేవలను ప్రజలకు అందిస్తుందని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీఈఓ దాసరి వేణుగోపాల్, డిజిఎం ఎల్వీఎస్ ప్రసాద్, వైస్ చైర్మన్లు సన్నే ఉదయ్ ప్రతాప్, వేములపల్లి వెంకటేశ్వరావు, బ్యాంక్ డైరెక్టర్స్ మేనేజర్లు, జమ్మికుంట పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణకు అన్ని వర్గాల ప్రజలు కలిసి రావాలి

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**పరకాల, ఏప్రిల్ 10 (జనం సాక్షి):**



రాజ్యాంగ పరిరక్షణకు నివర్గాల ప్రజలు ముందుకు రావాలని, కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వా నికి నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు.గురువారం పరకాల మండలం కామారెడ్డి పల్లి గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన రాజ్యాంగాన్ని మనం రక్షించుకోవాలనీ పోరాటం చేయాల్సిన పరిస్థితి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొని వచ్చిందని అన్నారు.ప్రతి గ్రామానికి,ప్రతి వీధికి, ప్రతి ఇంటికి వెళ్లి రాజ్యాంగానికి జరుగుతున్న ప్రమాదాన్ని వివరిస్తున్నామన్నారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. మతతత్వ రాజకీయాలకు పాల్పడుతూ, రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రలు పన్నుతున్న బిజెపి ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.దేశవ్యాప్తంగా గత 11సంవత్సరాలుగా దేశాన్ని పాలిస్తున్న బిజెపి రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ అప్రజాస్వామ్య పాలనను కొనసాగిస్తుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను భారత రాజ్యాంగం పై బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

# మున్సిపాలిటీకి ఆదాయ వనరులను పెంచుకోవాలి

**వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా చూడాలి**

**భూపాలపల్లి మున్సిపల్ కౌన్సిల్ హాల్ లో జరిగిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే జీఎస్సార్**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి)**



: భూపాలపల్లి మున్సిపాలిటీకి వచ్చే అన్ని ఆదాయ వనరులను సక్రమంగా సద్వినియోగం చేసుకుని, పట్టణ అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం భూపాలపల్లి మున్సిపాలిటీ కౌన్సిల్ హాల్లో మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ అధ్యక్షతన అన్ని శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ఆదాయాన్ని పెంచుకున్నప్పుడే పట్టణ అభివృద్ధికి అవకాశం ఉంటుందని తెలిపారు. పట్టణంలోని 30 వార్డుల ప్రజలను భాగస్వామ్యం చేస్తూ నూరు శాతం పన్ను వసూలకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. భూపాలపల్లి పట్టణాన్ని సుందరంగా, ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి చేసుకావాలని అన్నారు. ముఖ్యంగా పట్టణంలో అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్, గణేష్ చౌక్, మంజూరునగర్ సర్కిళ్లను భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని విస్తరించాలని, ఆ పనులను చేపట్టాలని సూచించారు. మునిసిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాలని కోరారు. వేసవి దృష్ట్యా మునిసిపాలిటీలో త్రాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో పురోగతి లేదని ఎమ్మెల్యే కాంట్రాక్టర్ల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో జాప్యం జరిగితే సహించేదిలేదని, కాంట్రాక్టర్ల పై తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అదేవిధంగా, బుద్ధారం నుండి కొడవటంచ, పందిపంపుల నుండి దూదేకులపల్లి, సింగారం నుండి దూదేకులపల్లి బీటీ రోడ్డు నిర్మాణ పనులకు అటవీ అనుమతులు తీసుకుని, ఆ పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఫారెస్ట్, ఆర్ అండ్ బీ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

# పోలింగ్ విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

## ట్రైనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారి డా.సునంద రాణి



**హైదరాబాద్, ఏప్రిల్ 10 (జనంసాక్షి)**

: పోలింగ్ విధుల పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు శిక్షణ ఉపయోగపడుతుందని ఎన్నికల ట్రైనింగ్ మేనేజ్మెంట్ నోడల్ అధికారి డా.సునంద రాణి అన్నారు. పోలింగ్ అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం లో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, ఓపిఓ లకు తొలి విడత ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్స్ వారికి ఎన్నికల నియమ నిబంధనలు, బ్యాలెట్ బాక్సుల సీల్ విధానం, బ్యాలెట్ పేపర్స్, అవసరమైన ఫారాలు పూరించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డెమో బ్యాలెట్ బాక్స్ ద్వారా వారితో ప్రత్యక్షంగా చేయించి హ్యాండ్స్ ఆన్ శిక్షణను ఇచ్చారు. శిక్షణలో పి.ఓ లు, ఏపిఓ లకు తలెత్తిన సందేహాలను మాస్టర్ ట్రైనర్స్ నివృత్తి చేసారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు విజయలక్ష్మి(పి.ఓ యు.సి.డి), మమత (ఈఈ ఎలక్ట్రికల్స్), పిఓలు, ఏపిఓలు, మైక్రో అబ్జర్వర్, ఓపిఓలు పాల్గొన్నారు.

# రేషన్ కార్డులు, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

**బెల్లంపల్లి, ఏప్రిల్ 10, (జనంసాక్షి)**



బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి క్వార్టర్లుకు చెందిన లబ్ధిదారులకు పెండింగ్ లో ఉన్న పట్టాలు, రేషన్ కార్డులు మంజూరు చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో గురువారం బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి రాష్ట్ర సమితి సభ్యులు బొల్లం పూర్ణిమ జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు సింగరేణి పాత క్వార్టర్సులలో నివసి స్తున్న వారికి డబ్బులు కట్టించుకుని కొంతమందికి జీవో నెంబర్ 76 ప్రకారం కొంతమందికి పట్టాలు ఇచ్చారని తెలిపారు. డబ్బులు చెల్లించిన ఇంకా కొంతమందికి పట్టాలు రాలేదనీ వాపోయారు. ఇంకా చాలామంది పాత సింగరేణి క్వార్టర్లో నివసిస్తున్న వారికి పట్టాలు ఇవ్వలేదన్నారు. నామమాత్రపు రుసుము తీసుకొని అందరికీ జీవో నెంబర్ 58, 59 ప్రకారంగా అందరికీ పట్టాలు ఇవ్వలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారంగా అర్హులం దరికీ రేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాల న్నారు. రేషన్ కార్డు ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న సందర్భంగా అందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తే సన్నబియ్యం పొందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శిలు బొంతల లక్ష్మీనారాయణ, బెల్లంపల్లి మండల కార్యదర్శి, మేకల రాజేశం, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గుండా చంద్రమాణిక్యం, బీకేఎం యూ జిల్లా కార్యదర్శి కొంకుల రాజేష్, పట్టణ సహాయ కార్యదర్శి, బొంకూ రు రామచందర్, పట్టణ కార్యవర్గ సభ్యులు రత్నం రాజ్యం, పట్టణ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# కుదురుపల్లి అటవిలో అగ్ని మంటలు

**మహదేవపూర్, ఎప్రిల్ 10 (జనంసాక్షి.)**



కుదురుపల్లి అటవిలో ఉదయం నుంచి అగ్ని మంటలు మండుతూ అటవిలోని చెట్లని ధస్వము అవుతుటే అటవీ శాఖ అధికారు నిర్లక్ష్యం ఎందుకని అటవిని రక్షించే ఫారెస్ట్ అధికారులు బీభత్సమైన అగ్ని మంటలు అడవిలో భగ్గుమని మంటలు మండి చెట్లని కాలుతుంటే అగ్ని మంటలను ఆర్పి వేయడంలో ఫారెస్ట్ అధికారులు నిర్లక్ష్యంచేయడం ఎందుకని ప్రజలు అనుకుంటున్నారు. అలాగే ఆయాగ్రామాల చెందిన కూలీలు అత్యవసరం కోసం వంట చేసుకోవడానికి చిన్న కట్టెపుల్లలు తీసుకువస్తే ఫారెస్ట్ అధికారులు భయాందోళనకు గురి చేస్తుంటారు. కానీ ఇప్పుడు ఎండాకాల కాబట్టి అగ్ని మంటలు మండుతుంటే అటవీ ప్రక్కన ఉన్న గ్రామాల్లోని ప్రజలు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని గ్రామాల ప్రజలు భయాందోళనకు గురి చెందుతున్నారు. గ్రామాల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఇప్పటికైనా సంబంధిత ఫారెస్ట్ అధికారులు అగ్ని మంటలతో చెట్లని దస్వం కాకుండా చల్లారిపోవాల్సిందిగా ఆయా గ్రామాల్లోని ప్రజలు వేడుకుంటున్నారు.

# ఆటగాళ్లను రిటైర్డ్ ఔట్‌గా పంపడమేంటి?

## టీమిండియా మాజీ క్రికెటర్ కైఫ్ అసహనం



ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆటగాళ్లను రిటైర్డ్ ఔట్‌గా బయటకు పంపించాడాన్ని టీమిండియా మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తప్పు బట్టాడు. ఇది ఏ మాత్రం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఇప్పటికే ఇద్దరు బ్యాటర్లు రిటైర్డ్ ఔట్‌గా బయటకు వచ్చారు. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్.. తమ బ్యాటర్ తిలక్ వర్మను రిటైర్డ్ ఔట్‌గా బయటకు రప్పించడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. 23 బంతుల్లో 25 పరుగులే చేసి తీవ్ర తడబడిన తిలక్ వర్మను.. ముంబై ఇండియన్స్ రిటైర్డ్ ఔట్‌గా బయటకు రప్పించింది. ఇది సరికాదని తీవ్ర విమర్శలు రాగా.. తలకు బంతి తగలడంతోనే అతన్ని బయటకు పంపించామని హార్దిక్ పాండ్యా వివరణ ఇచ్చాడు. పంజాబ్ కింగ్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లోనూ చెన్నై సూపర్ కింగ్స్ తమ బ్యాటర్ అయిన డెవాన్ కాన్వే(69 నాటౌట్)ను బయటకు రప్పించింది. ఈ రెండు సందర్భాల్లో ఆ జట్లకు ఓటమే ఎదురైంది. తాజాగా ఈ వ్యవహారంపై ఎక్స్ వేదికగా స్పందించిన మహమ్మద్ కైఫ్.. అసహనంతో ఆయా జట్లు రిటైర్డ్ ఔట్ నిర్ణయాన్ని తీసుకుంటున్నాయని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2020 సీజన్‌లో రాహుల్ తెవాటియా బ్యాటింగ్‌కు ఇలానే ఫ్రస్టేట్ అయి రిటైర్డ్ ఔట్‌గా బయటకు పంపిస్తే అతను 5 బంతుల్లో 5 సిక్స్‌లు కొట్టి మ్యాచ్ గెలిపించేవాడా? అని కైఫ్ ప్రశ్నించాడు. 'అసహనంతో జట్లు రిటైర్డ్ ఆప్షన్ ఉపయోగించుకుంటున్నాయి. ఈ చిట్కా చాలా తక్కువ సందర్భాల్లో ఫలితం ఇస్తోంది. అతి తక్కువ మంది బ్యాటర్లు మాత్రమే తొలి బంతిని సిక్సర్‌గా తరలిస్తారు. చాలా సందర్భాల్లో క్రీజులో పోరాడుతున్న బ్యాటర్లే విజయాలను అందించారు. రాహుల్ తెవాటియా బ్యాటింగ్ గుర్తుందా? అతను ఆఖరి 5 బంతుల్లో 5 సిక్స్‌లు బాది తన జట్టును గెలిపించాడు. ఆ మ్యాచ్‌లో తొలి 19 బంతుల్లో అతను 8 పరుగులు మాత్రమే చేశాడు.'అని కైఫ్ పేర్కొన్నాడు.ఐపీఎల్ చరిత్రలోనే ఇప్పటి వరకు మొత్తం ఐదుగురు బ్యాటర్లు రిటైర్డ్ ఔట్‌గా వెనుదిరిగారు. ఈ రూల్‌ను ఉపయోగించుకున్న తొలి బ్యాటర్‌గా రవిచంద్రన్ అశ్విన్ నిలిచాడు. ఐపీఎల్ 2022 సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ తరపున బరిలోకి దిగిన అతను రిటైర్డ్ ఔట్‌గా మైదానం వీడాడు. ఐపీఎల్ 2023 సీజన్‌లో అథర్వ టైడ్, సాయి సుదర్శన్ ఈ రూల్‌ను ఉపయోగించారు. తాజా సీజన్‌లో తిలక్ వర్మ, డెవాన్ కాన్వే రిటైర్డ్ ఔటయ్యారు. ఈ ఐదు సందర్భాల్లో ఈ రూల్‌ను ఉపయోగించిన జట్లకు రెండు సార్లు మాత్రమే విజయం దక్కింది.



**ఎంపిక ఎలా..**

ఒలింపిక్స్‌కు జట్లను ఎలా ఎంపిక చేస్తారనేది ఇంకా నిర్ణయించలేదు. టీ20 ర్యాంకింగ్స్ ఆధారంగా జట్లను ఒలింపిక్స్‌కు ఎంపిక చేసే అవకాశం ఉంది. ఆతిథ్య దేశమైన అమెరికా నేరుగా ప్రవేశించే అవకాశం ఉండటంతో, ర్యాంకింగ్స్‌లో ఉన్న జట్లు టాప్-5 స్థానాలకు పోటీ పడవచ్చు.

# విశ్వ క్రీడల్లో క్రికెట్

## 128 ఏళ్ల తర్వాత ఒలింపిక్స్‌కు అనుమతి

- ఆరు జట్లు పాల్గొనే అవకాశం
- జట్ల ఎంపిక కోసం కసరత్తు ప్రారంభం

**క్రికెట్ అభిమానులకు ఒలింపిక్స్ నిర్వహకులు గుడ్ న్యూస్ చెప్పారు. లాస్ ఏంజిల్స్ వేదికగా 2028లో జరగనున్న ఒలింపిక్స్ క్రీడల్లో క్రికెట్‌ను చోటు లభించింది. తాజాగా ఈ ఒలింపిక్స్ లో క్రికెట్ కు సంబంధించిన మరో కొత్త విషయాన్ని అధికారికంగా ప్రకటించారు ఒలింపిక్స్ నిర్వాహకులు. టీ20 ఫార్మాట్‌లో క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు ఒలింపిక్స్ నిర్వాహకులు తెలిపారు. పురుషులు, మహిళల విభాగాలలో ఆరు జట్లు పాల్గొంటాయి. ప్రతి జట్టు నుండి 15 మంది చొప్పున మొత్తం 90 మంది క్రికెటర్లకు అనుమతి ఉంది. ఇదిలా ఉండగా, ఆతిథ్య దేశమైన అమెరికాకు నేరుగా ప్రవేశం లభించే అవకాశం ఉంది. మిగిలిన జట్లను ఎలా ఎంపిక చేస్తారు అన్నది ఇంకా నిర్ణయించలేదు.**

లాస్ ఏంజిలెస్ వేదికగా 2028 ఒలింపిక్ గేమ్స్ జరగనున్న సంగతి తెలిసిందే. అయితే చివరి సారిగా 1900లో ఒలింపిక్స్‌లో క్రికెట్ జరిగింది. మళ్లీ ఇప్పుడు ఇన్నాళ్లకు అంటే, దాదాపు 128 ఏళ్ల తర్వాత ప్రతిష్టాత్మక లాస్ ఏంజిలెస్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు లభించింది. తాజాగా ఈ ఒలింపిక్స్‌లో క్రికెట్ కు సంబంధించిన మరో కొత్త విషయాన్ని అధికారికంగా ప్రకటించారు ఒలింపిక్స్ నిర్వాహకులు. ఈ లాస్ ఏంజెలిస్ 2028 ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను టి20 ఫార్మాట్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు నిర్వాహకులు. మెన్స్, ఉమెన్స్ విభాగాల్లో 6 జట్లు చొప్పున పాల్గొననున్నాయి. ఒక్కో జట్టు నుంచి 15 మంది చొప్పున మొత్తం 90మంది క్రికెటర్లకు అనుమతినిస్తూ ఐఓసీ నిర్ణయం తీసుకుంది. టీ20 ర్యాంకింగ్స్ లో ఉన్న టాప్-6 జట్లే ఒలింపిక్స్ లో పాల్గొనే అవకాశం ఉందని తెలిసింది. అయితే అమెరికా హోస్ట్‌గా వ్యవహరిస్తోన్న నేపథ్యంలో వారికి మాత్రం నేరుగా ప్రవేశం దక్కే అవకాశం ఉందని స్పష్టంగా తెలుస్తోంది. దీని బట్టి, మిగతా ఐదు స్థానాలకు మాత్రం ర్యాంకింగ్స్ లో జట్లు పోటీ పడాలి. ప్రస్తుతం పురుషుల టీ20 ర్యాంకింగ్స్‌లో భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, వెస్టిండీస్ టాప్ 5లో ఉన్నాయి. మహిళల విభాగంలో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, భారత్, దక్షిణాఫ్రికా జట్లు ముందున్నాయి. కానీ 2028 ఒలింపిక్స్ ఇంకా నాలుగేళ్లు సమయం ఉంది కాబట్టి, ఈ ర్యాంకింగ్స్‌లో మార్పులు జరగొచ్చు.ఒలింపిక్స్‌లో భారత్ వర్సెస్ పాకిస్థాన్ జట్లు ఆడితే, అది క్రికెట్ అభిమానులకు అసలైన మజానిస్తోందన్న సంగతి తెలిసిందే. అయితే పాకిస్థాన్ ప్రస్తుత ఫామ్ చూస్తుంటే, వారు టాప్ -5లో చోటు సంపాదించుకోవడం కోసం గట్టిగానే పోటీ పడాల్సిన అవసరం ఉంటుంది. కాగా, చివరిసారిగా 1900 పారిస్ ఒలింపిక్స్‌లో గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్స్ మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగిన విషయం తెలిసిందే. అయితే మనం పైన చెప్పుకున్న జట్ల ఎంపిక అనేది కేవలం అంచనా మాత్రమే. 2028 ఒలింపిక్స్ నిర్వహించే నాటికి టీ20 ర్యాంకింగ్స్‌లో మార్పులు వస్తే జట్ల ఎంపికలో కూడా మళ్లీ మార్పులు రావచ్చు. కాబట్టి ఇవే ఫైనల్ అనేది స్పష్టం చేయలేము. దాదాపు 128 ఏళ్ల తర్వాత ఒలింపిక్స్‌లో మళ్లీ క్రికెట్‌ను నిర్వహించబో తున్నారు. 1900 ఒలింపిక్స్‌లో తొలిసారిగా క్రికెట్‌ను నిర్వహించారు. ఈ పోటీల్లో బ్రిటన్, ఫ్రాన్స్ రెండు జట్లు మాత్రమే పాల్గొన్నాయి. ఇందులో 158 పరుగుల భారీ తేడాతో విజయం సాధించిన బ్రిటన్ స్వర్ణ పతకాన్ని గెలుచుకో గా, ఫ్రాన్స్ కాంస్యం అందుకుంది. ఆ తర్వాత కొన్ని అనివార్యకారణాలతో క్రికెట్‌ను ఒలింపిక్స్ పోటీల నుంచి తప్పించారు.

**విమెన్ టీమ్స్ కూడా..**

128 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఒలింపిక్స్‌లో క్రికెట్ భాగం కానుంది. మెన్స్‌తో పాటు విమెన్స్ టీమ్స్ కూడా లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్-2028లో పోటీపడనున్నాయి. ఇద్దరికీ వేర్వేరు ఈవెంట్స్ నిర్వహిస్తారు. అయితే కేవలం ఆరేసి జట్లు మాత్రమే పాల్గొంటాయని స్పష్టం చేసింది ఐవోసీ. పురుషుల ఈవెంట్స్‌లో 6 జట్లు, మహిళల ఈవెంట్స్‌లో 6 జట్లు మెడల్స్ కోసం పోటీపడతాయని క్లారిటీ ఇచ్చింది. మొత్తంగా ప్రతి ఈవెంట్‌లో 90 మంది చొప్పున ఆటగాళ్లు పాల్గొంటారని తెలిపింది. టీ20 ఫార్మాట్‌లో మ్యాచులు నిర్వహిస్తామని అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం పేర్కొంది.





**పాక్‌కు ఝలక్**

ఒలింపిక్స్‌లో పాల్గొనే జట్లు, ఆటగాళ్లు, ఫార్మాట్ తదితర విషయాలపై క్లారిటీ ఇచ్చిన ఐవోసీ.. క్వాలిఫికేషన్ గురించి మాత్రం స్పష్టత ఇవ్వలేదు. మెగా టోర్నమెంట్‌కు ఇంకా చాలా టైమ్ ఉంది. కాబట్టి ఆ వివరాలు తదుపరి వెల్లడించే అవకాశం ఉంది. అయితే టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇస్తున్నందున యూఎస్ఏ జట్టు ఎలాగూ నేరుగా అర్హత సాధిస్తుంది. దీంతో మిగిలిన 5 జట్లు ఏవో తేలాల్సి ఉంది. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్-5లో ఉన్న జట్లే క్వాలిఫై అవుతాయని వినిపిస్తోంది. అదే నిజమైతే 7వ ర్యాంక్‌లో ఉన్న దాయాది పాకిస్థాన్‌కు ఒలింపిక్స్ చాన్స్ మిస్ అవడం ఖాయం. కాగా, వచ్చే ఒలింపిక్స్‌లో క్రికెట్‌తో పాటు బేస్‌బాల్/సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోస్ (సిక్సెస్), స్క్వాష్ లాంటి ఇతర ఆటల్ని కొత్తగా చేర్చారు.

# ప్లేఆఫ్స్ చేరేనా?

## హైదరాబాద్, చెన్నై, ముంబై జట్ల ఆశలు గల్లంతే!!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ ఎడిషన్ చాలా ఆసక్తిగా కొనసాగుతోంది. టోర్నమెంట్‌లో 22 మ్యాచ్‌లు పూర్తి అయ్యాయి. ఇప్పుడు ప్రతి మ్యాచ్ కూడా ప్లే ఆఫ్‌ను దృష్టిలో పెట్టుకొని జట్లు ఆడతాయి. దీంతో ప్లేఆఫ్స్ బెర్త్‌కు చేరడానికి జరిగే ఈ సమరం మరింత ఉత్కంఠగా మారనుంది. ఐదేసి సార్లు ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ ఈసారి ప్లేఆఫ్స్ చేరేందుకు చెమట చిందించాల్సిందే. ప్రారంభ మ్యాచ్‌ల్లో వరుస ఓటములు ఆ జట్లను భారీగానే దెబ్బతీస్తున్నాయి. ప్లేఆప్‌కు వెళ్లే మార్గాలను మరింత క్లిష్టంగా మార్చేస్తున్నాయి. ఐపీఎల్2025లో 22 మ్యాచ్‌లు ఇప్పటివరకు జరిగాయి. ముంబై ఇండియన్స్ ఆడిన 5 మ్యాచ్‌లలో నాలుగింటిలో ఓడిపోయింది. చెన్నై సూపర్ కింగ్స్ జట్టుది అదే పరిస్థితి. ఇప్పుడు టాప్ 4లో ఉన్న 3 జట్లు ఒక్కసారి కూడా ట్రోఫీని గెలవలేకపోయిన జట్లే ఉన్నాయి. మొదటి స్థానంలో ఢిల్లీ క్యాపిటల్స్, రెండో స్థానంలో గుజరాత్ టైటాన్స్, మూడో స్థానంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, నాల్గో స్థానంలో పంజాబ్ కింగ్స్ ఉన్నాయి. టోర్నమెంట్‌లో ఆడుతున్న ప్రతి జట్టు 14 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. ఆ తరువాత టాప్ 4లో ఉన్న జట్లు ప్లేఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. మిగిలిన జట్లు వచ్చే సీజన్ తమ లక్‌ను పరీక్షించుకోవాల్సి ఉంటుంది. అక్షర్ పటేల్ కెప్టెన్సీలోని ఢిల్లీ క్యాపిటల్స్ ఐపీఎల్ 2025లో ఇప్పటివరకు ఆడిన ఏ మ్యాచ్ కూడా ఓడిపోలేదు. సీజన్ 18లో అన్ని మ్యాచ్‌లు గెలిచిన ఏకైక జట్టుగా ఉంది. 3 మ్యాచ్‌లు ఆడి గెలిచిన డీసీ 6 పాయింట్లతో౦1.257 రన్‌రేటు కలిగి ఉంది. ఇప్పుడు ఈ జట్టు ప్లేఆఫ్స్‌కు చేరాలంటే మరో 5 మ్యాచ్‌లు గెలిస్తే సరిపోతుంది. శుభ్మన్ గిల్ కెప్టెన్సీలోని గుజరాత్ టైటాన్స్ 4 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 3 మ్యాచ్‌లు గెలిచింది. ఈ జట్టుకి కూడా 6 పాయింట్లు ఉన్నాయి. దాని నెట్ రన్ రేట్ ౦1.031గా ఉంది. ఈ జట్టు ప్లేఆఫ్స్‌లో చోటు కోసం ఆడబోయే 10 మ్యాచ్‌లలో కనీసం 5 మ్యాచ్‌లు గెలవాలి. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలోని ఆర్‌సిబి ఈ సీజన్‌లో దుమ్మురేపుతోంది. చాలా గట్టిపోటీ ఇస్తోంది. జట్టు బ్యాటింగ్, బౌలింగ్ ఫీల్డింగ్ అన్ని విభాగాల్లో చాలా స్ట్రాంగ్‌గా ఉంది. నాలుగు మ్యాచ్‌లు ఆడిన ఈజట్టు కూడా మూడింటిలో విజయం సాధించి ౦1.015 నెట్ రన్ రేట్ తో మూడో స్థానంలో ఉంది. ఇంకా ఈ జట్టు పది మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. వాటిలో ఐదు గెలిస్తే ప్లేఆఫ్స్‌కు వెళ్తుంది. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలోని పంజాబ్ కింగ్స్ కూడా 4 మ్యాచ్‌లలో మూడింటిని గెలిచింది. ఈ జట్టు బ్యాటర్లు అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. ఇప్పుడు పంజాబ్ పాయింట్ల పట్టికలో నాల్గో స్థానంలో ఉంది. పంజాబ్ కింగ్స్ తదుపరి 10 మ్యాచ్‌లలో కనీసం 5 మ్యాచ్‌లు గెలవాలి.రిషబ్ పంత్ కెప్టెన్సీలోని లక్నో సూపర్ జెయింట్స్ ఆడిన ఐదు మ్యాచ్‌లలో మూడింటిని గెలుచుకుంది. జట్టు పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలో ఉంది. అది ఇంకా 9 మ్యాచ్‌లు ఆడాలి. అందులో 5 మ్యాచ్‌లు గెలవాలి.అజింక్యా రహానే కెప్టెన్సీలోని కెకెఆర్ మొదటి మ్యాచ్‌లోనే ఓడిపోయి టోర్నమెంట్‌ను ప్రారంభించింది. తర్వాత కాస్త కోలుకుంది. ఐదు మ్యాచ్‌లకు రెండు గెలిచి పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో ఉంది. ఇంకా ఈ జట్టు 9 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇందులో కనీసం 6 మ్యాచ్‌లు గెలవాలి, లేకపోతే ప్లే ఆఫ్‌కు వెళ్లడం చాలా కష్టం అవుతుంది. సంజూ శాంసన్ కెప్టెన్సీలోని రాజస్థాన్ రాయల్స్ మొదట ఆడిన 2 మ్యాచ్‌లు ఓడింది. కానీ ఆ తరువాత జరిగిన 2 మ్యాచ్‌లు గెలుచుకుంది. రాజస్థాన్ ప్లేఆఫ్స్‌కు చేరడానికి తదుపరి 10 మ్యాచ్‌లలో కనీసం 6 మ్యాచ్‌లు గెలవాలి.హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలోని ముంబై ఇండియన్స్ గత సంవత్సరం కూడా బాగా ఆడలేదు. ఈ సీజన్ లో కూడా జట్టు అంతగా ఆకట్టుకునే ఆటతీరు కనబర్చడం లేదు. ముంబై 5 మ్యాచ్‌లు ఆడింది. కానీ ఒక మ్యాచ్ మాత్రమే గెలిచింది. ముంబై ఇంకా 9 మ్యాచ్‌లు ఆడాలి. ఇందులో కనీసం 7 మ్యాచ్‌లు గెలిస్తే తప్ప ప్లేఆఫ్స్ రేసులో నిలబడే ఛాన్స్ లేదు. మరో రెండు మ్యాచ్‌లు ఓడిందంటే చాలా ప్లేఆఫ్స్ పోటీ నుంచి తప్పుకున్నట్టే. రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలోని చెన్నై సూపర్ కింగ్స్ 5 లో ఒక మ్యాచ్ మాత్రమే గెలిచింది. అది పాయింట్ల పట్టికలో 9వ స్థానంలో ఉంది. అది కూడా 9 మ్యాచ్‌లు ఆడాలి. కానీ ప్లేఆఫ్స్‌లో చోటు దక్కించుకోవాలంటే కనీసం 7 మ్యాచ్ లు గెలవాలి.పాట్ కమిన్స్ కెప్టెన్సీలోని సన్ రైజర్స్ హైదరాబాద్ పరిస్థితి కూడా చెన్నై, ముంబై కంటే దారుణంగా ఉంది. ఆ జట్టు కూడా 5 లో 4 మ్యాచ్‌లు ఓడింది. నెట్ రన్‌రేట్ ఆధారంగా జట్టు చివరి స్థానంలో ఉంది. హైదరాబాద్ కూడా తదుపరి 9 మ్యాచ్ లలో 7 మ్యాచ్ లు గెలవాలి. లేకపోతే జట్టు ప్లేఆఫ్స్ కు చేరే అవకాశం దాదాపుగా లేనట్టే.

# యమగుచి చేతిలో సింధు ఓటమి

## ఆసియా ఛాంపియన్‌షిప్ నుంచి సింధు ఔట్



2025 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షట్లర్ పివి సింధుకు నిరాశ ఎదురైంది. తొలి మ్యాచ్‌లో నెగ్గిన సింధుకు హోరాహోరీగా సాగిన రెండో రౌండ్‌లో పరాజయం ఎదురైంది. ఆమె జపాన్‌కు చెందిన యమగుచి చేతిలో 12-21, 21-16, 16-21 తేడాతో ఓడింది. తాజా ఓటమితో సింధు ఆసియా ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ నుంచి నిష్క్రమించింది. జపాన్‌కు చెందిన యమగుచితో సింధు గురువారం రెండో రౌండ్‌లో ఢీ కొట్టింది. ఈ మ్యాచ్‌లో తొలి నుంచి ఆధిపత్యం ప్రదర్శించి యమగుచి సింధుపై మొదటి సెట్‌లో భారీ తేడా 12-21తో నెగ్గింది. ఇక రెండో సెట్‌లో సింధు కమ్‌బ్యాక్ ఇచ్చింది. ప్రత్యర్థికి సవాల్ విసురుతూ చురుగ్గా ఆడింది. ఫలితంగా రెండో సెట్‌ను సింధు 21-16తో దక్కించుకుంది. దీంతో ఫలితం కోసం మూడో సెట్ ఆడాల్సి వచ్చింది. దూఆర్డై సెట్‌లో సింధు ప్రత్యర్థికి గట్టిగానే బదులిచ్చింది. హోరాహోరీగా సాగిన ఈ సెట్‌లో సింధు ఆఖర్లో పట్టు కోల్పోయింది. చివర్లో యమగుచి 16-24 తేడాతో నెగ్గి మ్యాచ్ సొంతం చేసుకుంది. దీంతో సింధు టోర్నీ నుంచి నిష్క్రమించింది. కాగా, గత నాలుగు టోర్నమెంట్‌ల్లో సింధు రెండో రౌండ్ దాటకపోవడం గమనార్హం.సింధు ఓటమితో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో భారత్ బ్యాడ్మింటన్ సింగిల్స్ పోరాటం ముగిసింది. పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జ్, ప్రియాన్షు రజావత్ కూడా రెండో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టారు. జపాన్ సీడ్ కొడయ్ నరకొను ఎదుర్కొన్న ప్రియాన్షు 14-21, 17-21 వరుస సెట్లలో ఓడిపోయాడు. ఇక కుల్వంత్‌తో ఢీ కొట్టిన కిరణ్ 21-19 13-21 16-21 తేడాతో పరాజయం పాలయ్యాడు. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడీ ధ్రువ్ కపిల- తానిషా క్రాస్టో క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించారు. రెండో రౌండ్లో ఈ జోడీ చైనీస్ తైపీకి చెందిన యే హాంగ్ వీ- నికోల్ గొంజాలెస్ చాన్‌ను ఢీ కొట్టింది . ఈ రౌండ్‌లో భారత్ జోడీ 12-21 21-16 21-18తో నెగ్గి క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది.





# చిరస్మరణీయులు మహ్మద్ రజబ్ అలీ, కూరాకుల నరసయ్య

## వర్ధంతి సభలో మహా నేతలకి ఘనంగా నివాళులు

**ఖమ్మం (జనంసాక్షి) :** సుదీర్ఘ కాలం శాసన సభ్యునిగా ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన మహ్మద్ రజాబ్ అలీ చిరస్మరణీయుడని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట యోధునిగా, కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా రజబ్ అలీ ప్రజల మదిలో నిలిచిపోయారన్నారు. మహ్మద్ రజబ్ అలీ 29వ వర్ధంతిని సిపిఐ ఆధ్వర్యంలో వారి స్వగ్రామం రఘునాథపాలెం మండలం పాపటపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గురువారం రజబ్ అలీ వర్ధంతి సందర్భంగా ఖమ్మం నగరం నుంచి పాపటపల్లి వరకు సిపిఐ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని మహ్మద్ రజబ్లీ, మాజీ సర్పంచ్, సిపిఐ నాయకులు కూరాకుల నర్సయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ ఖమ్మం నియోజక వర్గ కార్యదర్శి ఎస్కె జానిమియా అధ్యక్షతన జరిగిన సభలో బాగం మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన రజబ్ అలీ తొలి నాళ్లలో ఉర్దూ తెలుగు అనువాదకునిగా పనిచేశారన్నారు. తెలంగాణలో నాటి ప్రత్యేక పరిస్థితులను చూసి కమ్యూనిస్టు పార్టీలో చేరారన్నారు. ఖమ్మంజిల్లాలో జరిగిన ఆంధ్ర మహాసభ రైతాంగ ఉద్యమంలో, బండి పట్టాల ఉద్యమంలోను చురుకుగా పాల్గొన్నారని హేమంతరావు తెలిపారు. సాయుధ తెలంగాణ పోరాట కాలంలో మూడున్నర ఏళ్ల పాటు రజబ్ అలీ జైలు జీవితం గడిపార న్నారు. ఖమ్మం నియోజకవర్గం నుండి రెండు సార్లు, సుజాతనగర్ నియోజక వర్గం నుంచి నాలుగు సార్లు శాసనసభకు ఎన్నికయ్యారన్నారు. చట్టసభలలో పేదల వాణి వినిపించి ప్రజల మనిషిగా పేరొందరన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన పలు ప్రజా ఉద్యమాలకు రజబ్ అలీ నాయకత్వం వహించారని గణేశ్వరం, వినోభానగర్ తదితర చోట్ల చారిత్రిక భూ పోరాటాలకు నాయకత్వం వహించి వందలాది ఎకరాలను పేదలకు పంపిణీ చేశారన్నారు. ముఖ్యంగా గిరిజన సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన కృషి వెలకట్టలేనిదని, గిరిజనులు ఆయనను ముద్దుగా లంబాడోళ్ల రాందాస్ గా పిలుచుకునేవారని హేమంతరావు గుర్తు చేశారు. పాలకుల, ప్రజా వ్యతిరేక విధానాలపై పోమే రజబ్ అలీకి మనమిచ్చే సరైన నివాళి అన్నారు. ఇదే గ్రామానికి చెందిన కూరాకుల నర్సయ్య రజబ్ అలీ అనుచరునిగా, 30 ఏళ్ళు గ్రామానికి సర్పంచ్ గా పనిచేసి ప్రజా సమస్యల కోసం అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ఈ సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, యర్రాబాబు, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, అజ్మీర రామ్మూర్తి, జిల్లా సమితి సభ్యులు. సిహెచ్ సీతామహాలక్ష్మి, గాదె లక్ష్మి నారాయణ, యానాలి సాంబశివారెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి శాఖమూరి శ్రీనివాసరావు, ప్రొద్దుటూరి వెంకటరెడ్డి, జూలా వెంకటేశ్వర్లు, బోడా వీరన్న, రజబ్లీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## సంజూ శాంసన్‌కు జరిమానా..

పరాజయ భారంతో ఉన్న రాజస్థాన్ రాయల్స్‌కు షాక్ తగిలింది. ఆ జట్టు కెప్టెన్ సంజూ శాంసన్ పై బీసీసీఐ కొరఢా ఝుళిపించింది. బుధవారం గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్ సందర్భంగా స్లో ఓవర్ రేట్‌కు పాల్పడినందుకుగాను అతనికి రూ. 24 లక్షల జరిమానా విధించింది. ఈ సీజన్‌లో ఇలాంటి తప్పిదానికి పాల్పడటంతో రాయల్స్ కు ఇది రెండోసారి. గతంలో రియాన్ పరాగ్ కెప్టెన్సీ లో చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో స్లోఓవర్ రేట్‌కు పాల్పడినందు కుగాను రాయల్స్ పై ఐపీఎల్ యాజమాన్యం కన్నెర్ర చేసింది. తాజాగా రెండోసారి కూడా ఇలాంటి పొరపాటు చేయడంతో ప్లేయింగ్ లెవన్‌లోని ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 25 శాతం లేదా రూ.6 లక్షల జరిమానా విధించింది.

# బౌండరీలోనూ కింగే

## ఐపీఎల్ చరిత్రలో కోహ్లీ కొత్త రికార్డు

### 726 ఫోర్లు, 278 సిక్సర్లతో మొత్తం 1004 బౌండరీలు

విరాట్ కోహ్లీ ఐపీఎల్ చరిత్రలో 1000 బౌండరీలు (ఫోర్లు, సిక్సర్లు కలిపి) సాధించిన తొలి బ్యాట్స్‌మన్‌గా చరిత్ర సృష్టించాడు. గురువారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఈ మైలురాయిని చేరుకున్నాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లీకి కేవలం రెండు బౌండరీలు అవసరమ య్యాయి, అతను పవర్‌ప్లేలోనే ఒక ఫోర్, ఒక సిక్సర్ సాధించి ఈ రికార్డును నమోదు చేశాడు. కోహ్లీ ఐపీఎల్‌లో ఇప్పటివరకు 257 మ్యాచ్‌లు ఆడాడు, 249 ఇన్నింగ్స్‌లలో 8,232 పరుగులు చేశాడు. అతని కెరీర్‌లో 726 ఫోర్లు మరియు 278 సిక్సర్లతో మొత్తం 1004 బౌండరీలు సాధించాడు (ఏప్రిల్ 10, 2025 నాటికి). ఈ సాధనతో అతను ఐపీఎల్ చరిత్రలో ఈ మైలురాయిని అందుకున్న తొలి ఆటగాడిగా నిలిచాడు. రెండో స్థానంలో ఉన్న శిఖర్ ధవన్ (768 ఫోర్లు, 152 సిక్సర్లు - మొత్తం 920 బౌండరీలు), డేవిడ్ వార్నర్ (653 ఫోర్లు, 246 సిక్సర్లు - మొత్తం 899 బౌండరీలు) అతని కంటే చాలా వెనుక ఉన్నారు.

ఈ సీజన్‌లో కోహ్లీ ఇప్పటివరకు ఐదు మ్యాచ్‌లలో 164 పరుగులు చేశాడు, సగటు 54.66 మరియు స్ట్రైక్ రేట్ 143.85తో రాణిస్తున్నాడు. అతను ఈ ఘనతను ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో సాధించడం విశేషం, ఎందుకంటే అతను ఈ జట్టుతో పాటు చెన్నై సూపర్ కింగ్స్, పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్‌లపై 1000 కంటే ఎక్కువ పరుగులు చేసిన ఏకైక ఆటగాడు. ఈ రికార్డు కోహ్లీ యొక్క స్థిరత్వాన్ని, దీర్ఘకాల ప్రదర్శనను సూచిస్తుంది, అతను 2008 నుంచి ఆర్‌సీబీ తరపున ఆడుతూ లీగ్‌లో అత్యధిక పరుగులు (8,232) సాధించిన ఆటగాడిగా కొనసాగుతున్నాడు. ఈ మ్యాచ్‌లో కోహ్లీ ఈ ఘనత సాధించడంతో అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. అతని ఈ సాధన ఐపీఎల్‌లో బౌండరీల హిట్టింగ్‌లో అతని ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించింది.

# ఐపీఎల్ నుంచి తప్పుకున్నా హ్యారీ బ్రూక్





ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ ఐపీఎల్ 2025 సీజన్ నుంచి డు. ఢిల్లీ క్యాపిటల్స్ అతన్ని రూ. 6.25 కోట్లకు కొనుగోలు చేసినప్పటికీ, మార్చి 9, 2025న అతను ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఇంగ్లండ్ క్రికెట్ కోసం పూర్తిగా అంకితం కావాలని, తన కెరీర్‌లో బిజీగా ఉన్న సమయం తర్వాత రీఛార్జ్ కావాలని అతను చెప్పాడు. "నేను ఐపీఎల్ నుంచి తప్పుకోవాలనే కఠిన నిర్ణయం తీసుకున్నాను. ఢిల్లీ క్యాపిటల్స్, అభిమానులకు క్షమాపణలు చెబుతున్నాను. ఇంగ్లండ్ క్రికెట్‌కు ఇది ముఖ్యమైన సమయం, రాబోయే సిరీస్‌ల కోసం సిద్ధంగా ఉండాలనుకుంటున్నాను" అని అతను సోషల్ మీడియాలో పేర్కొన్నాడు. ఈ నిర్ణయం వెనుక ఇంగ్లండ్ వైట్-బాల్ కెప్టెన్సీ బాధ్యతలు, జూన్‌లో భారత్‌తో టెస్ట్ సిరీస్, నవంబర్‌లో ఆస్ట్రేలియా లో యాషెస్ ఉన్నాయి. అయితే, బీసీసీఐ కొత్త నియమం ప్రకారం, వేలంలో ఎంపికైన విదేశీ ఆటగాళ్లు సీజన్ మొదలు కాకముందు తప్పుకుంటే రెండేళ్ల నిషేధం విధిస్తారు. దీంతో బ్రూక్ 2025, 2026 సీజన్‌లలో ఆడలేడు, 2027 వరకు ఐపీఎల్‌లో కనిపించడు. 2024లో కూడా అతను అమ్మమ్మ మరణం కారణంగా తప్పుకున్నా డు, కానీ ఈసారి వర్క్‌లోడ్ కారణంగా నిషేధం పొందాడు. మాజీ ఆటగాళ్లు మోయిన్ అలీ, ఆదిల్ రషీద్ బీసీసీఐ నిర్ణయాన్ని సమర్థించారు. "ఇది కఠినం కాదు, జట్టు ప్రణాళికలు చెడిపోతాయి" అని మోయిన్ అన్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్ ఇప్పుడు రీప్లేస్‌మెంట్ కోసం చూస్తోంది, ఇది జట్టు వ్యూహంలో మార్పులను తెస్తుంది.

# చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ ధోనీ



## రుతురాజ్ గైక్వాడ్ ఔట్..

చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ గాయం కారణంగా ఐపీఎల్ 2025 సీజన్ నుంచి తప్పుకోవడం జట్టుకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. ఈ సీజన్‌లో ఇప్పటికే వరుస ఓటము లతో సతమతమవుతున్న చెన్నైకి ఈ వార్త మరింత ఆందోళన కలిగించింది. రుతురాజ్ గైక్వాడ్ మోచేయిలో హెయిర్‌లైన్ ఫ్రాక్చర్ కారణంగా మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఈ విషయాన్ని జట్టు హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ ఏప్రిల్ 10, 2025న ధ్రువీకరించాడు. దీంతో, ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్ గెలిచిన సీనియర్ ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ మళ్లీ కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించనున్నాడు.

ఈ సీజన్‌లో రుతురాజ్ గైక్వాడ్ ఐదు మ్యాచ్‌లు ఆడాడు. 150.62 స్ట్రైక్ రేట్‌తో 122 పరుగులు చేశాడు. ముంబై ఇండియన్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 26 బంతుల్లో 53 పరుగులు, రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో 44 బంతుల్లో 63 పరుగులతో రాణించాడు. కానీ, మిగిలిన మ్యాచ్‌లలో అతని ప్రదర్శన నిరాశపరిచింది. అతను గాయపడిన సమయంలో చెన్నై ఇప్పటికే నాలుగు మ్యాచ్‌లలో ఓడి, పాయింట్ల టేబుల్‌లో తొమ్మిదో స్థానంలో ఉంది. రుతురాజ్ గాయం గురించి మొదట రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో వెల్లడైంది, అయితే అతను ఆ తర్వాత పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో ఆడినప్పటికీ, ఎమ్మార్ఐ స్కాన్‌లో ఫ్రాక్చర్ తేలడంతో సీజన్‌కు దూరమయ్యాడు. ధోనీ 2023లో చెన్నైని ఛాంపియన్‌గా నిలిపాడు, కానీ 2024 సీజన్ ముందు కెప్టెన్సీని రుతురాజ్‌కు అప్పగించాడు. గత సీజన్‌లో చెన్నై ప్లే-ఆఫ్స్‌కు చేరలేకపోయింది. ఈ సీజన్‌లో కూడా తొలి మ్యాచ్‌లో ముంబైపై గెలిచిన తర్వాత వరుసగా నాలుగు ఓటములతో జట్టు కష్టాల్లో ఉంది. ఇప్పుడు ధోనీ కెప్టెన్సీలో చెన్నై తన పాత రూపాన్ని తిరిగి పొందగలదా అనేది ఆసక్తికరంగా మారింది. తదుపరి మ్యాచ్ ఏప్రిల్ 11న చెపాక్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరగనుంది. ధోనీ అనుభవంతో జట్టును మళ్లీ గాడిలో పెట్టగలడని అభిమానులు ఆశిస్తున్నారు.

# మరో మూడ్రోజులపాటు ఉరుములతో వర్షం

- హైదరాబాద్‌లోపలు చోట్ల ఈదురుగాలుల వర్షం
- అప్రమత్తంగా ఉండాలని జిహెచ్ఎంసి సూచన

**హైదరాబాద్, ఏప్రిల్ 10 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలో గురువారం సాయంత్రం పలు చోట్ల వర్షం కురిసింది. ఉదయం నుంచే వాతావరణం చల్లబడగా.. సాయంత్రానికి వర్షం మొదలైంది రాజధాని హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో గురువారం మధ్యాహ్నం నగరమంతా చల్లని వాతావరణం ఏర్పడింది. ఉక్కపోత నుంచి నగర ప్రజలకు ఉపశమనం కలిగింది. వారం రోజుల క్రితం వాన దంచికొట్టిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఉష్ణోగ్రతలు భారీగా నమోదు అయ్యాయి. మళ్లీ ఇవాళ కాస్త ఎండలు నెమ్మదించాయి. మియాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మేడ్చల్, గగిల్లాపూర్ తదితర ప్రాంతాల్లో చిరు జల్లులు పడ్డాయి. ఎస్ఆర్ నగర్, పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో వర్షాలు పడుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్‌లో ఇవాళ తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు కొనసాగే అవకాశం ఉందని వెల్లడించింది. నగరంలో రానున్న 48 గంటల పాటు- ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని పేర్కొంది. ఇదిలావుంటే రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు- ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, సూర్యాపేట, మహబూబా బాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే సూచనలున్నాయని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఇప్పటికే ఎల్లో హెచ్చరికలు జారీచేసినట్లు తెలిపింది. కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉంది. పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉంది. మరికొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. వడగళ్ల వాన కురిసే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. నగరంలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడుతోంది. ఈ గాలి దుమారానికి పలు ప్రాంతాల్లోని భారీ వృక్షాలు విరిగిపడ్డాయి. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జీహెచ్ఎంసీ హెచ్చరించింది. అలాగే భారీ వర్షాలు, ఈదరుగాలులు నేపథ్యంలో మాన్‌సూన్, డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసినట్లు- వివరించింది. విపత్కర పరిస్థితులు ఎదురైతే.. వెంటనే జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 040-2111-1111కు కాల్ చేయాలని నగర వాసులకు సూచించింది. ఆఫీసులు ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లే వాహనదారులు చాలా జాగ్రత్తతో వెళ్లాలని అప్రమత్తం చేసింది. అలాగే కరెంట్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నిలువ వద్దని ప్రజలకు తెలిపింది. ఐటీ- కారిడార్‌లోని ఉద్యోగాలు ఒకే సారి రోడ్లపైకి రావొద్దని నగర ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ఓ వేళ మీరు వెళ్లే రహదారుల్లో భారీగా ట్రాఫిక్ ఉంటే.. 100కు కాల్ చేసి.. మీరు ఏ ప్రాంతంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నారో చెబితే.. ఆ పీఎస్ పరిధిలోని పోలీసులు నిమిషాల్లో అక్కడి చేరుకొని.. ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తారని ట్రాఫిక్ విభాగం పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు.

# బడిబాట తరహాలో పిల్లలను గుర్తించాలి

- అంగన్‌వాడీల్లో చేర్పించాలి
- పిల్లలకు పోషకాహారం అందించేలా కృషి
- అధికారులకు మంత్రి సీతక్క సూచన



**హైదరాబాద్, ఏప్రిల్10 (జనంసాక్షి) :** బడిబాట తరహాలో పిల్లలను గుర్తించి అంగన్‌వాడీల్లో చేర్పించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క సూచించారు. ప్రస్తుతం 30 కేంద్రాల్లో ఒక్క చిన్నారి కూడా లేకపోవడం, 198 కేంద్రాల్లో 5 మంది లోపే ఉండటం, 586 కేంద్రాల్లో 10 మంది లోపే ఉండటం ఆందోళన కలిగించే విషయం అని మంత్రి వ్యాఖ్యానించారు. తెలంగాణ సచివాలయంలో సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ, ఇతర అధికారులు, జిల్లా సంక్షేమ అధికారులు పాల్గొన్నారు. సీతక్క పేర్కొన్నట్టుగా, పోషకాహార తెలంగాణే మన లక్ష్యం. అందుకు అంగన్‌వాడీ సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలన్నారు.. రాష్ట్రంలో 313 అంగన్‌వాడీ కేంద్రాలు ఇంకా తెరుచుకోకపోవడాన్ని తప్పుపడుతూ చిన్నారులు లేరనే సాకుతో వ్యవస్థను నిర్లక్ష్యం చేయవద్దని స్పష్టం చేశారు. సిబ్బందిని ఉత్తేజపరిచేందుకు త్వరలో గ్రేడింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్టు మంత్రి తెలిపారు. మంచి గ్రేడింగ్ పొందిన సెంటర్ల సిబ్బందికి మరియు సంబంధిత జిల్లా అధికారులకు అవార్డులు అందిస్తామని చెప్పారు. అలాగే సరఫరా సామాగ్రిలో నాణ్యత లోపించినట్టయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెరగాల్సిన బాధ్యత అధికారులదేనని మంత్రి స్పష్టం చేశారు. కందిపప్పు కొనుగోళ్ల విషయంలో నిబంధనల ప్రకారం ఈ-టెండర్ విధానాన్ని పాటించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. పాత కాంట్రాక్టర్లకు నామినేషన్ పద్ధతిలో అప్పగించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఇకపై జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని డిస్ట్రిక్ ప్రొక్యుర్‌మెంట్ కమిటీ ద్వారా టెండర్లు పిలవాలని స్పష్టం చేశారు. సామ్, మామ్ ద్వారా బలహీన చిన్నారులను గుర్తించి నివేదికలు సమర్పించాలని, 50 శాతం కేసుల్లో అసలు రిపోర్ట్ చేయకపోవడం వల్ల పలు సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. అలాగే బాల్యవివాహాలు, పిల్లల అమ్మకాలు, నిబంధనలకు వ్యతిరేకంగా జరిగే దత్తత కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# వ్యభిచార గృహాలతో సంబంధం

- భారత సంతతి సిఈవో అరెస్ట్

**వాషింగ్టన్, ఏప్రిల్10 (జనంసాక్షి) :** అమెరికాలో వ్యభిచార గృహాలతో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో భారత సంతతి సీఈఓ అనురాగ్ బాజ్‌పాయ్ అరెస్టయ్యారు. క్లీన్ వాటర్ స్టార్టప్ గ్రేడియంట్ సీఈఓగా పనిచేస్తోన్న అనురాగ్ బాజ్‌పాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు న్యూయార్క్ పోస్ట్ ఓ కథనాన్ని ప్రచురించింది. ఆ వ్యభిచార గృహాల్లో గడిపి, ఎక్కువ మొత్తంలో చెల్లించిన వారిజాబితాలో ఆయన పేరు కూడా ఉందని బోస్టన్ ఏరియా కోర్టుకు సమర్పించిన పత్రాల్లో ఉన్నట్లు పేర్కొంది. వైద్యులు, న్యాయవాదులు, ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ కాంట్రాక్టర్లకు చెందిన ప్రత్యేక గ్రూప్‌లో అనురాగ్ పేరు ఉందని విచారణాధికారులు వెల్లడించారు. ఈ వ్యవహారంలో తమ బాస్ పేరు ఉండటంతో గ్రేడియంట్ సంస్థ సిబ్బంది ఆందోళన వ్యక్తంచేశారు. ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అయితే సంస్థ మాత్రం అనురాగ్‌కు మద్దతు ప్రకటించడంతో పాటు- న్యాయవ్యవస్థపై విశ్వాసాన్ని వ్యక్తంచేసింది. బోస్టన్‌లో గ్రేడియంట్ సంస్థను స్థాపించిన వారిలో అనురాగ్ ఒకరు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో పాఠశాల విద్యను పూర్తి చేసిన ఆయన.. 2006లో యూనివర్సిటీ- ఆఫ్ మిస్సౌరి-కొలంబియా నుంచి మెకానికల్ ఇంజినీరింగ్ పట్టా పొందారు.

# నకిలీ విత్తనాలతో జాగ్రత్త

- గుర్తింపు దుకాణాల నుంచే కొనాలి
- రైతులకు వ్యవసాయాధికారుల సూచన



**నిజామాబాద్, ఏప్రిల్10 (జనంసాక్షి) :** ఎవరు విత్తనాలు కొనుగోలు చేసనా, దుకాణాదారు నుంచి పక్కాగా రషీదు తీసుకోవాలని వ్యవసాయాధికారులు హెచ్చరించారు. విత్తనాల విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, లైసెన్స్ కలిగిన ఫర్టిలైజర్ దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయడంతోపాటు విధిగా బిల్లు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. వ్యవసాయ వానాకాలం సీజన్‌లో రైతులకు అందజేసేందుకు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. వరి, జీలుగు, పెసర, కందులు తదితర విత్తనాలను ఆయా మండలకేంద్రాల్లోని సహకార సంఘాలు ద్వారా రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రైవేటుగా కొనుగోలు చేసేందుకు గానూ హైబ్రీడ్‌కు చెందిన పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇదిలావుంటే జిల్లాలోధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.రైతులు పండించిన ప్రతి ధాన్యంగింజ కొనడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రాల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్న మిల్లర్లు, ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో ధాన్యం కొనుగోలు వివరాలు పొందుపరిచేలా చర్యలు తీసుకున్నారు. ప్రతిరోజు ఎంత ధాన్యం వచ్చింది, ఎంత నిలువ చేసింది, రైతులకు ఏ రోజు బిల్లులు చెల్లించనున్నారనే సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితంగా రైతులు ప్రైవేటు వ్యక్తులకు ధాన్యం అమ్మకుండా కొనుగోలు కేంద్రాలకు తరలించడానికే మొగ్గుచూపారు. జిల్లాలో రైతులు పండించిన పంట దళారుల భారీన పడి నష్టపోకుండా చర్యలు తీసుకున్నారు. రైతులు పండించిన పంటను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తరలించేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. ధాన్యానికి మంచి మద్దతు ధర ఇవ్వడంతోపాటు దళారుల బారిన పడకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేసింది. ధాన్యం కొన్నాక రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తారు. ప్రభుత్వం రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర చెల్లిస్తూ ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే రైతు ఖాతాల్లో డబ్బులను జమ చేస్తోంది.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి


- జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**స్టేషన్ ఘన్‌పూర్, ఏప్రిల్ 10 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. మండలంలోని తానేదార్ పెల్లి గ్రామంలోనిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల బేస్మెంట్ నిర్మాణం పూర్తైన పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయా లబ్ధిదారులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈపథకం ద్వారా నిరు పేదల సొంతింటి కలను నేరవేరుస్తోందని పేర్కొన్నారు. మోడల్ హౌస్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన ఈ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లనిర్మాణాలను త్వరితగతినపూర్తిచేయాలనిసూచిం చారు. బేస్మెంట్ కట్టడం పూర్తైన వాటికి సంబంధించి ఇంటి బేస్మెంట్ చిత్రాలను తీసి యాప్ లో నమోదు చేయాలని, తదుపరి నిర్మాణానికి లక్ష మంజూరు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట గృహ నిర్మాణ పీడీ మాతృనాయక్, ఎంపిడిఓ విజయ శ్రీ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు,ఎంపీ ఓ నర్సింగరావు, సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నేటినుంచి సలేశ్వరం జాతర

- ఉదయం 7 నుంచి అటవీ ప్రాంతంలో అనుమతి



**అచ్చంపేట, ఏప్రిల్ 10 (జనంసాక్షి) :** చుట్టూ అడవి.. కొండలు.. కోనలు.. జలపాతాలు.. ప్రకృతి రమణీయతకు అద్దంపట్టే నల్లమల అటవీ ప్రాంతంలో దట్టమైన లోయ గుహాలో వెలసిన లింగమయ్య దర్శనం పూర్వజన్మసుకృతంగా భావిస్తారు. అలాంటి సలేశ్వరం జాతర ఉత్సవాలు శుక్రవారము నుండి ప్రారంభం కానున్నాయి. ఈ నెల11 నుంచి 13 వరకు జాతర ఉత్సవాలు జరుగనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తులకు అడవిలోకి అనుమతి ఇవ్వనున్నట్లు- అటవీశాఖ అధికారులు ప్రకటించారు. ఉత్సవాలకు సంబంధించి అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. జాతరకు వివిధ రాష్ట్రాల నుండి లింగమయ్య స్వామివార్లను దర్శించుకునేందుకు లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నది. సలేశ్వరం వెళ్లే దారిలో చెంచు గుడారాల మీదుగా దట్టమైన అడవి మధ్య నుంచి రాళ్లు, రప్పులు, లోయలలోదిగి వెళ్లాల్సి ఉంటు-ంది. అక్కడికి వెళ్లడానికి వాహనాల సౌకర్యం ఉండదు. ఇది శ్రీశైలం అడవులలోని ఒక ఆదిమవాసి యాత్ర స్థలము. ఇక్కడ ప్రతి ఏడాది ఒకసారి మాత్రమే జాతరజరుగుతోంది. ఈ జాతర ఉగాది వెళ్లిత తర్వాత తొలిచైత్రపౌర్ణమికి మొదలౌతుంది. శ్రీశైలనికి 60కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. అడవిలో నుంచి ఫరహబాద్ మీదుగా 30 కిలో మీటర్ల వరకువాహన ప్రమాణం చేయాల్సి ఉంటుంది. ఇందులో 30 కిలో మీటర్లు వాహన ప్రయాణం, అక్కడి నుంచి 5 కిలో మీటర్లు కాలినడకన వెళ్లాల్సి ఉంటుంది. ఇక్కడ ఈశ్వరుడు లింగరూపంలో దర్శనమిస్తాడు.ఇక్కడ శంకరుడు లోయలో ఉన్న గుహాలో దర్శనమిస్తాడు. ఇక్కడ సంవత్సరంలో 3 రోజులు మాత్రమే ఈ అడవిలోకి అనుమతి ఉంటుంది. ఇక్కడ జలపాతానికి సందర్శకులు, భక్తులు అందరు ముగ్ధులుఅవుతారు. ఇది నాగర్ కర్నూల్ జిల్లా నల్లమల అడవులలో ఉంది. శ్రీశైలం - హైదరాబాద్ వెళ్లే రహదారిలో శ్రీశైలం అటవీప్రాంతంలో శ్రీశైలం దారినుండి పక్కదారిలో ఫరహబాద్ పులిబొమ్మ నుండిలోపలికి వెళ్లాల్సి ఉంటుంది. హైదరాబాద్ నుండి వచ్చేవారు 130 కి.మీ. ఉమ్మడి పాలమూరు జిల్లా కేంద్రం నుండి వచ్చేవారు 100 కి.మీ, నల్లగొండ జిల్లా నుండి వచ్చే వారు 150 కి.మీ దూరం ప్రయాణం చేసిన తర్వాత మన్ననూర్ గ్రామానికి చేరుకోవాల్సి ఉంటు-ంది. అక్కడి నుండి శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన జాతీయ రహదారి మీదుగా మన్ననూర్ నుండి 15 కి.మీ దూరంలో ఉన్నఫరహాబాద్ చౌరస్తాకు చేరుకోవాలి. అక్కడి నుంచి పూర్తిగా దట్టమైన అటవీమార్గన సుమారు 30 కిలో మీటర్ల దూరంలో దట్టమైన అడవిప్రాంతంలో రాంపూర్పెంటకు చేరుకోవాలి. అక్కడి నుండి మరో 2 కి.మీ. దూరం ఆటోల ద్వారా వెళ్లే ప్రధాన మార్గం వద్దకు చేరుకోవాలి. అక్కడినుండి మరో 3 కి.మీ దూరం కాలినడకన కొండలు, గుట్టలు దాటు-కుంటూ సలేశ్వరం గుడివద్దకు సాహసయాత్ర చేయాల్సి ఉంటు-ంది. రెండో మార్గం నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని అప్పాయిపల్లి గ్రామం మీదుగా కాలినడకనతో పాటు- ట్రాక్టర్ల ద్వారా కొండలు, గుట్టల నుండి సాహసంగా సలేశ్వరం చేరుకోవాల్సి ఉంటు-ంది. ఫరహాబాద్ నుండి పదికిలోమీటర్ల దూరం వెళ్లగానే రోడ్డు ప్రక్కన నిజాం కాలం నాటి పురాతన కట్టడం కనబడుతుంది. నల్లమల అటవీప్రాంతం, వన్యప్రాణులను సంరక్షణకు సలేశ్వరం జాతరకు వచ్చే భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని అటవీ అధికారులు అన్నారు. ఆరోగ్యంగా ఉన్న వాళ్లు మాత్రమే రాగలరు. ఈ నెల 11, 12, 13 వరకు మూడు రోజులపాటు- సలేశ్వరం జాతరకు అనుమతి ఉంటుంది. చెంచుల ఆచార వ్యవహారాల ప్రకారం జాతరలు నిర్వహించుకునేందుకు ఆటవీశాఖ ఆటంకం కల్గించదు. సలేశ్వరం జాతరకు వచ్చే భక్తులు అటవీ పరిసరప్రాంతాల్లో ప్లాస్టిక్ వాడకం, బీడీ, చుట్ట, సిగరేట్ కాల్చడాన్ని పూర్తిగా నిషేధించారు.

# రాణా అప్పగింత భారత్ దౌత్య విజయం

- అమెరికా కోర్టుల్లో మూసుకుపోయిన దారులు
- ఎట్టకేలకు భారత్‌కు అప్పగించిన అమెరికా

**ముంబై, ఏప్రిల్10 (జనంసాక్షి) :** ముంబయిలో 16 ఏళ్ల క్రితం జరిగిన ఉగ్రదాడిలో 10 మంది ఉగ్రవాదులు సృష్టించిన మారణహోమం యావత్ ప్రపంచాన్ని షాక్‌కు గురిచేసింది. ఆ దాడికి కీలక సూత్రధారుల్లో ఒకడిగా భావిస్తున్న తహవ్వుర్ హుస్సేన్ రాణాను పలు కేసుల్లో అమెరికా గతంలోనే అరెస్టు చేసింది. అయితే, ముంబయి దాడి కేసులో విచారించేందుకు గాను అతడిని భారత్‌కు తీసువచ్చేందుకు దాదాపు 14ఏళ్లు పట్టింది. దాడికి సూత్రధారి అయిన పాకిస్థానీ అమెరికన్ ఉగ్రవాది డేవిడ్ కోల్‌మన్ హెడ్లీకి రాణా చిన్ననాటి స్నేహితుడు. హెడ్లీ తండ్రి పాక్ దౌత్యవేత్త కాగా తల్లి అమెరికా దేశస్థురాలు. బాల్యంలో పాకిస్థాన్‌లో గడిపిన హెడ్లీ, రాణా చదివిన సైనిక పాఠశాలలో చదువుకున్నాడు. అనంతరం అమెరికా వెళ్లినప్పటికీ పాక్ ఉగ్రసంస్థతో హెడ్లీ సంబంధాలు కొనసాగించాడు. ఈ క్రమంలోనే బిజినెస్ కన్సల్టెంట్‌గా భారత్‌లో పలుమార్లు పర్యటించాడు. ఇతడికి తన ఇమిగ్రేషన్ సంస్థ తరఫున తహవ్వుర్ సాయం చేసినట్లు- సమాచారం. ముంబయి దాడులు జరిగిన ఏడాది అనంతరం 2009 అక్టోబరులో అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ చేతికి రాణా చిక్కాడు. లష్కర్-ఏ-తొయిబా తోపాటు, డెన్మార్క్ వార్తా పత్రిక కార్యాలయాలపై దాడికి కుట్ర పన్నాడనే అభియోగాలపై షికాగోలో అతడిని అరెస్టు చేశారు. అనంతరం లాస్‌ఏంజెలెస్‌లోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్‌లో నిర్బంధంలో ఉంచారు. ఉగ్రదాడికి సంబంధించి ముంబయి పోలీసులు 2009లో వేసిన తొలి ఛార్జిషీటులో రాణా పేరు లేదు. కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ 2011లో వేసిన ఛార్జిషీట్‌లో మాత్రం తొలిసారి అతడి పేరును పేర్కొంది. ఈ దాడికి ప్రధాన కుట్రదారుల్లో రాణాను ఒకడిగా తెలిపిన ఎన్ఐఏ దాడికి సూత్రధారి అయిన పాకిస్థానీ అమెరికన్ ఉగ్రవాది డేవిడ్ కోల్‌మన్ హెడ్లీకి రవాణా పరంగా, ఆర్థికంగా ఎలా సాయం చేశాడనే వివరాలను స్పష్టంగా వెల్లడించింది. రాణాను తీసుకువచ్చేందుకు దౌత్య ప్రయత్నాలు మొదలుపెట్టిన భారత్.. అతడిని అప్పగించాలని కోరుతూ అమెరికా ప్రభుత్వానికి 2019లో లేఖ రాసింది. అనంతరం అతడి అరెస్టు వారెంటును కోరుతూ 2020లో అభ్యర్థించగా కాలిఫోర్నియా కోర్టు అందుకు అనుమతించింది. అయితే, ఇప్పటికే ఒకేవిధమైన ఆరోపణలపై రెండుసార్లు ఎలా విచారిస్తారంటూ రాణా తరపు న్యాయవాదులు వాదించారు. అయినప్పటికీ వారి వాదనను కోర్టు తోసిపుచ్చింది. అప్పటి అధ్యక్షుడు జో బైడెన్ కూడా భారత్‌కు రాణాను అప్పగించేందుకు అంగీకరించారు. భారత్‌కు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక న్యాయస్థానాల్లో రాణా అనేక పిటిషన్లు దాఖలు చేశాడు. ఈ క్రమంలో శాన్ ఫ్రాన్సిస్కోలోని అప్పీల్ కోర్టు.. అప్పగింతపై ఆదేశాలు ఇవ్వడంతో చివరకు నవంబర్ 2024లో సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. ఆ రివ్యూ పిటిషన్‌ను ఈ ఏడాది జనవరి 21న అమెరికా సర్వోన్నత న్యాయస్థానం కూడా తోసిపుచ్చడంతో భారత్‌కు అప్పగించడం అనివార్యమైంది. మోదీ అమెరికా పర్యటనకు ముందు రోజు ఫిబ్రవరి 11న ఇదే అంశంపై మాట్లాడిన విదేశాంగ మంత్రి మార్కో రూబియో.. రాణాను భారత్‌కు అప్పగించే విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. అయితే, ఆరోగ్య కారణాలను చూపుతూ అప్పగింతను నిలిపివేయాలని జిల్లా కోర్టులు సహా సుప్రీంను ఆశ్రయించినప్పటికీ అవి తిరస్కరణకు గురికావడంతో భారత్ విమానం ఎక్కడం అనివార్యమైంది.

# పోలీసులు అదుపులో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

**గుంటూరు, ఏప్రిల్10 (జనంసాక్షి) :** వైసీపీ పార్టీ మాజీ ఎంపీ గోరెంట్ల మాధవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏపీ మాజీ సీఎం, పులివెందుల ఎమ్మెల్యే జగన్ సతీమణి భారతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసి నిందితుడిగా ఉన్న చేబ్రోలు కిరణ్‌ను అందుపులోకి తీసుకున్నారు. ఇక అదుపులోకి తీసుకుంటున్న సమయంలో మంగళగిరి నుంచి గుంటూరుకు తరలిస్తున్న సమయంలో గోరెంట్ల మాధవ్ పోలీసు వాహనాన్ని వెంబడిస్తూ, ఆ వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. గోరంట్ల మాధవ్ చేయి చేసుకునే ప్రయత్నం, అలాగే ఎస్కార్ట్ వాహనాన్ని అడ్డగించడం వల్ల పోలీసుల విధులకు ఆటంకంగా భావిస్తూ ఆయనపై కేసు నమోదు చేసినట్లు- సమాచారం. ఈ ఘటనతో గుంటూరు జిల్లాలో కొంత ఉద్రిక్తత నెలకొంది. మాజీ ఎంపీ మాధవ్‌ను అరెస్ట్ చేయడం రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్ స్పందించారు. యూట్యూబ్ ఛానెల్ లో కిరణ్ మాజీ సిఎం భార్యపై అసభ్యకరంగా మాట్లాడాడని, దీంతో అతన్ని అరెస్టు చేశామని తెలిపారు. ఈ నేపథ్యంలో మొత్తం నాలుగు కేసులు కిరణ్ పై ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం అతడిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపుతున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి రజిని పై కూడా అసభ్యకరమైన పోస్టులు కిరణ్ పెట్టాడని, దానికి సంబంధించి కూడా కేసు నమోదైందని తెలిపారు. అయితే అతడిని ఆరెస్ట్ చేసి వాహనంలో తరలిస్తున్న సమయంలో గోరంట్ల మాధవ్ వెంబడించినట్లు సమాచారం ఉందని, ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని తెలిపారు.

# వరి ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళిక ఉండాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి




**వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 10 (జనంసాక్షి):** రబి (యాసంగి) సీజన్ లో వరి ధాన్యం కొనుగోలు కు సంబంధించి ముందస్తు ప్రణాళికలు రూపొందించు కోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం వ్యవసాయ, సహకార శాఖల ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు, హార్వెస్టింగ్ యజమానులతో జరిగిన అవగాహన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారదముఖ్య అతిథిగా పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో రబి 2024- 25 (యాసంగి ) సీజన్ లో సుమారు 2.57 లక్షల మెట్రిక్ టన్నుల అంచనా ధాన్యం రానున్నందున, ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా సుమారు 182 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యాసంగిలో జిల్లాలో పండిన ప్రతి ధాన్యం గింజ కొనుగోలు కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. దశలవారీగా నియంత్రణకు సంబంధిత అధికారులందరూ ముందస్తు చర్యలు చేపట్టాలని, కోతలను దశలవారీగా చేపడితే కొనుగోలు కేంద్రాలకు ధాన్యం దశలవారీగా వచ్చే అవకాశం ఉందని తెలిపారు. క్రాప్ బుకింగ్ డేటా ఆధారంగా ఏ పంట ఎన్ని రోజులకు కోత దశకు వస్తుందో వ్యవసాయ శాఖ అధికారులకు పూర్తి అవగాహన ఉన్నందున దానికి తగినట్లుగా కోతలను నిర్వహించాలని కోరారు. రాకపోకలను సరిగ్గా అంచనా వేయాలని, పిపిసిఎస్ వద్ద తొందరపడకుండా పిపిసి లకు ధాన్యం తీసుకురావడానికి ముందస్తుగా తేదీ మరియు సమయాన్ని సూచిస్తూ రైతులకు టోకెన్లను జారీ చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయ అధికారి రాజమణి, జిల్లా రవాణా అధికారి శోభన్ బాబు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, ఎం ఈ ఓ లు, ఏఈఓ లు, హార్వెస్టర్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370